# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

మంగళవారము, ఫిబ్రవరి 15, 2005

12 వ శా. స. III స. వాల్యూం -- I నంబరు --1

శక సంవత్సరము - 1926, మాఘం - 26

## TUESDAY, THE 15th FEBRUARY, 2005

**12 L.A. III S. VOL-- I No. - 1**

26 - Magha , 1926 - S.E.

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ

# ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్ రెడ్డి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ సి. నర్సిరెడ్డి<br>శ్రీ బి. వేదవ్యాస్<br>డా. జి. కుతూహలమ్మ<br>శ్రీ డి. శ్రీధర్ బాబు<br>శ్రీ ఎ. గోవింద నాయక్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| సంయుక్త కార్యదర్శి | : | శ్రీమతి వి. జయకుమారి<br>శ్రీ పి. వెంకటరామారావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్.ఆర్.సి. నర్సరాజు<br>శ్రీ బి. పద్మారెడ్డి<br>శ్రీ షాబాజ్‌ఖాన్<br>శ్రీ ఎస్. వెంకటేష్ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ ఎస్. రాజ సదారామ్<br>శ్రీ యు. జగదీశ్వర్<br>శ్రీ ఎన్. అంజయ్య<br>శ్రీ డి.శివరావు<br>శ్రీ ఎం. పాండురంగాచార్య<br>శ్రీ పి. సీతారాములు<br>శ్రీ కె.ఎ.నర్సింహరాజు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ డి. నర్సింహులు |

--------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక

( పన్నెండవ శాసనసభ)
( మూడవ సమావేశపు : మొదటి రోజు )
మంగళ వారము, ఫిబ్రవరి **15, 2005**
సభ ఉ. గం. **8.30** లకు ప్రారంభమైనది
( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

**15-2-2005**

## విషయ సూచిక

1. సంతాప ప్రతిపాదనలు

1. భారత మాజీ ప్రధాన మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహా రావు గారి మృతి గురించి.
2. 2004, డిసెంబరు 26వ తేదీన సునామి ఉపద్రవం సందర్భంగా ప్రజలకు వాటిల్లిన కష్టనష్టాల గురించి.
3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ్యుడు శ్రీ పరిటాల రవీంద్ర గారి మృతి గురించి.

----------

## సంతాప ప్రతి పాదనలు.

### 1. భారత మాజీ ప్రధాన మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ పి.వి. నరసింహా రావు గారి మృతి గురించి.

డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, దివంగత భారత మాజీ ప్రధాని పి. వి . నరసింహారావు గారిని గురించి సంతాప తీర్మానం ప్రవేశపెడుతున్నాము. ఆయన గురించి ఎంత చెప్పినా చాలదు. సాధారణ వ్యక్తిగా సాధారణ కుటుంబంలో వారు జన్మించారు . వారు కరీంనగర్ జిల్లా , వంగర గ్రామానికి చెందిన వారు. ఆయన స్వామీ రామానంద తీర్థ అనుయాయులు . నిజాం వ్యతిరేక పోరాటం మొదలుకొని భారత దేశాన్ని అప్పుల ఊబిలో నుంచి తప్పించి, భారత దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడై మొత్తం దేశంలో తనదైన ముద్ర వేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి వారు. ఆయన అత్యంత ప్రతిభా మూర్తి, బహు భాషా కోవిదుడు . 14 భాషలలో వారు మామూలుగా మాట్లాడటమే కాదు కోవిదుడు కూడా. సాహితీ వేత్త , రాజనీతిజ్ఞుడు . వారి గురించి ఎంత మాట్లాడినా తక్కువే అవుతుంది.

రాష్ట్రంలో వారు విద్యా మంత్రిగా , దేవాదాయ మంత్రిగా, వివిధ శాఖలలో మంత్రులుగా పని చేశారు. దేవాదాయ మంత్రిగా వారు దేవాలయాల పరిరక్షణ కోసం చేసిన కృషి ని ఇప్పటికీ చాలా మంది అనుకుంటూ ఉంటారు. అందులో మార్పులు కనపడుతూనే ఉంటాయి. మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తన భాధ్యతలను చేపట్టిన తర్వాత భారత దేశంలోనే ఇతర రాష్ట్రాలలో ఎక్కడా కూడా జరగని విధంగా భూసంస్కరణలు తీసుకు వచ్చిన మనిషి ఆయన . చాలా మంది పెద్ద వారికి ఈ భూ సంస్కరణలు తీసుకు రావడం ఇష్టం ఉండేది కాదు. అయినా ఒక నిబద్ధతతో సమాజంలో పేద వాడికి, అత్యంత పేదవాడికి , బలహీన వర్గాలకు సంబంధించిన వారికి ఆర్థిక ప్రయోజనాలు కలగాలంటే భూమి అనేది చాలా అవసరం అని,
ఆ భూమిలో అతనికి భాగం ఇవ్వడం చాలా అవసరం అనీ గుర్తించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కేవలం పెద్ద పెద్ద వారికోసం, భూస్వాములు, వ్యాపార వేత్తల కోసం మాత్రమే కాదు. సమాజంలోని అట్టడుగున ఉన్న వారిని కూడా ఆర్థిక ంగా, సామాజికంగా ముందుకు తీసుకు వెళ్లాల్సి ఉందని, ఆ విధంగా తీసుకు వెళ్లిన నాడే స్వాతంత్ర్యానికి సార్థకత చేకూరుతుందని నమ్మారు. ఆ విధంగా చేయడంలో వారు ఎక్కడా కూడా రాజీ పడకుండా ఎన్నో రకాలుగా భూ సంస్కరణల విషయంలో ఎంతమంది వ్యతిరేకించినా కూడా వారు వెనుతిరగ కుండా ఆ చట్టాన్ని తీసుకు వచ్చి , దానిని అమలు పరచే దిశలో ముందుకు పోయే విధంగా చాలా గట్టిగా కృషి చేశారు.

ఈ రోజు ఈ రాష్ట్రంలో ఒక కోటి పది లక్షల వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయి. అందులో కనీసం 90 శాతం మంది సన్నకారు, చిన్నకారు రైతులు ఉన్నారు. అంతమంది సన్నకారు, చిన్న కారు రైతులు ఈనాడు ఉన్నారు అంటే , అది ఆయన ప్రవేశపెట్టిన భూసంస్కరణల కారణమేనని మనవి చేస్తున్నాను.

ప్రభుత్వానికి సంబంధించిన భూములు బీద వారికి ఇవ్వడంలో పి.వి. నరసింహా రావు గారు పూర్తిగా కృషి చేశారు. వారు ఈ రాష్ట్రంలో మ్యుమంత్రిగా పదవీ విరమణ చేసిన తర్వాత కేంద్రంలో వివిధ మంత్రి వర్గ శాఖలలో పని చేశారు. మరి ముఖ్యమంత్రి గానే కాకుండా, వారు ఇందిరాగాంధి గారికి, రాజీవ్ గాంధీ గారికి రాజకీయ సలహాదారుగా ఉన్నారు. మొత్తం భారత దేశంలో కాంగ్రెసు కమిటీ సమావేశం వచ్చినా ఎక్కడ పాలన గురించిన, ఎక్స్‌టర్నల్ ఎఫెయిర్స్ గురించి రాయాలన్నా, లేక ఇంటర్నేషనల్ ఎఫెయిర్స్ గురించి రాయాలన్నా , కాంగ్రెసు పాలసీ మేకర్స్‌లో ఒకరిగా కొన్ని దశాబ్దాలు ఆయన రాణించారు. వారు ఆ విధంగా నిర్వహించిన పాత్ర అందరికీ కంటికి కనిపించకపోవచ్చు . కానీ అది అనిర్వచనీయమైనది. ఆయన తెచ్చిన మార్పు్కగా తెలిసిన వారికి కనపడుతుంది.

మానవ వనరుల శాఖా మంత్రిగా ఉన్నప్పుడు నవోదయా విద్యాలయ వ్యవస్థను భారత దేశంలో కొత్త మార్పు తీసుకు వచ్చింది. పేద వారికి కూడా సమాజంలో పెద్ద వారికి ఉన్న అవకాశాలు ఏమాత్రం తక్కువ లేకుండా కల్పించాలన్న విధంగా వ్యవహరించారు.

విదేశాంగ మంత్రిగా ఉండి కేంద్రంలో ఆయన నిర్వహించిన పాత్ర , వారి రాజనీతజ్ఞతకు అద్దంపడుతుంది. ఇతర దేశాలలో ఎక్కడికి పోయినా , ఎవరితో మాట్లాడినా వారు భారత దేశం గురించి , భారత దేశం యొక్క పాత్ర గురించి ఎవరూ మరచిపోలేనంతగా మానవ వనరుల శాఖను నిర్వహించారు.

విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు వారికి వచ్చిన అనుభవం, వారు ప్రధాన మంత్రిగా రాణించడానికి బాగా దోహదపడింది. వారు భారత దేశం యొక్క ప్రధాన మంత్రిగా బాధ్యత తీసుకున్నప్పుడు భారత దేశం యొక్క ఆర్థిక వ్యవస్థను ఒకసారి మనం గుర్తుకు తెచ్చుకోవాలి. వారు ప్రధాన మంత్రి అయినప్పుడు భారత దేశానికి సంబంధించిన ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నం అయివుంది. విదేశీ మారక ద్రవ్యం నిల్వలు లేక భారత దేశానకి సంబంధించిన కొన్ని టన్నుల బంగారాన్ని ఇంగ్లండులో కుదువ పెట్టవలసినటువంటి పరిస్థితి , ఆ నాడు వారు ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన రోజున ఉంది. అలాంటిది ఆయన రెండు సంవత్సరాలు కూడా తిరగకుండానే వారు తాను అమలు పరచిన ఆర్థిక సంస్కరణల ద్వారా ఆ బంగారాన్ని వెనుకకు తీసుకు రావడం జరిగింది. అటువంటి ఆర్థిక సంస్కరణలను వారు అమలు పరచారు. దానివల్ల దేశం యొక్క ఆర్థిక పురోగతి ప్రధానంగా చాలా ముందుకు పోయింది. అంతకు ముందు రెండు సంవత్సరాలలో ఉన్న పరిస్థితి ఆయన అధికారంలో ఉన్న 5 సంవత్సరాలలో పరిస్థితికి ఏ మాత్రం పొంతన లేని విధంగా మారింది. వారు ఉన్న 5 సంవత్సరాలలో ఆర్థిక పరిస్థితి పెరిగింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక శాఖా మంత్రిగా, వారు ప్రధాన మంత్రిగా ఈ దేశం ఈ మేరకు ఇవ్వాళ అభివృద్ధి చెందింది , అంటే ఆయన పాత్ర తప్పనిసరిగా ఉంది. ఆయన ఖచ్చితమైన నిర్ణయం తీసుకుని సరళీకృత ఆర్థిక విధానాలలోకి, విదేశాల పెట్టుబడులు తీసుకు వచ్చిన పెట్టుబడుల వల్ల మౌలిక రంగాలలో , ప్రైయివేటు పెట్టుబడులలో విదేశీ సంస్థల పెట్టుబడులు వస్తే , వచ్చే ఆదాయం డబ్బు పూర్తిగా గ్రామీణ అవసరాలకు చెందాలని, రూరల్ డెవలప్‌మెంట్‌కు వెచ్చించాలనుకున్నారు. అంతకు ముందు పంచవర్ష ప్రణాళికలో కేవలం రూ. 6 వేల కోట్ల మటుకే భారత దేశం ఇందుకు ఖర్చు పెడితే , నరసింహా రావు గారు ప్రధాన మంత్రిగా వచ్చిన అనంతరం , వచ్చిన పంచవర్ష ప్రణాళికలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత రూ. 30 వేల కోట్లుగా పెరగడం జరిగింది.

ఉ.8.40

అధ్యక్షా, 6 వేల కోట్లరూపాయలు నుంచి 30 వేల కోట్ల రూపాయలు మొట్టమొదటిసారిగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్జీవింప చేసే విషయంలో అంత పెద్ద ఎత్తున బడ్జెటు కేటాయింపులు ఆయన ద్వారానే జరిగాయి. దేశానికి రాజు అయిన తల్లికి కొడుకే అని రవీంద్రభారతి, హైద్రాబాదులో మాట్లాడుతూ ఆయన అన్నారు. ఆయన ప్రధానమంత్రిగా అయ్యాక అన్న ఈ మాట మనందరి హృదయాలలో శాశ్వతంగా నిలబడిపోతుంది. ఆయన మాటలు ఆయన నిరాడం బరతను, ఆయనయొక్క మనసత్వాన్ని పూర్తిగా వెల్లడిస్తాయి. ప్రపంచం అంతా కీర్తించిన మేధావి ఆయన. ఆయన తెలుగువారు కావడం మనందరికి కూడా గర్వకారణం . ఆయన ఇంత ఇన్ని రకాలుగా ఇన్ని గొప్ప కార్యక్రమాలు చేసిన ఇంత పెద్దఎత్తున ఎదిగినా ఆయనకు కూడా కొన్ని ఇబ్బందులు రాకతప్పలా, మనందరికి ఒక సంతృప్తిని ఇచ్చే విషయం ఏమంటే ఆయన పైన వచ్చిన నీలాపనిందులు కోర్టులు ఆయన బ్రతికి ఉండగనే అందులో ఏ మాత్రం నిజం లేదని ఆయన నిర్దోషిత్వాన్ని కోర్టులు కూడా ధృవికరించాయి. ఆయన చివరి రోజుల్లో ఆయన మనస్సుకు బాగా సంతృప్తిని ఇచ్చే విషయం అది. అది కాకుండా కేసులు పెండింగ్‌లో ఉండగనే పరమపదించి వుంటే ఆ బాధ ఎప్పుడు మిగిలిపోయి వుండేదని మా అందరికి అనిపించేది. ఏది ఏమైనా భగవంతుడు ఆయన పట్ల ఉన్నాడు కాబట్టి ఆయన బ్రతి ఉండగానే ఆయన పైనఉన్న కేసులు అన్ని నీలాపనిందలు ఏ మాత్రం నిజం కాదు అని కోర్టులు ధృవీకరించడం ఒక హర్షణీయమైన విషయం . ఆయనయొక్క చివరి సంస్కారాలు ఇక్కడనే నిర్వహించాము. చాలా ఘనంగానే నిర్వహించాము. మనం గర్వించతగ్గ విధంగానే ఏర్పాటు చేసుకున్నాము. అక్కడ మంచి స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. అత్యంత త్వరలోనే ఆ కార్యక్రమాన్ని మొదలు పెడుతుంది. ఆయనయొక్క స్మృతి శాశ్వతంగా

ఉండాలనే ఉద్దేశ్యంతో శ్రీశైలం కుడి బ్రాంచి కాలువకు శ్రీ పి.వి. నరసింహారావు కాలువగా నామకరణం చేయడం జరిగింది. శ్రీ పి.వి. నరసింహరావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆ నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గానికి మేలు చేసే ఎస్.ఆర్.బి.సి.ని శ్వాశ్వతంగా ఆయన పేరు మనందరిక గుర్తుండే విధంగా పి.వి.నరసింహరావు కాలువగా నామకరణం చేసుకొని , ఆయన స్మృత్యర్ధ్యం ఇక్కడ ఒక మంచి మెమోరియల్ ఏర్పాటు చేసుకొని ఆయనను శాశ్వతంగా గుర్తు పెట్టుకోవాలని, ఇవాళ ఆయన మనముందు లేకపోయినా ఆయన ఆదర్శాలను, సరళికృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టారు. కాని తరువాత, తరువాత ఈ సరళీకృత ఆర్థిక విధానాలు అవసరమైన మేరకు హ్యూమన్ ఫేస్ దానికి ఉండాలి. ఈ సరళికృత ఆర్థిక విధానాలు మంచివి కాని, దానివల్ల సాధారణ పౌరులు ఇబ్బందిపడకూడదు. బీదవాడు మరింత బీదవాడు కాకూడదు. వాటిల్లో అవసరమైన మేరకు మార్పులు చేయవలసిన అవసరం వున్నదని ఈ మధ్య కాలంలో మూడు సంవత్సరాలుగా 3,4 సార్లు మాట్లాడడం కూడా జరిగింది. ఏ యొక్క పాలసీ అయినా కూడా సరళీకృత ఆర్థిక విధానాలు మంచిది కాదనడం లేదని, అవసరమైన మేరకు ప్రతి సంవత్సరానికో, 4,5 సంవత్సరాలకో any continuing policy will have to be rviewed. అదే విషయమై మేలు చేయాలని ఉద్దేశించబడ్డదో ఆ ఉద్దేశ్యాలకు ఎక్కడైనా డీవియేషన్ వుంటే అవసరమైన మేరకు అవి సరిదిద్దుకోవాలి. అల్టిమేట్‌గా సరళీకృత ఆర్థిక విధానంవల్ల మొత్తానికి మొత్తం దేశానికి సంబంధించి ఆర్థిక వ్యవస్థ మేలు కావాలి తప్ప పెద్ద వాళ్లకి చిన్న వాళ్లకి ఉన్న ఆర్దిక తేడాలి మాత్రం పెరగకూడదు. చిన్న వాళ్లు మరింత మెరుగుపడడానికిఈ సరళీకృత ఆర్థిక విధానాలు ఉపయోగ పడాలని చెప్పి ఆయన చాలా గట్టిగా అన్నారు. ఒకసారి సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన కొత్తలో పార్లమెంటులో మాట్లాడుతూ అన్నారు. I do not remember the exact date. I think he was responding to the Presidential Address. Motion of Thanks to the President's Address. దానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో ఆయన పాల్గొంటూ అంతకుముందు మాట్లాడిన వక్తలు ఆ రోజున వాషింగ్ మిషన్సు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం జరగకూడదు, లేదు భారత దేశంలో తయారు కావడానికి కూడా అవకాశం ఇవ్వకూడదు. ఇది అంటూ వస్తే మార్కెట్‌ను ఫ్లడ్ చేస్తే చాలా మందికి పనిచేసుకుంటున్న, వాళ్లకి ఐదర్ ఉమన్ ఫోక్ అంటే చాలామంది ఇళ్లలో పనిచేసుకుంటున్న మహిళలు కాని, ఇళ్లు ఊడ్చుకుంట్ను వాళ్లకి కాని, హౌస్ మేడ్సు కాని బట్టలు ఉతకడమే వృత్తిగా పెట్టుకున్న వాళ్లకి పనులు లేకుండా పోతాయని,ఈ దేశంలో ఇటువం టివి రానివ్వకూడదు, అదే పద్ధతిలో ఆ రోజు పార్లమెంటులో అంతా అన్నారు. శ్రీ పి.వి. నరసింహరావుగారు జవాబు ఇస్తూ అన్నారు. I do not want the womenfolk in my country to be just house maids who take take care of washing the clothes. I want women of my country to be in every way. వాళ్లు అన్ని విధాలుగా కూడా మెరుగైన విధంగానే రావాలి, మెరుగైన వారిగా ఉండాలి. వారిని కేవలం హౌస్ మేడ్సుగా చూడదల్చుకోలేదు. వారిని టెక్నీషియన్సుగా, ఇంజనీర్సుగా, డాక్టర్సుగా చూడాలి. సామాజికంగా ప్రభావితంచేసేంత పెరగాలి, అటువంటి భారతీయ మహిళను నేను చూడాలని అనుకొంటువుంటే మీరు ఈ విధంగా వాషింగ్ మిషన్సు లేకపోతే వాళ్లు పనిలేకుండా పోతుందని అంటున్నారు ఇది తప్పు . వాళ్లు చేయవలసిన పనులు బట్టలు వుతకడం కంటే అంతకంటే మేలైన పనులు కోసమే ఈ సరళికృత ఆర్థిక విధానం కావాలి మరొకటి కావాలి తప్ప బీదవాడ్ని మరింత బీదవాడ్నిగా చేయడానికి కాని ఈ సరళికృత ఆర్థిక విధానం నేను తేవడంలేదని చెప్పి చాలా నిష్కర్షంగా he had a very distinct vision. శ్రీ పి.వి.నరసింహరావుగారు మన మధ్య లేకపోవడం ఎంతైనా బాధాకరమైన విషయం . ఆయన ప్రధాన మంత్రిగా ఉండగానే మహిళలకు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయడం ఆయన ద్వారానే జరిగింది. ల్యాండ్ సీలింగ్ విషయంలో ఆయనకు ప్రత్యేకమైన నిబద్ధత ఉండేదో, మహిళల సాధికారత పట్ల మహిళలయొక్క ఆర్థిక అభ్యున్నతి పట్ల ఆయనకు ప్రత్యేకమైన ఆలోచన విధానం ఉండేది. ఆ ఆలోచన విధానంలో భాగమే డ్వాక్రా మహిళలకు పొదుపు గ్రూపులను ఏర్పాటు చేయడం ఒక ఒరవడికి స్వీకారం చుట్టిన మహనీయుడు ఆయన. అటువంటి మహనీయుడు ఇవాళ మనలో లేకపోవడం చాల విచారకరం . ఆయన ఇవాళ మనలో లేకపోయిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకొనిపోయే ప్రయత్నం చేద్దాము. ప్రతి బీద వాడు కూడా ఆర్దిక, సాంఘిక , సామాజికంగా ముందుకు రావాలని ఆయన ఆలోచన. ప్రత దళితుడు, బలహీనవర్గాలకు, వారిని గురించి ఆయన చేసిన ఆలోచన ముందుకు తీసుకుపోవడం, ప్రతి మహిళ గురించి ఆయన చేసిన ఆలోచన వారి సాధికారిత పట్ల ఆయన చేసిన నిబద్ధత

ఆయనకు ఉన్న  నిబద్ధత మరింత ముందుకు తీసుకొనిపోవడం మనందరియొక్క బాధ్యత. ఆయన లేకపోవడం చాలా బాధాకరమైన విషయం .  ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాము. కాంగ్రెస్ పార్టీ శాసన సభ పక్షం తరుపున చాలా మంది మా శాసన సభ్యులు మంత్రులు మాట్లాడుతారు, శాసన సభ పక్షం తరుపున ఆయన మృతి పట్ల మా ప్రగాఢమైన సంతపాన్ని తెలుపుతూ

''భారత మాజీ ప్రధాన మంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, అరుదైన రాజనీతిజ్ఞుడు, సంస్కరణవాది, బహుముఖీనమైన వక్తిత్వంకలిగిన శ్రీ పి.వి.నరసింహారావుగారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.''

ఈ సంతాప ప్రతిపాదనను ఈ సభ ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

ఉ.8.50

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు (కుప్పం):  అధ్యక్షా, శ్రీ పి.వి. నరసింహారావుగారు సుదీర్ఘంగా రాజకీయాలలో ఉండి రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే అనేక పనులు చేశారు.  వరంగల్ జిల్లా లక్నేపల్లి గ్రామంలో వారు జన్మించారు.  న్యాయశాస్త్రంలో పట్టభద్రులు అయ్యారు.  బూర్గుల రామకృష్ణారావుగారివద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు.  స్వాతంత్ర్యోద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నారు.  తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు.  1957లో మంథనినుండి మొదటిసారిగా ఎమ్.ఎల్.ఎ.గా ఎన్నికయ్యారు. 1962 నుండి 1971 వరకు రాష్ట్రంలో మంత్రిగా ఉన్నారు.  1971 నుండి 1973 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటం, 1980–1989 మధ్యకాలంలో కేంద్రమంత్రిగా అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు.  విదేశీ వ్యవహారాల మంత్రిగా చాలా మంచిపేరు సంపాదించారు.  వారు ఒక అవగాహనతో ముందుకుపోవటంద్వారా అన్ని దేశాలతో మంచి సంబంధాలు ఏర్పరచుకోవటం జరిగింది.  1991లో రాజీవ్‌గాంధీగారు చనిపోయిన తరువాత ఆల్ ఇండియా కాంగ్రెస్‌పార్టీ ప్రెసిడెంట్‌గా ఎన్నికకావటం, తరువాత వచ్చిన ఎన్నికల ఫలితాలతో ప్రధానమంత్రికావటం జరిగింది.  ప్రధానమంత్రి అయిన తరువాత నంద్యాలనుండి పార్లమెంట్‌కు వారు కంటెస్ట్‌చేసినప్పుడు తెలుగువారికి ప్రధానమంత్రి అయ్యే గౌరవం మొట్టమొదటిసారిగా దక్కిందనే ఉద్దేశ్యంతో తెలుగుదేశంపార్టీ పోటీపెట్టకుండా పూర్తిగా సహకరించింది.  మేము ఆవిధంగా గర్వపడ్డాము.  విశ్వనాథ సత్యనారాయణగారు తెలుగులో రచించిన వేయిపడగలు అను నవలను హిందీలో సహస్రఫణ్ పేరుతో స్వయంగా వారు అనువదించారు.  14 భాషలు తెలిసిన వ్యక్తి వారు.  ఇన్‌సైడర్ పేరుతో ఆయన తన జీవితానికి అద్దంపట్టే విధంగా ఆటోబయోగ్రఫీ వ్రాయటం జరిగింది.  సమైక్య ఆంధ్రప్రదేశ్ నినాదంతో వారు ముందుకుపోయారు.  వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే సాధ్యమని వారు అనేక సందర్భాలలో చెప్పటం జరిగింది.  వారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నేను ముఖ్యమంత్రిగా ఉండటం జరిగింది.  స్వామి రామానందతీర్థ శిష్యులుగా వారు రాజకీయాలలోకి వచ్చినందున వారంటే ఎనలేని గౌరవం చూపించేవారు.  రాష్ట్రంలో స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పాలనే ప్రపోజల్ ఒకటి పెట్టారు.  పేదవారికి మంచి చేయాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఈ ఇన్‌స్టిట్యూట్‌ను తీర్చిదిద్దాలని వారు ఆకాక్షించారు.  ల్యాండ్ రిఫామ్స్‌కు వారే నాందిపలికారు.

ప్రధానమంత్రిగా వారు ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఈ దేశానికి ఒక డైరెక్షన్ ఇచ్చారు. రిఫామ్స్ తీసుకువచ్చే దిశగా వారు ముందడుగు వేశారు. అప్పుడు కొన్ని ఇబ్బందులు వచ్చాయి. బంగారం తాకట్టు పెట్టే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఫారిన్ ఎక్స్ఛేంజ్ నిల్వలు లేనప్పుడు వారు ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని రిఫామ్స్ దిశలో ముందుకుపోయారు. దేశంయొక్క డైరెక్షన్ మారే పరిస్థితి వచ్చింది. ఈ దేశానికి ఒక డైరెక్షన్ ఇచ్చిన వ్యక్తి వారు. దేశానికి ఒక దశ, దిశ నిర్దేశించిన వ్యక్తి పి.వి. నరసింహారావుగారు. ఈరోజు వారు లేకపోయినా వారిపట్ల మనం గౌరవభావంతో ఉన్నామంటే దానికి కారణం వారు ఆనాడు తీసుకువచ్చిన రిఫామ్స్ అని చెప్పవచ్చును. ప్రధానమంత్రిగా లేనప్పుడు రైతులకోసం తన కృషి ఫలితంగా ఏర్పడిన స్వామి రామానందతీర్థ వాలంటరీ ఆర్గనైజేషన్ కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. కాన్ఫరెన్సెస్, వర్క్‌షాప్స్ పెట్టారు. పదవిలో లేకపోయినా ఈ ఇన్‌స్టిట్యూట్‌ద్వారా, ఈ వాలంటరీ ఆర్గనైజేషన్‌ద్వారా రైతులకు మేలుచేయాలనే ఉద్దేశ్యంతో వారు ముందుకెళ్లారు. దేశంలో ఉండే ఎక్స్‌పర్ట్స్‌ను పిలిపించటం, వారితో ఇక్కడ మీటింగ్స్ పెట్టటం జరిగింది. మెడిసినల్ ప్లాంట్స్‌తోపాటు రైతులకు ఏవేవి ఉపయోగపడతాయో అవన్నీ వారు ఆలోచించారు.

వారు చాలావరకు నిగ్రహంగా ఉండేవారు. ఏదైనా క్రైసిస్ వచ్చినప్పుడు చాలా హుందాగా ప్రవర్తిస్తారు. ఆయన ఎన్నో రిఫామ్స్ తీసుకువచ్చారు. ల్యాండ్ రిఫామ్స్ మాత్రమే కాకుండా కేంద్రంలో ఎడ్యుకేషన్ మినిస్టర్‌గా, హెల్త్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఆయా శాఖలలో రిఫామ్స్ తీసుకువచ్చి ముందుకువెళ్లారు. వారి చివరి రోజుల్లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఉన్నప్పుడు నేను వెళ్లి కలవటం జరిగింది. కోలుకోవటంవల్ల ఆరోజే వారు హాస్పటల్‌నుండి రిలీవ్ అయ్యే పరిస్థితిలో ఉన్నారు. చాలా విషయాలు నాతో మాట్లాడారు. చాలామందిగురించి కనుక్కోవటం జరిగింది. ఆవిధంగా వారిని చివరిసారిగా కలుసుకోవటం జరిగింది. తరువాత వారిని ఇంటికి తీసుకెళ్లటం, మరలా హాస్పటల్‌కు తీసుకురావటం, తదనంతరం వారి ఆరోగ్యం డిటీరియొరేట్ అవ్వటం జరిగినది. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారు పూర్తిగా సహకరించారు. వారిని ఎప్పుడూ మరచిపోలేను. ఇటు రాష్ట్రానికి, అటు కేంద్రానికి వారు లేని లోటు తీరనిది. పి.వి. నరసింహారావుగారికి ఒక కోరిక ఉండేది. ఢిల్లీలో ఆయనకు ఒక మెమోరియల్ ఉండాలి. ఎవరైనా మంచి పనులు చేసినప్పుడు వారి గుర్తుగా ఏదైనా చేయాలనే కోరిక మనకుంటుంది. ఢిల్లీలో ఒక మెమోరియల్ ఏర్పాటుచేసేందుకై మనందరం కృషిచేయాలి. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులందరకూ నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ నోముల నర్సింహయ్య(నక్రెకల్): అధ్యక్షా, పి.వి. నరసింహారావుగారు ముఖ్యమంత్రిగానేకాక అనేక బాధ్యతలను నిర్వర్తించిన బహుభాషాకోవిదుడుగా మనందరకు సుపరిచితమే. మారుమూల గ్రామంలో జన్మించినప్పటికీ హస్తిన సింహాసనంవరకు వెళ్లిన రాజకీయ చతురుడు ఆయన అని చెప్పకతప్పదు. పేదల విముక్తికి, ప్రశ్నించే శక్తికి భూసంస్కరణలే శరణ్యమని భావించి ఆనాడు జరిగిన మహత్తరమైన పోరాటస్ఫూర్తితో, దాని ఆసరాతో ఏర్పడిన భూసంస్కరణల చట్టాన్ని రాష్ట్రంలో ధైర్యంగా అమలుచేయటానికి ప్రయత్నించిన పెద్దమనిషి పి.వి. నరసింహారావుగారు. దేశ ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో బొటాబొటి మెజారిటి ఉన్నప్పటికీ 5 సంవత్సరాల తన పదవీకాలాన్ని నిర్విఘ్నంగా కొనసాగించిన రాజనీతిజ్ఞుడు. సంస్కరణల దుష్ఫలితాలు, సరళీకరణ, ప్రపంచీకరణ, ఉదారవాదాలను ధైర్యంగా ఆహ్వానించిన ఒక భారత ప్రధానిగా, వాటిని ఆహ్వానించిన తరువాత వచ్చిన పరిణామాలను గమనించి హైదరాబాదులో ఒక సందర్భంగా వారు అన్నటువంటి మాటలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి, ''నేను అనుకున్నటువంటి ఈ సంస్కరణలు, ఈ సరళీకరణ విధానాలవల్ల అత్యధిక ప్రజలకు మేలుజరగలేదు, రకరకాల కార్లు మాత్రమే రోడ్లమీద కనపడుతున్నాయి.'' ధైర్యంగా తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చిన పెద్దమనిషి ఆయన. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని వారు కోరుకునేవారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏ స్ఫూర్తితో ఏర్పడ్డాయో దానిని గౌరవిస్తూ ఈ రాష్ట్రం సమైక్యంగా ఉండాలని పలికిన నాయకుడైన పి.వి. నరసింహారావుగారి మృతికి నా సంతాపాన్ని తెలియచేస్తూ సి.పి.ఐ. (ఎమ్) శాసనసభాపక్షం తరపున వారి కుటుంబసభ్యులకు నా సానుభూతిని తెలియచేస్తున్నాను.

ఉ.9.00

శ్రీ చాడ వెంకటరెడ్డి(ఇందుర్తి): శ్రీ పాముల పర్తి వెంకట నరసింహా రావు గారు కరీంనగర్ జిల్లాలోని మారుమూల గ్రామమైన వంగర నివాసి. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీఆనాడున్నటువంటి నైజాం రాచరిక వ్యవస్థ పోవాలని, ప్రజలకు స్వేచ్ఛా వాయు వులు కావాలని నైజాం వ్యతిరేక పోరాటాలు, చాందా క్యాంపులు తదితర పోరాటాల్లో తన పాత్రను నిర్వహించిన వారు. అలాగే వారు వివిధ భాషలకు, సంస్కృతులకు నిలయంగా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరచుకున్నారు. ఏ రాష్ట్రానికి వెళ్లినా ఆ రాష్ట్రం యొక్క భాషను మాట్లాడే మంచి ఉపన్యాసకులు. అలాగే ఆయన 1973లో భూసంస్కరణలను ప్రవేశ పెట్టి వాటిని అమలు పరచడానికి అనేక విధాలుగా ప్రయత్నించారు. వాటిని మరింత పకడ్బందీగా అమలుపరచవలసిన బాధ్యత మన అందరిపైనా వుంది.

వారు మంథని శాసనసభ్యులుగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, విదేశాంగ మంత్రిగా, ప్రధాన మంత్రిగా వివిధ పదవులను అలంకరించి ఆంధ్రప్రదేశ్ యొక్కఅభ్యున్నతికి, పురోగతికి తన వంతు పాత్రను అందించారు. సహకారాన్ని అందిస్తూ వచ్చారు. ఆయనకు ప్రధాన మంత్రిగా పార్లమెంటులో తగిన మెజారిటీ లేకపోయినా తనదైన శైలిలో ఐదేళ్ల పాటు పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఘనత ఆయనదే. ఆయన అపర చాణక్యుడు. నూతన ఆర్థిక విధానాల అమలులో అనేక విమర్శలు ఎదుర్కొన్నా వాటి అమలుకు ప్రత్యేక పద్ధతుల్లో కృషి చేసిన పరిస్థితి మనం గమనించాము. గ్రామాలు అభివృద్ధి కాకుండా దేశం అభివృద్ధి కాదని, గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామీణ ప్రాంతాలకు బడ్జెట్ ఎక్కువ కేటాయించిన పరిస్థితిని మనం చూశాము. అనేకరకాలుగా ఒడిదుడుకులు వచ్చినప్పటికీ నిరాశానిస్పృహలకు లోను కాకుండా తనదైన శైలిలో ఆనాడు ఏ పదవుల్లో వున్నప్పటికీ ఆ పదవులకు వన్నె తెచ్చే ప్రయత్నం చేశారు. నిజంగా ఆనాడు హైదరాబాదు నుండి నాగపూర్ వరకు రాజీవ్ రహదారికి శంఖుస్థాపన చేసి పూర్తి చేయించిన పరిస్థితి వుంది. అలాగే కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాలలోని మెట్ట ప్రాంతాల అభివృద్ధి కోసం 1993లో వరద కాలువ నిర్మాణానికి కూడా రూపకల్పన జరిపి శంఖుస్థాపన చేసిన పరిస్థితి వుంది. ఈ రకంగా అనేక విషయాలలో పి వి నరసింహా రావు గారి వ్యక్తిత్వం మనకు కనపడుతుంది. ఆయన బహు భాషా కోవిదుడు, ప్రతిభాశీలి, నిరాడంబరుడు, అందరితో కలిసిమెలిసిపోయే వ్యక్తిత్వం గల వారు. మేము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి గురించి, కరీంనగర్ జిల్లా అభివృద్ధి గురించి చర్చించడానికి ఢిల్లీ వెళ్లినప్పుడు 15 నిమిషాలు టైం ఇచ్చి దాదాపు గంట సేపు సుదీర్ఘంగామాట్లాడి తనభావనలను, ఆవేదనలను,బాధలను మాతో పంచుకున్న మహనీయుడు. వారి గురించి ఎంత చెప్పినా తక్కువే. వారి సుదీర్ఘ రాజకీయ చరిత్ర గ్రామం నుండి ఢిల్లీ దాకా వుంది కాబట్టి దాని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయనపై కేసులు పెట్టినప్పుడు చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పారు తప్ప అధైర్య పడలేదు. గుండె నిబ్బరంతో వ్యవహరించారు. ఆయన బ్రతికుండగానే ఆ కేసులలో ఆయన ఎలాంటి దోషి కాదని తెలిసిన పరిస్థితి అందరికీ తెలుసు. పి వి నరసింహా రావు గారి మరణం మన దేశానికి తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

Akbaruddin Owaisy (Chandrayanagutta)

శ్రీ కె. రోశయ్య: అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు, సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. మనందరికీ తెలిసి విషయం……. దేశంలో అత్యున్నత మేధావి పి వి నరసింహా రావు గారన్న సంగతి తెలుసు. తెలుగువాడుగా సాధారణమైన కుగ్రామంలో పుట్టి శ్రమతో అంచెలంచెలుగా పెరిగి బహు భాషా పండితుడై రాజకీయాల్లో మార్గదర్శకుడై అనేకమైన ప్రముఖ గ్రంథాలనురచించిన రచయితగా కూడా పేరు తెచ్చుకున్నారు వారు. ఏ సమస్య పైన అయినా ఒక ప్రత్యేకమైన ఆలోచతో వ్యవహరించే మహత్తర శక్తి ఆయనకు భగవంతుడిచ్చిన వరం . సైన్స్ కానివ్వండి, టెక్నాలజీ కానివ్వండి, స్పేస్ రీసర్చ్ కానివ్వండి, గ్రామీణ ప్రాంతాలు కానివ్వండి, వ్యవసాయం, చదువులు, వైద్యం…… ఇలా ఏ సమస్య గురించి వారితో ప్రస్తావించినా ఎంతో విజ్ఞానం మనకు వారి దగ్గర నుంచి అందుతుంది. వారు పదవులను ఎన్ని నిర్వహించారు, ఎంత కాలం నిర్వహించారు అనేదాని కంటే వారి పదవీ కాలంలో చెరగని ముద్ర వేసిన సంఘటనలు ఎన్నో వున్నాయి.భూసంస్కరణలకు పెద్దగా అనుకూల వాతావరణం లేకపోయినా ఒక సాహసిగా ముందుచూపుతో, అభ్యుదయవాదిగా భూసంస్కరణలు తెచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా….. భారత లోక్ సభలో ఆనాడు కాంగ్రెస్ పార్టీకి తగిన సంఖ్యా బలం లేకపోయినప్పటికీ స్వర్గీయ రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురైనప్పుడు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎవరుఈ దేశానికి ప్రధాని కావాలని, కాంగ్రెస్ పార్టీ పగ్గాలు ఎవరుచేపట్టాలని ఆలోచించినప్పుడు అందరి మనసుల్లో మెదిలిన వారు పి వి నరసింహా రావు గారు. ఆ రకంగా వారు ఆ బాధ్యతలు తీసుకున్నారు తప్ప తాను ఆ పదవి కావాలని కోరుకోవడం కాని, తాను ఆ పదవి కోసం ఆరాటపడిన వ్యక్తి కాని కాదు.

ఉ.9.10

పార్లమెంటులో మైనారిటీ ప్రభుత్వ అధినేతగా ఉంటూ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఐదు సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా , అందరి సహకారం తీసుకుని అనేక చారిత్రాత్మకమైన నిర్ణయాలు చేస్తూ కొనసాగి నటువంటి గొప్ప వ్యక్తి, పరిపాలనాదక్షుడు పి.వి. నరసింహారావుగారు. అధ్యక్షా, తమరికి కూడా తెలుసు . గ్రామ పంచాయతీలకు గాని, స్థానిక సంస్థలకు గాని అంతకు ముందు వరకు ఎన్నికలు సవ్యంగా జరుగుతూ ఉండేవి కావు. రాజీవ్‌గాంధీగారు భారత రాజ్యాంగాన్ని సవరించి, చట్ట సభలకు ఏవిధంగానైతే తప్పకుండా ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయో, అదేవిధంగా స్థానిక సంస్థలకు కూడా జరపాలనే ఆలోచన చేసి ప్రయత్నం చేస్తే, లోక్‌సభలో తీర్మానం నెగ్గారు గాని రాజ్యసభలో నెగ్గలేకపోయారు. రాజీవ్ గాంధీగారు మరణించిన తర్వాత, ఆ బాధ్యతను పి.వి. నరసింహారావుగారు తన మీద వేసుకుని, తాను మైనారిటీ ప్రభుత్వానికి అధినేతగా ఉంటూ కూడా లోక్‌సభలో , రాజ్యసభలో అన్ని పక్షాల వారిని కూడగట్టుకుని, వారిని సంప్రదించి వారి ఆలోచనలను కూడా తనకు అనుకూలంగా మలుచుకుని, భారత రాజ్యాంగాన్ని సవరించి స్థానిక సంస్థలకు చరిత్రలో ఒక ప్రత్యేకమైన ఘట్టాన్ని సాధించి, 73,74 రాజ్యాంగ సవరణలు చేసిన తర్వాత ఐదు సంవత్సరాలకు ఒకసారి విధిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే పరిస్థితిని తీసుకొచ్చారు.

అధ్యక్షా, పి. వి. నరసింహారావుగారు తెచ్చిన ఆర్థిక సంస్కరణల గురించి అందరూ చెప్పారు. వారు ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టడమేగాకుండా, ఆ సంస్కరణలు అమలు జరిగే తీరును ఆఖరి క్షణం వరకు కూడా చాలా నిశితంగా పరిశీలిస్తూ వచ్చారు. నేను వారిని ఎన్నో సందర్భాలలో కలుసుకున్నపుడు వారిలో ఒక ఆవేదన కనబడుతూ ఉండేది. రోశయ్యా, మనం సంస్కరణలు తెచ్చింది – ప్రపంచ దేశాలలో ఏమార్పులు వస్తే ఆ మార్పులు కావాలనుకున్నాం, కాని దురదృష్టవశాత్తు ఈ సంస్కరణల ప్రయాణం మధ్యమధ్యలో ప్రక్కదారి పడుతోంది, సంస్కరణల పేరుతో ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తూ పోతున్నాం, దీన్ని సరిదిద్దుకోవాలి, రెవ్యూ చేసుకోవాలని వారు అనేక సార్లు చెప్పారు. అటువంటి మహత్తరమైన వ్యక్తిత్వం ఉన్న పి.వి. నరసింహారావుగారు తెలుగువాడు కావడం నిజంగా మనకందరికీ కూడా గర్వకారణం . 'జాతస్య మరణం ధృవం ' అన్నారు . పుట్టిన ప్రతి వ్యక్తి ఏదో ఒకరోజు మరణించక తప్పదు. అయితే వారు మరి కొంత కాలం జీవించివుంటే ఈ దేశ ప్రజలకు మార్గదర్శకం లభిస్తుందని అనుకున్నాం కాని అలాంటి అవకాశం లేకుండా వారు విగత జీవులు కావడం దురదృష్టకరం . వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ మన శాసనసభ తీర్మానం అందజేసి, పి.వి. గారు మరణించిన తర్వాత వారి కుటుంబ సభ్యులకు కలిగిన దుఃఖాన్ని అధిగమించి ధైర్యంగా ముందుగా వెళ్లేలా ఆ భగవంతుడు వారికి తోడ్పాటు ఇవ్వాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

డా. జి. విజయరామారావు : స్పీకర్ సార్, 20వ శతాబ్దంలో రాష్ట్ర రాజకీయ రంగంలో పేరు ప్రఖ్యాతులుగాంచి, తమ వ్యక్తిత్వాలను అరుదుగా ప్రదర్శించగలిగిన కొద్దిమంది రాజకీయ నాయకులలో పి.వి. నరసింహారావుగారు ఒకరు. నేటి రాజకీయ రంగంలో కొనసాగుతున్న అన్ని పార్టీల రాజకీయ కార్యకర్తలకు, అలాగే మనందరికీ కూడా పి.వి. నరసింహారావుగారి వ్యక్తిత్వం **exemplary**. వారు వరంగల్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో పుట్టి , కరీంనగర్ జిల్లాలో పెరిగి, తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ఒక చిన్న కుగ్రామంలో చేశారు. వరంగల్ జిల్లాలో మా సొంత గ్రామమైన వేలేరులో పి.వి. గారు తన ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. ఆ తర్వాత ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ హన్మకొండ జూనియర్ కళాశాల, హన్మకొండలో పూర్తి చేసి, ఆనాటి ప్రభుత్వం పై చదువులు చదవకుండా నిర్బంధించడం వల్ల ఆయన వేరే రాష్ట్రాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించడం జరిగింది. అయితే అందరిలాగా క్యాజువల్‌గా కాలేజీలో బోధించే విద్యతో ఆయన సంతృప్తి చెందలేదు. దేశంలో ఉన్న అనేక భాషలలో ప్రావీణ్యత సంపాదించి దేశంలో పెద్ద భాషాకోవిదుడుగా, భాషావేత్తగా ప్రసిద్ధిచెందిన మహోన్నత వ్యక్తి పి.వి. నరసింహారావుగారు. రాజకీయాలలో ఆయన మనకందరికీ ఆదర్శవంతుడని చెప్పక తప్పదు. చదువు సంధ్యలలో తన బహు భాషా కోవిత్వాన్ని ప్రదర్శించడమే

గాకుండా రాజకీయ రంగంలో కూడా తనదైన ఒక ప్రత్యేక శైలిలో, తనకున్నటువంటి ప్రత్యేక తరహా రాజనీతిజ్ఞతను ప్రదర్శించగలిగిన వ్యక్తి ఆయన . తాను శాసనసభకు ఎన్నికైన తర్వాత అనేక పదవులను అలంకరించి, ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన పరిపాలనాదక్షుడు . మామూలుగా పరిపాలించలేదు, ముఖ్యమంత్రిగా ఉన్నపుడు గాని, మంత్రిగా ఉన్నపుడు గాని పరిపాలనా రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని, ప్రత్యేక ముద్ర వేయగలిగిన మహోన్నత వ్యక్తి పి.వి. నరసింహారావుగారు. ఎందుకంటే వారి హయాంలో ప్రధానంతగా చెప్పుకోదగ్గది భూసంస్కరణలు . మిత్రులు చాలా మంది ఆయన చేపట్టిన భూసంస్కరణల గురించి చెప్పారు. భూసంస్కరణలను చేపట్టాలని దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా అప్పటివరకు సాహసించలేదు. అంతకు ముందున్న ముఖ్యమంత్రులలో ఏఒక్కరూ కూడా రాష్ట్రంలో భూసంస్కరణలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. ఒకవేళ తాను ఈ భూసంస్కరణలను చేపడితే తన పదవికి ముప్పు వస్తుందనే విషయం పి.వి. గారికి తెలుసు . తాను పదవిలో కొనసాగకపోవచ్చని తెలిసి కూడా ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించి, సాహసోపేతంగా రాష్ట్రంలో ఉన్నటువంటి వ్యవసాయ కూలీల కొరకు, రాష్ట్రంలో ఉన్నటువంటి భూమిలేని నిరుపేదలకు భూమిని పంచాలనే ఉద్దేశ్యంతో భూసంస్కరణల ద్వారా భూపరిమితి చట్టాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రంలో అనేక లక్షల ఎకరాల భూమిని పెత్తందార్ల నుంచి, భూస్వాముల నుంచి ప్రభుత్వ పరంగా సేకరించి పేదలకు పంపిణీ చేశారు. ఈ రాష్ట్రానికి పి.వి. గారు ఒక పెద్ద మార్గదర్శకులు . వారిని ఈ రాష్ట్రంలో ఉన్న పేదలు ఎన్నటికి మరచిపోలేరు. ఆయన విద్యా రంగంలో పెను మార్పులు తీసుకొచ్చారు. ఎవరైతే పట్టణాలలో ఉన్నారో వారికే కాన్వెంటు స్కూల్సులో, పబ్లిక్ స్కూల్సులో నాణ్యమైన విద్య అందుబాటులో వుంది, మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఉండే పేద కుటుంబాల పిల్లలకు ఈవిధమైన నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వపరంగా విద్యా సంస్థలను నిర్వహించవలసిన అవసరం వుందని తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భావించి, ఆనాడు జిల్లాకు ఒక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలో ఉండే పేద కుటుంబాల పిల్లలకు వాటిల్లో ప్రవేశం కల్పించారు పి.వి. నరసింహారావుగారు. ఆయన ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అభ్యసించి, ఆ తర్వాత పెద్ద చదువులు చదివిన పేద కుటుంబాల పిల్లలు ఈనాడు రాష్ట్రంలోనే కాదు దేశ వ్యాప్తంగా అత్యున్నతమైన అధికారులుగా సేవలు అందిస్తున్నారు, అటువంటి అవకాశాన్ని మన రాష్ట్రం నుంచి కల్పించిన వారు పి.వి. నరసింహారావుగారని చెప్పక తప్పదు. వారు మానవ వనరుల మంత్రిగా కేంద్రంలో ఉన్నపుడు అక్కడ కూడా – ఆంధ్రప్రదేశ్‌లో ఏవిధంగానైతే ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారో అదే విధంగా దేశవ్యాప్తంగా కూడా అటువంటి విద్యా విధానం కొనసాగాలని భావించి, దేశ వ్యాప్తంగా నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేసి , దేశంలో ఉన్నటువంటి పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చిన మహోన్నత వ్యక్తి పి.వి. నరసింహారావు గారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. పి.వి.గారు ఈనాడున్నటువంటి రాజకీయ నాయకుల్లాగా కుట్రలు, కుతంత్రాలు చేసి పదవుల్లోకి రాలేదు. ఆయన ఒక సామాన్య కార్యకర్తగా కొనసాగుతుంటే పదవులు వెతుక్కుంటూ ఆయన దగ్గరకు వచ్చాయే గాని, దొంగచాటుగా, వెన్నుపోట్లు, ముందుపోట్లతో పి.వి.గారు పదవులు సంపాదించుకోలేదు ఎప్పుడూ. తనకు వచ్చిన పదవుల ద్వారా తన రాజనీతిజ్ఞతను ప్రదర్శించి దేశ వ్యాప్తంగా వున్నటువంటి ప్రజల మనసులలో నిలిచిపోయారే తప్ప , కుట్రలు, కుతంత్రాలు, మాయలు చేసి పదవులు సంపాదించే పరుగులో పి.వి. నరసింహారావుగారు ఎన్నడూ కూడా లేరు. పి.వి. గారు ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీ వెళ్లిన తర్వాత నిరంతరంగా, నిర్విరామంగా ప్రధానమంత్రి అయ్యేవరకు ఏకధాటిగా ఎంపి గా, మంత్రిగా కొనసాగిన వ్యక్తి ఆయన . కేంద్రంలో అనేక పదవుల్లో కొనసాగిని పి.వి.గారు – ప్రతి శాఖలో, అది విదేశాంగ శాఖ గాని, డిఫెన్స్ గాని, మానవవనరులు గాని, హోమ్‌గాని ఏ శాఖ నిర్వహించినా, తన ప్రతిభను, రాజనీతిజ్ఞతను ప్రదర్శించి యావత్ దేశ రాజకీయ రంగంలో మార్గదర్శకులుగా ఉన్న వారి మృతి దేశానికి తీరని లోటు . ఇలాంటి మహోన్నత వ్యక్తి ఆంధ్రప్రదేశ్ నుంచి, అందులో తెలంగాణా ప్రాంతం నుంచి ఉద్భవించడం మనకందరికీ గర్వకారణం . అటువంటి వ్యక్తి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఈ అవకాశాన్నిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.9.20

మిస్టర్ స్పీకర్ ః చాలా మంది సభ్యులు మాట్లాడవలసి వుంది, దయచేసి బ్రీఫ్‌గా మాట్లాడితే I would appreciate.

శ్రీ జి. కిషన్ రెడ్డి (హిమాయత్‌నగర్) : అధ్యక్షా, మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుగారి జీవితం ఒక చరిత్ర లాంటిది. పి.వి. గారు తన రాజకీయ జీవితంలో భారత ప్రధాని కావడం ఒక పెద్ద అవకాశం . దేశ ప్రధాని కావడమన్నది కేవలం ఒక తెలుగువాడికి వచ్చిన తొలి అవకాశం మాత్రమే కాదు, ఇది దక్షిణ భారతదేశానికే వచ్చిన మొట్టమొదటి అవకాశమని ఈసందర్భంగా మనవి చేస్తున్నాను. నెహ్రూ, గాంధీ కుటుంబ సభ్యులు తప్ప ఈ దేశాన్ని ఎవ్వరూ కూడా పూర్తి కాలం పరిపాలించలేరని 1977 ఆ తర్వాత వచ్చిన ప్రచారం తప్పని రుజువు చేస్తూ భారత ప్రధాన మంత్రిగా పూర్తి కాలం పని చేసి తనేంటో నిరూపించుకున్న వ్యక్తి పి.వి. నరసింహారావుగారు . మైనారిటీ ప్రభుత్వాన్ని స్వీకరించి దాన్ని చివరికి మెజారిటీ ప్రభుత్వంగా మార్చిన ఘనత ఆయనకే దక్కింది. వారు బహు భాషాకోవిదులు, రాజనీతిజ్ఞులు, సాహితీవేత్త, వ్యూహకర్త, మేధావి, మృధు స్వభావి . పి.వి.గారు ప్రధానమంత్రి అయిన తర్వాత ఈదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పులకు శ్రీకారం చుట్టడం జరిగింది. వారు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, చివరికి ఈదేశంలో ఆర్థిక సంస్కరణలను వ్యతిరేకించే వాళ్లు కూడా అంగీకరించే పరిస్థితి వచ్చింది. ఆ రకంగా ముందుచూపుతో, ఈ దేశ భవిష్యత్తు కోసం, ప్రపంచ దేశాలతో పోటీ పడడం కోసం ఈ దేశంలో ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన వ్యక్తి పి. వి. నరసింహారావుగారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఆయన ఒకవైపు రాజనీతిజ్ఞుడుగా, మరొక వైపు సాహితీవేత్తగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి . క్రియాశీలక రాజకీయాల నుంచి నేను విరమించుకుంటున్నాను, నాకు రాజకీయాలు అవసరం లేదు, పోలింగ్ అయిన తర్వాత హైదరాబాదుకు వెళతానని ఆయన అనుకున్న సందర్భంలో రాజీవ్‌గాంధీగారి హత్య తో , ఆయన ప్రధానమంత్రి పదవిని స్వీకరించవలసిన పరిస్థితి వచ్చింది. రాజీవ్‌గాంధీ హత్య తర్వాత దేశంలో ఏర్పడిన క్లిష్టపరిస్థితులను, సమస్యలను తనకున్నటువంటి అపారమైన అనుభవంతో పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లగలిగిన వ్యక్తి పి.వి. గారని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. వారి జీవితం చాలా పరిపూర్ణమైన జీవితం. ఆయన రాజకీయంతో బాటుగా ఆటలు, పాటలు, సినిమాలు, సంగీతం, నాటకాలు మొదలైన వాటన్నింటిలో కూడా ఆసక్తిని పెంపొందించుకున్నారు. సాహిత్యంలో మాస్టర్ డిగ్రీ చేశారు వారు.

అధ్యక్షా, వారు అధ్యక్షులుగా వున్నటువంటి రామానందతీర్థ సంస్థ ద్వారా ఔషధ మొక్కల పెంపకంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కల్పించడానికి వారు ఏవిధంగా కృషి చేశారో మనకందరికీ తెలుసు . ఆయన మరణించే ముందు తిరుపతిలో మాట్లాడుతూ, రాజకీయ పార్టీల కార్యకర్తలకు పోరాట పటిమ ఉండాలి, అది లేకపోతే రాజకీయ జీవితం లేదని చెప్పారు. ఇప్పుడున్నటువంటి వర్తమాన రాజకీయాలలో మనమందరమూ కూడా వారు చెప్పినటువంటి రెండు సూక్తులను పాటిస్తూ ముందుకెళ్లవలసిన అవసరం వుంది. పి.వి. నరసింహారావుగారు ఎప్పుడూ పదవులను కోరుకోలేదు, వస్తే కాదన లేదు. నిజాం నిరంకుశ పాలనలో ఉస్మానియా యూనివర్శిటీలో వందేమాతరం ఆలపించడాన్ని నిషేధించడం జరిగింది. అయితే పి.వి. నరసింహారావుగారు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వందేమాతరం గీతాన్ని ఆలపించి ఉస్మానియా యూనివర్శిటీ నుంచి సస్పెండ్ చేయబడ్డారు. పార్లమెంటరీ సాంప్రదాయాలపై అత్యంత విశ్వాసం ఉన్న వ్యక్తి ఆయన. ప్రధాన మంత్రిగా ఉన్నపుడు ప్రతిపక్షంలో ఉన్న వాజ్‌పాయ్‌గారిని సంప్రదిస్తూ, ఇద్దరూ కలిసి ఒక అవగాహనతో ఈ దేశాన్ని ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరేదేమంటే – శంషాబాదులో ఏర్పాటు చేయబడుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు పి. వి. నరసింహారావుగారి పెట్టాలని కోరుతున్నాను. ఎందుకంటే మన రాష్ట్రానికి సంబంధించి పి.వి. గారిలాంటి మరొక గొప్ప వ్యక్తి లేరు. వారు ప్రధాన మంత్రి స్థాయి వరకు వెళ్లారు, వారు అనేక రకాలుగా ఈ దేశం కోసం ప్రయత్నం చేశారు. కావున – శంషాబాదులో ఏర్పాటు చేయబడుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు పి. వి. నరసింహారావుగారి పెట్టాలని మరొకసారి కోరుతూ, బిజెపి తరపున పి.వి. గారికి మనస్ఫూర్తిగా నివాళులు అర్పిస్తూ, శ్రద్ధాంజలి ఘటిస్తూ, పి.వి. గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. శ్రీనివాస్ ః  అధ్యక్షా, భారత మాజీ ప్రధాని  పి.వి. నరసింహారావుగారి గురించి  ఈ రకంగా  ఇక్కడ నిలబడి మాట్లాడే అవసరం ఇంత తొందరగా  వస్తుందని  నేను ఏనాడూ ఊహించలేదు.  వారి గురించి పెద్దలందరూ మాట్లాడారు.   ప్రధానంగా ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ,  కేవలం ఆంధ్రప్రదేశ్, భారతదేశంలోనే గాకుండా ప్రపంచంలోనే తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని  సంపాదించుకున్న నాయకులలో  పి.వి. నరసింహారావుగారు ఒకరని  ఈ సందర్భంగా చెప్పక తప్పదు.   మొట్టమొదటిసారిగా ఆయన  ముఖ్యమంత్రి అయినపుడు చాలా low profile నాయకులుగా ఉండేవారు. ఎవరూ ఊహించని రీతిలో వారు ప్రధానమంత్రి అయ్యారు.  1971లో వారు ముఖ్యమంత్రిగా ప్రమాణ  స్వీకారం చేశారు.  పి.వి. నరసింహారావుగారిలో ఉన్న గొప్పతనం ఏమంటే,  ఆయన ఏదైనా  చేయాలని నిర్ణయం తీసుకుంటే, దాన్ని తప్పకుండా చేసి తీరుతారు.   1971లో ఇందిరాగాంధీగారు భూసంస్కరణల నినాదంతో, బ్యాంక్స్ నేషనలైజేషన్, Privy Purse ను abolish చేస్తూ పార్లమెంటు ఎన్నికలకు వెళిన తరుణంలో , పి. వి. గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత  ఈ     రాష్ట్రంలో ఎంతో ధైర్యంగా భూసంస్కరణలను అమలు  చేస్తూ ముందుకెళ్లారు.   భూసంస్కరణలు అమలు చేస్తే పెత్తందార్లు తనకు ఇబ్బందులు కలుగజేస్తారని ఆరోజు వారికి తెలిసినప్పటికీ, ఎంతో ధైర్యంగా  ముందుకుపోయారు.  కేవలం            భూసంస్కరణల చట్టం అమలు వల్లే ఆయన తన ముఖ్యమంత్రి పదవిని పోగొట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.   ఆ తర్వాత కేంద్రంలో  ఎన్నో శాఖలు నిర్వహించి , ఎవ్వరూ ఊహించని రీతిలో  ఆయన ప్రధానమంత్రి అయ్యారు.  ప్రధానమంత్రి  అయిన తర్వాత ఈదేశంలో ఆర్థికరంగంలో విచ్ఛిన్నకర  పరిస్థితులు నెలకొన్న సమయంలో , రీఫార్మ్స్ తీసుకొచ్చి దేశానికి  ఒక economic stability ని ప్రొవైడ్ చేశారు.  తాను నమ్ముకున్న విషయాన్ని పూర్తిగా విశ్వసిస్తూ, నిపుణులతో సంప్రదింపులు జరిపి, ఏ నిర్ణయాలు చేస్తే ఈ దేశానికి  బాగుంటుందనే ఆలోచనతో  ఈనాడున్న ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ను ఫైనాన్స్ మినిస్టర్‌గా పెట్టుకున్నారు.   వారు తీసుకొచ్చిన సంస్కరణల వల్లే ఈరోజు భారతదేశానికి ఒక economic stability       వచ్చిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.  ఉ.9.30.

చాలామంది పి.వి. నర్సింహరావుగారు ఇన్‌డెసిసివ్ నిర్ణయాలు తీసుకునే వారు కాదని అంటారు.   ఆయన  నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాకపోతే ఆయనను ఇందిరాగాంధీ గారు, రాజీవ్‌గాంధీ గారులాంటి వారికి ఏ రకంగా సలహాదారుగా పనిచేశారని అడుగుతున్నాను.   ఆయన ఆ నిర్ణయం ఉన్ననాడే ఆయన మనకు ఇన్‌డెసిసివ్‌గా కనపడేవాడు. That used to be indecisive on the subject.

అంతే కాని ఆయన ఇన్‌డెసిసివ్ ఏనాడూ కాదు.    రాజీవ్ గాంధీగారు స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని వెనుకబడిన తరుగతుల మహిళలకు  స్థానిక సంస్థలలో ప్రాధాన్యం ఇవ్వాలని   కలలు కనేవారు.  వారు చేయలేకపోయినా , పి.వి. నర్సింహరావు గారు  కాన్‌స్టిట్యూషన్ అమెండ్‌మెంట్స్  తీసుకు వచ్చి 33 శాతం మహిళలకు, 33 శాతం బిసిలకు రిజర్వేషన్ తీసుకువచ్చిన ఘనత  పి.వి. నర్సింహరావు గారిదే దక్కింది.  దానిని దేశంలో ,రాష్ట్రంలో కూడా పాటిస్తున్నారని మనవి చేస్తున్నాను. నాకు విద్యార్థి దశ నుండి వారితో సంబంధం ఉండేది.  ఆయన రెండు విషయాలు చెప్పేవారు.   నేను వాటిని ఎప్పుడూ నెమరు వేసుకుంటాను.   ప్రత్యేకంగా what a person appears to be doing is more important than what exactly does. మనం ఏమి చేస్తున్నట్టుగా కనపడతామో అది ప్రాధాన్యం అవుతుంది.  రెండవది ఎప్పుడైనా ఇబ్బందులలో ఉన్నప్పుడు ఏ మాత్రం బలహీనంగా  కనపడకూడదు.  ఈనాడు ఉన్న ప్రపంచం ఎలా ఉందంటే ఎంత దగ్గర సన్నిహితుడైనా  మనం బలహీనంగా ఉన్నామంటే ఒక రాయి వేస్తారు తప్ప ఆదుకునే ప్రయత్నం ఎవరూ చేయరు.   ఆ రెండు విషయాలు ఎప్పుడూ జ్ఞాపకం పెట్టుకోమనే వారు.  వాస్తవంగా అదే పరిస్థితి.  వారు ఇంత గొప్ప సేవ చేసి , దేశం ఇంత ప్రగతి సాధించి ప్రపంచంలో  తనకంటూ ఒక స్థానం దక్కించుకునే పెద్దాయనకు కూడా ఇబ్బందులు తప్ప లేదు.  గౌరవ ముఖ్యమంత్రిగారు  చెప్పినట్టు ఆయన చనిపోయేముందు అన్ని కేసుల నుండి విముక్తి దొరికింది.  వారి చివరి రోజులలో  తప్పకుండా ఒక పీస్ లభించిందనే విశ్వాసం నాకు ఉంది.   వారి మరణం రాష్ట్రానికే కాదు, యావత్తు దేశానికే తీరని లోటు.  ప్రత్యేకంగా కాంగ్రెసు పార్టీకి జాతీయ స్థాయిలో

తీరని లోటని, వారి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని , వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇవ్వాలని, నా ప్రగాఢ సానుభూతిని వారికి తెలియ చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ద్రోణం రాజు సత్యనారాయణః అధ్యక్షా, పి.వి. నర్సింహరావు గారి మరణం దేశానికి ముఖ్యంగా మేధావి వర్గానికి తీరని లోటే కాకుండా ఆయన మరణంతో రాజకీయ గగనంలో ఒక ధృవతార రాలిపోయింది. ఆయన స్థితప్రజ్ఞుడు. ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ చాలామంది పెద్దలు మాట్లాడారు. ఒక విషయం మాత్రం చెప్పక తప్పదు. దాదాపు ఆయనతో నాకు 30 సంవత్సరాల పరిచయం . ఆయన చనిపోయిన రోజున నేను ఢిల్లీలోనే ఉన్నాను. ఆయన క్రిమేషన్ ఢిల్లీలో చేయాలని కొంతమంది, హైదరాబాదులో చేయాలని కొంతమంది సంఘర్షణ పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారు వచ్చిన తరువాత వారినందరిని ఒప్పించి ఆయన తెలుగుగడ్డ మీద పుట్టి భారత దేశానికి ప్రధానిగా, ప్రపంచ దేశాలలో ప్రఖ్యాతి సంతరించుకున్న వ్యక్తి . అటువంటి వ్యక్తి యొక్క క్రిమేషన్ హైదరాబాదులోనే ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. చాలామంది చెప్పినట్టు పి.వి. నర్సింహరావు గారి గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆయన నిరాడంబరమైన జీవితం గడిపారు. 1978లో ఇందిరా కాంగ్రెసు ఈ రాష్ట్రంలో ఆవిర్భవించినప్పుడు మేము శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణంలలో తిరుగుతున్నప్పుడు రోడ్డు మీద నిలబడి కాఫీ తెప్పించుకొని త్రాగేవారు మాజీ ముఖ్యమంత్రి అయి ఉండి కూడా. అంతే కాదు, నిశితమైన ఆలోచన, నిర్మలమైన మనస్సు. పరుషంగా మాట్లాడే వారు కాదు, ఎవరైనా మాట్లాడినా సహించరు. ఆ రకంగా అరవై సంవత్సరాల సుధీర్ఘ రాజకీయ చరిత్రతో ఆయన మరణం ముగిసింది. ఆయన చేయని పదవి లేదు. He is a founder of the Human Resource Development Ministry. అందుకని రాజీవ్ గాంధీ గారు ఆ శాఖను ఆయనకే ఇచ్చారు. ముఖ్యంగా ఒక మనిషి 60 సంవత్సరాలు పైగా ఒకే పార్టీలో ఉండి పదవిలో ఉన్నా, పదవిలో లేకపోయినా ప్రజల సంక్షేమం కోసం ఈ రాష్ట్ర ప్రజలను కాపాడడం కోసం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తపన పడిన మనిషి . ప్రధాన మంత్రిగా పదవి పోయిన తరువాత హైదరాబాదు వచ్చారు. అప్పుడు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఔషధ మొక్కల పెంపకం కోసం ఒక సెమినార్ పెట్టారు. ఆయుర్వేద వైద్యం అంతరించి పోతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని భూమి అడిగి ఆ కార్యక్రమం చేయాలని సంకల్పించారు. అంతేకాదు, వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి కోసం మొత్తం నాలుగు రాష్ట్రాల నుండి ముఖ్యమంత్రులను పిలిపించి దాని మీద సెమినార్ ఏర్పాటు చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఒక అధారిటి ఉండేలా చట్టబద్ధంగా భావించిన మనిషి. భూసంస్కరణలు చేశారు. దానికి ఆయన రాజకీయంగా బలి అయిపోయాడు. ఆయన చేసిన పని మిగిలిపోయింది. ఈ రోజు భూమి లేని వాడు ఒకఎకరం భూమి ఉందనే ఆత్మస్థైర్యాన్ని కలిగించారు. పివి. నర్సింహరావుగారు విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. చెన్నారెడ్డిగారు చెప్పారు, ఆయన ఈ రాష్ట్రంలో చేసిన మార్పులు ఉత్తర ప్రదేశ్‌లో ప్రవేశ పెట్టడం కోసం గవర్నర్‌గా పివిని ఆహ్వానించారని చెప్పారు. ఆయన తలపెట్టిన దానికి సంపూర్ణ రూపం ఇవ్వగలిగిన మనిషి అతను. ఆయన చేసిన 73, 74వ రాజ్యాంగ సవరణ వల్ల ఈ రోజు మహిళలు జిల్లా పరిషత్తు ఛైర్మన్‌లుగా, హరిజన మహిళలు కార్పోరేటర్లుగా, పంచాయితీ సర్పంచ్‌లుగా ఉన్నారని మనవి చేస్తున్నాను. మన రాష్ట్రంలో ఆయన అనేక పదవులు నిర్వహించారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అనేక కీలకమైన సమస్యలు పరిష్కరించగలిగిన మనిషి. అప్పట్లో ఆయన ప్రధానమంత్రిగా తీసుకోవడం ఆయన జీవితానికి ఒక సవాలుగా పరిణమించింది. ఎందుకంటే రాజీవ్‌గాంధీ మరణం ఒక ప్రక్క, దివాలా తీసిన ఆర్థిక శాఖ ఒక ప్రక్క, రాజీవ్ గాంధీ మరణానంతరం భారత దేశంలో ప్రజాస్వామ్యం ఉంటుందా? ఎవరు దీనికి ప్రధాని అని భావించిన తరుణంలో ఆయన బాధ్యతలు స్వీకరించి ఐదు సంవత్సరాలు సుస్థిరమైన పాలన అందించగలిగారు. ఆయన నాయకత్వంలో చేసిన సంస్కరణలు ఈనాటికి కాదు భావి తరాలకు కూడా ఆదర్శప్రాయమని తెలియ చేస్తున్నాను. ఆయన భావి తరాలకు ఆదర్శప్రాయులు. ఆయన వ్రాసిన పుస్తకాలు, రచనలు ఏవి చూసినా ప్రజల తాలూకూ ఆశయాలకు ప్రతిబింబంగా వ్రాశారు తప్ప ఆషామాషీగా కాదు. ఏ రాష్ట్రానికి అయినా ఉత్తరం వ్రాస్తే ఆ రాష్ట్ర భాషలోనే సంతకం పెట్టేవారు. ప్రజలకు ఈ భాషను ద్వేషించాలి, ఈ భాషను గౌరవించాలి అనే భావం లేకుండా, అన్ని భాషలను అన్ని మతాలను అన్ని కులాలను ఆదరించే తత్వము ఉన్న మహా మనిషి. ఆశ్చర్యమేమిటంటే ఎవరు వెళ్లి మాట్లాడినా ,

హావభావాలన్నీ అనుకూలంగా ఉన్నట్టుగా ఉండేవి. వారు బయటకు వచ్చి నాకు చాలా అనుకూలంగా మాట్లాడారని అనుకునేవారు. అది ఆయనలో ఉన్న గొప్పతనము. ఎవరి మనస్సుకు బాధ కలిగించకుండా , ఆయన బాధ పడకుండా ఐదు సంవత్సరాలు పరిపాలన చేసి సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించిన ఒక మహా మనిషి . పి.వి. నర్సింహా రావుగారి మరణం తీరని లోటు అని, ఆయనకు హృదయపూర్వకంగా శ్రద్ధాంజలి ఘటిస్తూ , వారి కుటుంబానికి సానుభూతిని తెలియ చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.9.40

శ్రీ సి.హెచ్. రాజేశ్వరరావు (సిరిసిల్ల) : అధ్యక్షా, కీర్తిశేషులు, చిరకాల మిత్రులు, మాజీ భారత ప్రధాని, ప్రబల సంస్కర్త శ్రీ పి.వి. నరసింహారావు గారి మృతి పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను. చాలా మంది మిత్రులు వారి జీవితం గురించి వివిధ కోణాల నుండి వివరించారు. ఎక్కువ వివరాలకు పోకుండానే వారి రాజకీయ చరిత్రలో మరపురానటువంటి మిత్రులు, కొంతమంది వాటిని వదిలిపెట్టినటువంటి విషయాల పైన మాత్రమే నా అభిప్రాయాన్ని మనవిచేస్తూ సెలవుతీసుకుంటాను.

కరీంనగర్ జిల్లా నుండి ఉద్భవించిన రాజకీయ నాయకుడు కావడం, వ్యక్తిగతంగా నాకు దాదాపు అర్థ శతాబ్దానికి మించిన సహచర్యం వుండడం అనేకానేక అనుభవాలలో ఇచ్చిపుచ్చుకోవడం, స్ఫూర్తిని పొందడం చాలా సంతోషదాయకమైనటువంటి సన్నివేశాలను మరొక్కసారి గుర్తుచేసుకుంటాను. ఇందాక మిత్రులు చెప్పినట్లు ఆనాటి నిరంకుశ నైజాం పాలనలో వందేమాతరాన్ని ఆలపించడం చాలా పెద్ద నేరంగా గుర్తించి అందరినీ కళాశాల నుండి బహిష్కరించిన రోజున, అందరూ నిర్బంధముగా నల్లటి యూనిఫార్మ్‌ను వేసుకొని తప్పనిసరిగా క్లాస్‌కు రావాలనే నిబంధనను ఉల్లఘించినప్పుడు కళాశాల నుండి బహిష్కరించిన రోజులలో, నాగపూర్ వెళ్లి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొన్నారు. అప్పుడప్పుడే వందల వేల మంది విద్యార్థులు రాజకీయ రంగ ప్రవేశం చేసి ఈ పౌరహక్కులైనటువంటి నైజాం సంస్థానాన్ని కూలద్రోసి స్వతంత్ర భారతదేశంలో విలీనం కావాలనే పద్ధతిన సామాన్య ఉద్యమాన్నే కాదు, సత్యాగ్రహ ఉద్యమాన్ని కూడా అణచి వేయబడిన పరిస్థితులలో ఆనాటి సంస్థాగత కాంగ్రెస్ కూడా కమ్యూనిస్ట్ పార్టీతో చేతులు కలిసి అందరమూ కలసి మెలసి నైజాం నిరంకుశ పాలనను కూలద్రోయడానికి అవసరమైన సాయుధ పోరాటం చేయాలనే నిర్ణయం రావడం, అందులో శ్రీ పి.వి. నరసింహారావు గారు పాత్ర వహించడం చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించవలసినటువంటి ఘట్టం. ఆ రోజులలో ఆయన గారు చందా క్యాంపులో కీర్తిశేషులు శ్రీ జె.డి. నరసింగరావు గారితో సహా మహారాష్ట్ర బోర్డర్‌లో వున్న చందా క్యాంపులో ఇన్‌ఛార్జ్‌గా వుండడం, నేను భారత కమ్యూనిస్ట్ పార్టీ తరపున దానికి దగ్గరనే గోదావరి నదికి అటు వైపున చెరువంచా క్యాంపుకు ఇన్‌ఛార్జ్‌గా వుండడం, ఆయుధాలు తెచ్చుకోవడం, ట్రయినింగ్ ఇవ్వడం సంబంధించిన రాజకీయ పరిణామాన్ని ఇచ్చి పుచ్చుకోవడం అనే ప్రక్రియలో 47,48,49 ప్రాంతము వరకు మరపురాని రాజకీయ విప్లవోద్యమ ఘట్టాలని మాత్రమే గుర్తు చేస్తున్నాను. ఆ తరువాత పోలీసు యాక్షన్ జరగడం, సంస్థాగత భారతదేశంలో విలీనం కావడం, తరువాతి రాజకీయ పరిణామం మీరందరూ చూచారు. వారు, నేను ఇద్దరమూ కూడా శాసనసభకు ఎన్నిక కావడం మధురస్ఫూర్తి అని మనవి చేస్తున్నాను. మంథని నుండి వారు గెలిచారు, చొప్పదండి నుండి నేను గెలిచాను. ఆ తరువాత అనేక సందర్భాలలో వారు, మేము కలసి అనేక కార్యక్రమాలలో పాలుపంచుకోవడం, అన్ని విషయాలలో కూడా ఆయన అభిప్రాయం అందరికీ ఆదర్శప్రాయంగా వుందనే విషయాన్ని చెబుతున్నాను. రాజకీయ అభిప్రాయబేధాలు వున్నప్పటికిన్నీ ప్రజల సేవ, కర్తవ్య నిర్వహణ, దానిలో వుండవలసిన విజ్ఞత, దాని గురించి ఆయన ప్రత్యేకమైన పాత్ర పోషించేవారు. శాసనసభలో ఏ ఉపసంఘాన్ని వేసినా, ఏ తీర్మానాన్ని వ్రాయవలసి వచ్చినా, ఏ అఖిలపక్ష సమావేశంలో చర్చనీయాంశాలను పొందుపరచవలసి వచ్చినా అప్పటి ముఖ్యమంత్రి, కీర్తిశేషులు శ్రీ బ్రహ్మానందరెడ్డి గారు ఆనాడు మాతో చెప్పే దేమిటంటే మీరంతా వుండండి, మా తరపున మా బృహస్పతి వుంటారు అని చెప్పేవారు. ఆయన పేరు బృహస్పతి అని పెట్టారు. సంతృప్తిగా వారి సేవలను పుచ్చుకున్నారని మనవి చేస్తున్నాను. చివరకు భారతదేశంలోని రాజకీయాలకు ఆయన చాలా చేశారు. కేంద్ర మంత్రిగా

కూడా చాలా పనులు చేసి అన్ని రంగాలలో రాణించిన తరువాత ఆరోగ్యం బాగా లేకపోవడం వలన ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి 1990లో నేను రాజకీయాల నుండి విరమించుకుంటాను అని బాధతో నాకు చెప్పడం, మేమంతా చర్చించుకోవడం జరిగింది. ఆ సమయంలో అనూహ్యంగా భారత రాజకీయాలలో పెద్ద మార్పు వచ్చింది. కీర్తిశేషులు రాజీవ్ గాంధీ గారు చాలా దుర్మార్గంగా హత్యకు గురికావడం, భారతదేశ భవిష్యత్తుకి ఆయన చూపిన మార్గాలు అమాంతముగా నిలచిపోవడం వల్ల ఇందాక మిత్రులు చెప్పినట్లు భారత రాజకీయాలలో శూన్యం ఏర్పడకూడదని, శూన్యాన్ని పూరించగలిగే సమర్థులు ఎవరంటే శ్రీ పి.వి. నరసింహారావు గారు అని చెప్పి అందరూ అనుకొని ఆయనను భారత ప్రధానిగా చేయడం వల్ల ఆయన జీవితంలో ఆయన ఊహించని అమాంతరమైన మార్పు రావడం, దానిని ధైర్యంగా ఎదుర్కొని, సాహసోపేతంగా నిలబడి ఐదు సంవత్సరములు పూర్తి చేసుకొన్న ఘనత శ్రీ పి.వి. నరసింహారావు గారిది. ఈ విషయాన్ని ఆయన సహచరునిగా గుర్తుచేస్తున్నాను. అయితే అధ్యక్షా, ఒక బాధాకరమైన విషయాన్ని నేను స్వయంగా ఆయన జీవిత కాలంలో ఒకటికి నాలుగుసార్లు మనవి చేశాను. మీ జీవితం చాలా సార్థకమైనది, చాలా నైపుణ్యముతో కూడినది, చతురతతో కూడినది, నైపుణ్యముతో కూడినది, చక్కటి రాజకీయ విజ్ఞతతో కూడినది. వారి ఆదర్శాలు అందరికీ గర్వకారణం. కానీ ఈ బాబ్రీ మసీదు గొడవ వచ్చి మీ, మా జీవితాలలో కూడా ఒక కళంకముగా పరిణామం చెందినదని బాధను పంచుకోవడం జరిగిందని మనవి చేస్తున్నాను. సోదరులు కోపముతో, ఆందోళనతో వాకౌట్ చేశారు. కాని శ్రీ పి.వి. నరసింహారావు గారు త్రికరణ శుద్ధిగా, సర్వమత సమభావాన్ని కలిగినటువంటి నిజమైన లౌకిక వాది. ఏ కోశాన కూడా ఆయన జీవితంలో చూస్తే ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడాడు గాని ముస్లింలకు వ్యతిరేకంగా ఎన్నడూ ఒక్క మాట కూడా మాట్లాడేవాడు కాదు. సర్వమత సమ భావమే లౌకిక వాదమని చెప్పి వాదించిన మహా నాయకుడు. అయితే ఆయన ప్రధానిగా వున్నా అనేక విశ్వాసాలతో కూడిన మిత్రులు వివిధ రంగాలలో వుండవచ్చు, నేను చెప్పను గాని మునులు, సాధువులు ఆయన దగ్గరకు వచ్చి బాబ్రీ మసీదు గొడవ వస్తుంది, దాని పైన దండోరా ఊరేగింపు వస్తుంది, లక్షల మంది పిలుస్తున్నారు, ఎలా జరుగుతుందో అని చెప్పినప్పుడు ఏమీ ఫరవాలేదు మేము అంతా వున్నాము, కాపలా కాస్తాము, ఏ మాత్రం బాబ్రీ మసీదు ముట్టుకోమని హామీ యిస్తే విశ్వాసంతో పెద్ద పెద్ద నాయకులు, పెద్ద పెద్ద వ్యక్తులు విశ్వాసంగా చెప్పేవారు. సంపూర్ణముగా నమ్మి ఆయన చూస్తూ కూర్చోవడం జరిగింది. ఆ క్షణంలో గాని సరియైన నిర్ణయం చేస్తే ఇంత ఘోరం జరగక పోయేది. ఇది ఏమి అయినప్పటికీ ఆయనలో వున్న విశ్వాసం, నమ్మించిన వాళ్లను నమ్మడం ఆయనకు వున్న విశ్వాసాన్ని దుర్వినియోగం చేసుకోవడం వల్లనే ఆయన చరిత్రలో ఆ దుర్ఘటన జరిగింది. ఆయన సహచరునిగా మా అందరికీ కూడా బాధాకర పరిణామమే జరిగింది. భారతదేశానికి తలవంపుగా జరిగింది అనే దానిలో సందేహం లేదు. కాబట్టి ఆ మచ్చ గాని, ఆ కళంకము గాని శ్రీ పి.వి. నరసింహారావు గారికి వ్యక్తిగతంగా రాదు, రాకూడదు. ఆయన త్రికరణశుద్ధిని, సర్వమత సమభావాన్ని ఏ మాత్రం శంకించడానికి వీలులేదు. ఆ విషయాన్ని నేను మరొకసారి స్పష్టంగా మనవి చేయదలచుకున్నాను. తరువాత సంస్కరణల గురించి చాలా మంది చెప్పారు. చాలా చక్కగా చెప్పారు. ఆయన సంస్కరణవాది. మానవీయ దృక్పథంతో, మానవతా వాదంతో సంస్కరణలను చేపట్టాలని చెప్పారు. ఈ దేశానికి ధనం రావచ్చు, విదేశీ పెట్టుబడులు రావచ్చు, స్వదేశీ పెట్టుబడులు బాగుపడవచ్చు. కాని ధనవంతుల విశ్వాసం పెట్టుబడిదారుల కొరకే కాదు కదా. సామాన్య ప్రజల జీవితాలలో మార్పు రావడం కొరకే సంస్కరణలని చెప్పేవారు. ఆయన గ్రామానికి వెళితే ఆయన అన్న మాటలు చెబుతాను. మొన్న చివరిసారి ఆయన చనిపోక ముందు ఏదైనా ప్రధాన ఉపన్యాసం చేశారంటే గాంధీ భవన్‌లో, ప్రకాశం హాలులో మన ముఖ్యమంత్రి గారు, గవర్నర్ షిండే గారు మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇద్దరూ పాల్గొనప్పుడు తెలంగాణా సాయుధ పోరాట సంస్మరణ సభ జరిగిన సందర్భముగా వారు స్పష్టముగా చెప్పారు. సంస్కరణలంటే ఒక గ్రామానికి వెళితే అక్కడి సబ్ ఇన్‌స్పెక్టర్ గాని, అక్కడి పోలీసు కానిస్టేబుల్ గాని, యం.ఆర్.ఓ గాని, యం.డి.ఓ గాని లేక వాళ్ల పాఠశాలలోని టీచర్ గాని, హెడ్ మాస్టర్ గాని, లేక అనేక మంది చిన్న స్థాయి ఆఫీసర్లు, కార్యకర్తలు వుంటారు. వాళ్ల యొక్క ప్రవర్తనలో మార్పు రావాలి, వాళ్లు ప్రభుత్వం ఇచ్చిన డబ్బును సద్వినియోగం చేసి రాజీవ్ గాంధీగారు ప్రవేశపెట్టినటువంటి నూటికి పదిహేను పైసలు మాత్రమే కిందికి వస్తున్నాయి గాని మిగతా అంతా మధ్యనే కాజేస్తున్నారనే అపోహను తొలగించాలి. దానిని నిజం చేయాలి. అన్ని పైసలు అందుబాటులో రావాలి. అప్పుడే సంస్కరణల యొక్క ప్రయోజనం. అప్పుడే ఈ దేశంలో అందరికీ సంతృప్తి వస్తుంది. ఎలా చేస్తారోనని నిలబడలేని పరిస్థితులలో, కాళ్లు

తడబడుతున్నప్పుడు, మాట తడబడుతున్నప్పుడు నెత్తిమీద చెయ్యి వేసుకొని కొట్టుకొని బుర్రను ఉపయోగించాలని అన్నారు.

ఉ. 9.50

అధ్యక్షా, బుర్రను ఉపయోగించాలి. బుర్రను ఉపయోగించి ఈ సంస్కరణలను సార్థకం చెయ్యాలి. ఆయన చివరి కోరికి మేరకు సంస్కరణలను అమలుపరచాలని మనవి చేస్తున్నాను. ఆయన యొక్క జీవితం నుండి నేర్చుకోవలసిన సారాంశము ఎంతో ఉంది. సమర్థుడు, స్వాతంత్ర సమరయోధుడు, భారత ప్రధాని, నా సన్నిహితుడు, మిత్రుడికి నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి గల్లా అరుణ కుమారి(చంద్రగిరి): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాపాన్ని బలపరుస్తూ, ఈరోజు దివంగత మాజీ ప్రధాని శ్రీ పి.వి. నర్సింహరావు గారితో నాకు గల కొన్ని సంబంధాలను మాత్రమే నేను మాట్లాడదలచుకున్నాను. పెద్దలందరూ వారి మంచితనాన్ని గురించి, వారు చేసిన మంచి పనులను గురించి వివరించారు. మళ్లీ వారు చెప్పినవి రిపీట్ చేయకుండా వారితో నాకున్నటువంటి అనుబంధాన్ని మాత్రమే ప్రస్తావించదలచుకున్నాను. 1980లో ఒకసారి పి.వి.నరసింహారావు మేము అమెరికాలో ఉన్నప్పుడు తానా సభలకు రావడం జరిగింది. అప్పుడు ఆయన నాతో మాట్లాడడం జరిగింది. చికాగోకు కూడా వచ్చారు. వారు వచ్చినప్పుడు మేము అక్కడున్నటువంటి తెలుగు వారందరిని పిలిచి ఒక గెట్ టు గెథర్ మీటింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పుడు వారు చెప్పిన మాటలు ఏమిటంటే, డాక్టర్లు వచ్చారు, ఇంజనీర్లు వచ్చారు, కొంతవరకు విజ్ఞత, సముపార్జన చేసుకొని మళ్లీ మీరు భారత దేశానికి రావలసిన అవసరం ఎంతైనా ఉంది, వచ్చి అక్కడ సేవలు చెయ్యాలని చెప్పారు. అది ఆయనతో అక్కడ ఉన్నటువంటి అనుబంధం. మళ్లీ తరువాత ఇండియాకి తిరిగి వచ్చినప్పుడు వారు ఏ.ఐ.సి.సి ప్రెసిడెంట్‌గా మా చిత్తూరు జిల్లాకు వచ్చినప్పుడు ఒక మాట చెప్పడం జరిగింది. అంతవరకు ఆయన పొలిటికల్ ఉపాన్యాసాలను నేను ఎప్పుడు వినలేదు, అప్పుడే మొట్టమొదటిసారిగా వినడం జరిగింది. అప్పుడు ఆయన చెప్పిన మాటలు నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ఆయన చెప్పిన ఒక మాట నాకు బాగా నచ్చింది. బడుగు, బలహీన వర్గాలకు, వీకర్ సెక్షన్స్‌కు మహిళలకు అందరికీ సంబంధించినది ఈ కాంగ్రెస్ పార్టీ. ఈ పార్టీని కాపాడండి, మీకు పార్టీ రక్షణ కల్పిస్తుందని చెప్పిన మాటలు నాకు బాగా గుర్తు. ఆ మాట నిజంగా నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆ విధంగా శ్రీ పి.వి. నరసింహారావు గారితో పరిచయం కలగడం, వారి ఉపన్యాసాలను వినడం జరిగింది. 1989లో మేము ఎం.ఎల్.ఏ అయి కాంగ్రెస్ పార్టీ గవర్నమెంట్‌లోకి వచ్చింది. 1991, 1992లో శ్రీ పి.వి. నరసింహారావు గారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు మహిళా సాధికారత గురించి, మహిళలకు ఏదైనా చెయ్యాలనిచెప్పి డ్వాక్రా పథకాలను, పొదుపు లక్ష్మి స్కీమ్స్‌ను పెట్టడం జరిగింది. ఆ రోజులలో మాకు సర్క్యులర్‌ను పంపించి, అందరు ఎం.ఎల్.ఏలు ప్రతి గ్రామానికి వెళ్లి డ్వాక్రా స్కీమ్స్ అంటే ఏమిటో వివరించాలని, మహిళలకు స్వయం సంతృప్తి కలిగేటట్లు మీరు చెయ్యాలని చెప్పినప్పుడు, మేమందరుమూ కూడా ప్రతి గ్రామానికి వెళ్లి, డ్వాక్రా గ్రూప్ అంటే ఏమిటో వివరించడం జరిగింది. దానితో ఈనాడు డ్వాక్రా మహిళలను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. ఈనాడు ఎం.డి.ఒ ఆఫీసులకు వెళ్లినా, బ్యాంకులకు వెళ్లినా మహిళలు బుక్స్ పట్టుకొని లోన్స్ కోసం స్వయంగా తిరగడం, స్వయంగా సముపార్జన చేసుకోవడం చూస్తుంటే వారిలో, నిజంగా శ్రీ పి.వి. నరసింహారావు గారు కళ్లల్లో మెదిలినట్లు ఉంటుంది. కొంతమంది చనిపోయినా కాని ఆ విధంగా మనలో ఉన్నట్లే ఉంటుంది. గాంధి గారు కూడా మన దేశంలో, మన ప్రజలలో నిలిచి ఉన్నారు. అదే విధంగా శ్రీ పి.వి. నరసింహారావు గారు ఈనాడు చనిపోయినా, వారు ప్రవేశపెట్టిన పథకాలు, వారి ఆలోచనలు ఎక్కడ చూసినా ముఖ్యంగా మహిళలలో ఆయన జీవించి ఉన్నారని చెప్పక తప్పదు. అదే విధంగా 1972లో వారు ఎక్కువగా మహిళల సీట్ల గురించి, అప్పుడు దాదాపుగా ముప్పై మంది మహిళలు శాసనసభలో ఉండడం జరిగింది. ఆ ఘనత ఆయనకే దక్కుతుందని నేను చెబుతున్నాను. అదే విధంగా గ్రామీణాభివృద్ధి గురించి చెప్పాలంటే, వారు గ్రామం నుండి డిల్లీ వరకు తిరిగారు కాబట్టి గ్రామీణ ప్రాంతాలను మరచిపోకుండా, గ్రామాలకు సంబంధించిన నిధులు తక్కువగా ఉండేవి, దానిని ముప్పై శాతం పెంచి, గ్రామీణ పనులకు ఉపయోగించిన ఘనత వారికే

దక్కుతుంది. అదే విధంగా నాబార్డ్ నామమాత్రంగా ఉండేది, ఆయన ప్రధాన మంత్రి అయిన తరువాత నాబార్డ్ స్థాయిని పెంచి, ఈరోజు మనకు ఏది కావాలన్నా తక్షణమే నాబార్డ్ నిధులు అందించగలిగే ఘనత కూడా శ్రీ పి.వి. నరసింహారావు గారికి దక్కుతుంది అనడంలో అతిశయోక్తి లేదు. ఒకసారి రంగా గారు బాగా సిక్ అయినప్పుడు పి.వి. నరసింహారావు రంగాగారిని చూడడానికి వచ్చారు. రంగా గారు, నేను రాజీవ్ ఇద్దరం రిటైర్డ్ అయ్యాము, మీరు ఆమెను కాపాడాలని చెప్పినప్పుడు, మేము ఇచ్చే ఎంకరేజ్‌మెంట్ ఇస్తాము, ఆమెను మేము కాపాడక్కరలేదు అనే మాటలు నాకు ఇంకా గుర్తొస్తూనే ఉంటుంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో 1992లో ఎలక్షన్ జరిగినప్పుడు, 1994లో ఆయన అక్కడకు రావడం జరిగింది. అప్పుడు ఆయన, అమ్మా నీ రికార్డ్ చాలా బాగుంది అందుకే నీ పేరు మొట్టమొదటి లిస్ట్‌లో క్లియర్ చేసానని చెప్పినప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది. ఆ సంతోషాన్ని నేను మనసారా అనుభవించడం జరిగింది. అటువంటి వారు ఇంత ఎంకరేజ్‌మెంట్ ఇచ్చి , అన్ని విధాలా దృష్టి సారించి, అందరికి మంచి స్ఫూర్తిని ఇచ్చిన ఆ మహానుభావుడికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబానిగి నా ప్రగాడ సానుభూతిని తెలుపుకుంటూ వారి ఆత్మకు శాంతి కలగజెయ్యాలని ఆ భగవంతుడిని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కోనేరు రంగారావు: అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన మన దివంగత మాజీ ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు గారి సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, శ్రీ పి.వి.నరసింహారావు గారు ఒక విశిష్టమైనటువంటి వ్యక్తిత్వం కలిగినటువంటి నాయకులు. మను ధర్మ శాస్త్రం మొదలకు శాస్త్రాలను అనుసరించి మంచి కుటుంబంలో జన్మించినటువంటి ఆయన ఈ సమాజం యొక్క ఆర్థిక సామాజిక మార్పుల కోసం, సంస్కరణల కోసం కష్టపడిన వ్యక్తి, మహనీయుడు, మహానుభావుడు, పూజ్యులు దివంగత శ్రీ పి.వి. నరసింహారావు గారని చెప్పి నేను మనవి చేస్తున్నాను. వారు ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టినటువంటి భూసంస్కరణల చట్టం చాలా పెద్ద పేరు వచ్చింది.

ఉ. 10.00

ఆ సమయంలో తన పదవీత్యాగానికయినా సిద్ధమయినారు కానీ రాజీ లేకుండా భూసంస్కరణల చట్టాన్ని అమలు చెయ్యాలని ధృడమైన దీక్షతో, విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన సంస్కరణవాదిగా ఈ నాటికీ ప్రజల హృదయాలలో నిలబడి ఉన్నారని చెప్పడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను. పెద్దలు చెప్పినట్లుగా, ఈ దేశ ఆర్థిక పరిస్థితి అస్థవ్యస్తమయినప్పుడు, తాత్కాలికంగా వచ్చిన మిశ్రమ ప్రభుత్వాలు ఈ దేశ గౌరవాన్ని, విలువలను, వెండి, బంగారాన్ని ప్రపంచ మార్కెట్‌లో అమ్మి, తాకట్టు పెట్టి, ప్రపంచ దేశాలలో ఈ దేశ మనుగడకే ప్రమాదం ఏర్పడినప్పుడు , అనుకోని రీతిగా అనతి కాలంలోనే ఆ విలువలను తిరిగి భారత దేశానికి తెచ్చి, ఈ దేశాన్ని నిలబెట్టి, ప్రపంచ దేశాలలో మళ్లీ ఉన్నతమైన దేశంగా నిలబెట్టిన మహా నాయకుడు, మహాత్ముడు అని గర్వంగా తెలియచేస్తున్నాను. ఈ దేశంలో నమ్మకమైన అనుచరుడు, విధేయత కలిగిన నాయకుడు. ఆ నాడు ఈ దేశంలో జాతీయ కాంగ్రెస్‌లో విబేధాలు వచ్చినప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ గారి కుటుంబానికి ఒక విశ్వాసపాత్రుడిగా , విధేయత కలిగిన, నమ్మకమైన నాయకుడిగా, ఆ కుటుంబంతో ధృడంగా నిలబడిన ఒక మహా నాయకుడు పి.వి. నరసింహారావు. ఆయన యొక్క గౌరవము, ఆయన యొక్క వ్యక్తిత్వము, ఆయన యొక్క విలువలను గుర్తు చేసుకుంటే, ఈ ఆంధ్ర రాష్ట్రానికి భారత దేశంలో ఒక ఉన్నతమైన, ఒక విలువైన స్థానాన్ని ఏర్పాటు చేసిన వ్యక్తిత్వం కలిగిన మహా నాయకుడు అని మనవి చేస్తున్నాను. అటువంటి మహానాయకుడిని కోల్పోయినందుకు చింతిస్తూ, హృదయపూర్వకంగా వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. సత్యనారాయణ రావు: అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, స్వర్గీయ పి.వి. నరసింహారావుగారికీ, నాకూ గల సంబంధాలలో కొన్ని విషయాలు ప్రస్తావించి, ముగిస్తాను. కరీంనగర్ జిల్లావాసులం. నేను

యువజన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు, స్టూడెంట్స్ నాయకుడిగా ఉన్నప్పుడు, అప్పుడప్పుడే అనుకుంటాను, మొదటిసారిగా 1957వ సంవత్సరంలో శాసన సభకు ఎన్నిక కావడం జరిగింది. 1957లో వారు శాసన సభ్యులయినారు. అప్పుడు పెద్దలు సిహెచ్. రాజేశ్వరరావు గారు వారితో సన్నిహితంగా ఉన్న వారిలో బహుశా వారు ఒక్కరే ఈ అసెంబ్లీలో మిగిలి ఉన్నారు. వారిద్దరూ ఒకేసారి ప్రవేశించారు. నేను వారి విషయంలో చాలా చూశాను. ఉత్తరాలు రాయాలన్నా వారే. జిల్లా పరిషత్‌లో వారే డ్రాఫ్ట్స్ వ్రాసేవారు. నేను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని. చొక్కారావుగారు జిల్లా పరిషత్ ఛైర్మన్. నరసింహారావుగారికే ఆ పని అప్పగించే వారు. వారే వ్రాసే వారు. రాజేశ్వర రావుగారు సి.పి.ఐలో ఉన్నప్పటికీ, ఇద్దరూ మిత్రులే. వారికే అప్పగించే వారు. అటువంటి వ్యక్తి. అన్నిటి కంటే ఎక్కువగా ఒక జిల్లా వాసులం. ఆ సమయంలో వారు మారు మూల ప్రాంతం నుంచి ఎన్నిక కాబడినా, ఆ జిల్లాతో ఎక్కువ సంబంధాలు పెట్టుకోలేదు. జిల్లా పరిషత్ మీటింగ్‌లకు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు వచ్చే వారు తప్ప అక్కడ సంబంధాలు తక్కువగా ఉన్నాయి. నేను చూశాను. కానీ వారు మొదటిసారిగా ఢిల్లీకి 1977లో వచ్చారు. 1971లో నేను వచ్చాను. వారితో నాకు చాలా దగ్గరి సంబంధాలు ఉండేవి. ఎన్నో విషయాలు చర్చించే అవకాశం దొరికింది. ఎంతో సంతోషించే విషయం. మొదటిసారిగా మేడిన్ స్పీచ్ ఇచ్చారు. ఎడ్యుకేషన్ డిమాండ్ మీద ఇచ్చారు. అప్పట్లో స్పీకర్ పేనల్‌లో నేను ఉన్నాను. ఒక గంట సేపు మాట్లాడారు. ఆయన ఉపన్యాసం విని ప్రతి వారూ ఎట్రాక్ట్ అయ్యారు. అంతా కూడా వారి సీటుకు వెళ్లి అభినందించారు. నేను అపోజిషన్‌లో ఉన్నాను. జనతా పార్టీ అధికారంలో ఉంది. ఆ నాడు నరసింహారావుగారు బ్రహ్మాండమైన ఉపన్యాసం ఇచ్చారు. పి.వి. నరసింహారావుగారి గురించి అప్పుడే తెలిసింది. 1980లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తరువాత విద్యా శాఖ మంత్రిగా ఉన్నారు. నేను ఎ.ఐ.సి.సి జనరల్ సెక్రెటరీగా ఉన్నాను. వర్కింగ్ కమిటీలో ఇద్దరం ఉన్నాము. ప్రతి విషయంలో ఇందిరా గాంధీగారు వారిని సంప్రదించకుండా నిర్ణయం తీసుకున్నట్లు నాకు గుర్తు లేదు. వారిని అడిగి, వారి సలహాలు తీసుకుని పని చేశారు. వారు సరైన సలహాలు ఇచ్చే వారు. ఇందిరా గాంధీ గారి సమయంలో ప్రపంచమంతా తిరిగే అవకాశం నాకు వచ్చింది. నన్ను ఎక్కడికయినా పంపే వారు. ఎక్కడకు పోయినా, విదేశాలలో ఆయన గురించి చెబుతుంటే ఎంతో సంతోషించే వారము. నెహ్రూ గారి కుటుంబంతో ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగిన వ్యక్తి. ఆ తరువాత విదేశాంగ మంత్రిగా ఉన్నారు. ఆయన గురించి ఎంతో గొప్పగా చెప్పేవారు. ఆయన నుంచి చాలా నేర్చుకునే విషయాలు ఉన్నాయి. ఆయన చాలా ఇంటలెక్చ్యువల్. మార్గరెట్ థాచెర్‌ను కలిసినప్పుడు చెప్పారు. ఇందిరా గాంధీగారు విదేశాంగ మంత్రిగా చాలా మంచి వ్యక్తిని పెట్టారని అన్నారు. చాలా మేధావి. ఎన్నో విషయాలు చాలా బాగా చెప్పేవారు. నేను ఇందిరా గాంధీగారికి చెప్పాను. '' అమ్మా, వారు విదేశాలలో చాలా పేరు ప్రతిష్టలు తెచ్చి పెట్టిన వ్యక్తి'' అని చెప్పాను. ఎక్కువ సమయం తీసుకోను. చాలా ఆలస్యం అయింది. రెండు విషయాలు మరచిపోరాదు. అందరూ చెప్పారు. రాజేశ్వర రావుగారితో చాలా దగ్గర సంబంధం ఉంది. ఇద్దరూ మేధావులే. భూసంస్కరణల గురించి మొదటి నుంచీ చెప్పే వారు. ఎప్పుడయితే భూసంస్కరణలు తీసుకురామో, బలహీన వర్గాలను పైకి తీసుకురామో, లాభం ఉండదు నక్సలిజం వస్తుంది అన్నారు. ''శాంతియుతంగా ఏదయినా మార్గం చూపకపోతే, ఆలోచించకపోతే, వీకర్ సెక్షన్స్, యువకులు తుపాకులు పట్టుకుని బయలు దేరుతారు.అప్పుడు భూస్వాములు పోతారు. అటువంటి అవకాశం లేకుండా, భూసంస్కరణలు తెచ్చి, వారికి భూములు ఇచ్చి, ఇక్కడ నుంచి మన వారు వెళ్లిపోతే మంచిది '' అని చెప్పిన వ్యక్తి. ఆ రోజు చెప్పిన విషయాలే ఇప్పుడు జరుగుతున్నాయి. ఎంతో దురదృష్టం. నక్సలిజం పెరుగుతోంది. ఇది ఆ రోజే వారు గ్రహించారు. భూసంస్కరణలు చెయ్యకపోతే తుపాకీ పట్టే పరిస్థితి వస్తుంది. చాలా ఇబ్బందులు వస్తాయి. అటువంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే చర్యలు తీసుకోవాలి, భూస్వాములు గ్రామాలు విడిచి పెట్టి పోతే మంచిది అని సలహాలు ఇచ్చారు. చాలా మందికి అది నచ్చలేదు. వారు ముఖ్యమంత్రిగా ఉండగా భూసంస్కరణలు తెస్తే, ఆయన మీద తిరగబడినప్పుడు, పదవి పోయి, ప్రెసిడెంట్ రూల్ పెట్టవలసిన పరిస్థితి ఆ రోజున వచ్చింది. అతను ఆ రోజున దూరదృష్టితో చెప్పిన విషయం. ఇప్పుడయినా ఏ ప్రభుత్వమయినా సరే – మా ప్రభుత్వం కానీ ఎవరయినా కానీ భూసంస్కరణలను తూచా తప్పకుండా అమలు చెయ్యాలి. ఈ ప్రభుత్వం ఆ ప్రయత్నం చేస్తోంది. ఆ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. ఆ రకంగా చేసిన నాడే వారికి సరైన నివాళి అర్పించిన వారం అవుతాము. రెండవ విషయం. ఆయనకు గల ఓపిక రాజకీయ వేత్తలలో ఎవరిలోను చూడలేదు. వారిని నేను చాలా దగ్గరగా చూశాను. ఎవరయినా ఆయన మీద కోపం తెచ్చుకున్నా, ఏమీ అనుకోకుండా ఓపికతో వినేవారు.

ఆ మహానుభావుడు ఆ ఓపికతోనే అంత పైకి వచ్చాడు. ప్రధానమంత్రి కాగలిగాడు అంటే దానికి కారణం ఆయన ఓపిక బాగా పని చేసింది. ఆ ఓపిక అన్నది నేర్చుకోవాలి. నేను ప్రయత్నం చేశాను కానీ ఫెయిల్ అయ్యాను. నా వల్ల కాలేదు. ఆయన చెప్పిన దానికి వ్యతిరేకంగా వ్యవహారాలు చేసుకుంటూ వచ్చాను కాబట్టి మధ్య మధ్యలో దెబ్బలు తింటూ వచ్చాను. పి.వి. నరసింహా రావు గారు ఆ విధంగా ఓపిక పట్టారు, అటువంటి ఓర్పు ఉండేది కాబట్టి ఎటువంటి పరిస్థితులు వచ్చినా కూడా ఏ విధంగా స్పందించకుండా ఇతరులను దూషించకుండా జాగ్రతగా ఉన్ననాడు బాగుంటుంది అని చెప్పిన వ్యక్తి.

అంతే కాకుండా ఆయన మనకు ఒక గిఫ్ట్ ఇచ్చి పోయాడు. 1991 లో ప్రధాన మంత్రి అయిన తరువాత ఎవరూ ఊహించ లేదు. మన్‌మోహన్‌సింగ్ రాజకీయ నేత్త కాదు. రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా ఉండేవారు. కానీ అప్పుడు ఉన్న పరిస్థితులను సరిదిద్దే శక్తి సామర్థ్యాలు ఆయన అతనిలో చూశాడు. నేను పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో మెంబరుగా ఉన్నప్పుడు నరసింహారావు గారు చైర్మన్‌గా ఉండి ముంబాయి వెళ్లినప్పుడు అక్కడ మన్మోహన్‌సింగ్ గారు కనిపించడం, ఆయనతో చర్చించడం జరిగింది. చాలా విషయాలు అప్పుడు గ్రహించారు. ఈ వ్యక్తి చాలా ఆర్థిక వేత్త, చాలా బాగుంటుంది అని చెప్పి మనసులో ఆయనకు నాటుకుపోయింది. అదే విధంగా ఆయన ప్రధాన మంత్రి అయిన తరువాత ఎంతో సాహసోపేతంగా ఎవరూ ఊహించని విధంగా మన్‌మోహన్ సింగ్ గారిని తీసుకువచ్చి ఆర్థికమంత్రిని చేశారు. ఎవరూ ఊహించి ఉండరు. అటువంటి వారిని ఆర్థిక మంత్రిగా తీసుకు రావడం వల్ల ఆయన పుణ్యమా అంటూ ఎన్నో విషయాలలో రిఫారమ్స్ తీసుకు రావడం జరిగింది. ఆర్థికవ్యవస్థను బాగు చేయడం జరిగింది. ఆయన ప్రధాన మంత్రిగా ఉన్న ప్పుడు రెండు ప్రధానమైన విషయాలలో చాలా పెద్ద కంట్రిబ్యూషన్ ఉందని చెప్పి నా ఉద్దేశ్యం. చాలా విషయాలు చాలామంది వక్తలు చెప్పారు. పెద్దలు రాజేశ్వర రావు గారు వారితో ఉన్న సాన్నిహిత్యం, వారితో ఉన్న అనుభవం చెప్పిన తరువాత నేను ఇంకా ఎక్కువ చెప్పవలసిన అవసరం లేదు. ఏది ఏమైనా ఆయన మన రాష్ట్రం వాడు. అందులోనూ నా జిల్లాకు సంబంధించిన వ్యక్తి. ఒక ప్రధాన మంత్రిగా ఉండి ఎన్నో విధాలుగా కీర్తి ప్రతిష్టలు తెచ్చిన వ్యక్తి మనకు లేరు. వారు చనిపోయినందుకు నేను సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా. పొన్నాల లక్ష్మయ్య:- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సమర్థిస్తున్నాను. వరంగల్ జిల్లా వాసిగా వారు లోక్‌సభ ఎన్నికలలో అతని ఎన్నిక కోసం పని చేసిన వ్యక్తిగా కొన్ని విషయాలు స్పష్టంగా ఈ సభ దృష్టికి తీసుకురావడం నా బాధ్యత అని భావిస్తున్నాను. మొట్టమొదటిసారి 1973 చివరిలో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు వదిలిన తరువాత అమెరికా దేశానికి వచ్చినప్పుడు న్యూయార్క్‌లో కలుసుకోవడం జరిగింది. మొదటిసారిగా కలుసుకున్నప్పుడు రెండు రోజులపాటు వారితోబాటు ఉంటూ న్యూయార్క్ పట్టణం చూపించడం నా మొదటి అనుభవం. ఆ తరువాత చాలాసారులు ప్రత్యేకంగా కలవడం ఈ దేశానికి వచ్చిన తరువాత ఆయన ఎన్నికలలో పని చేయడం, ఒక విశిష్టమైన వ్యక్తిగా పరిగణించిన సందర్భాలలో ఒకటి, రెండు విషయాలు ఇక్కడ చెప్పక తప్పదు. ప్రభుత్వ యంత్రాంగంలోనే అతి చిన్న ఉద్యోగస్థుల కుటుంబంలో గ్రామంలో కరణీకం చేసే కుటుంబంలోనించి వచ్చిన వ్యక్తి. ప్రభుత్వ యంత్రాంగంలో దేశంలో అత్యున్నత స్థానాన్ని అధిరోహించిన ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు గారు. రాజకీయాలలో ఒక విశేషంగా చెప్పవచ్చు. అదే విధంగా చాలామంది వక్తలు మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాల గురించి చెప్పారు. కానీ ముఖ్యమంత్రిగా ఫ్యూడల్ వ్యవస్థ కుటుంబం నుంచి వచ్చిని వ్యక్తి, రాష్ట్రంలోని, దేశంలోని పేదప్రజలకు శాశ్వతంగా మంచి కార్యక్రమాలు చేసే ఉద్దేశ్యంలో భూసంస్కరణలు ప్రవేశపెట్టడం మరొక అంశం. ఫ్యూడల్ వ్యవస్థలో ఉన్న వాళ్లు వారంతట వారు భూసంస్కరణలు తీసుకు రావడం అన్నది రాజకీయాలలో మరొక విశేషంగా చెప్పుకోవచ్చు. అదే విధంగా 1985 లో వారి సూచనల మేరకు ఆనాటి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈనాటి ముఖ్యమంత్రి ఇద్దరి చలవ వల్లే నా రాజకీయ అరంగ్రేటం ప్రారంభమైంది. వారు ప్రధానమంత్రి

అయిన రోజులలో ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితి, లోక్‌సభలోని ఆనాటి సంఖ్యాబలం, విదేశీ మారక ద్రవ్య నిల్వల పరిస్థితులలో ఇవి చరిత్రకు సాక్ష్యాలుగా చెబుతున్నాను. కానీ ఆ సందర్భాలలో సంస్కరణలు తీసుకురావడం, ఆ సంస్కరణల ద్వారా ఈ దేశ ఆర్థిక పరిస్థితి బలోపేతం చేయడమే కాకుండా ప్రపంచ దేశాలలోనే ఈ దేశం యొక్క ఆత్మగౌరవాన్ని సరిగా నిలబెట్టే చర్యలు చేశారు. అది చరిత్రలో నిలిచిపోయింది. అదే విధంగా సంస్కరణలతోబాటుగా ఈ దేశంలోని గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తిగా గ్రామీణాభివృద్ధికి మొట్టమొదటిగా రు.30 వేల కోట్లు 5 సంవత్సరాల కాలంలో ఖర్చు పెట్టడానికి, వచ్చే అయిదు సంవత్సరాలలో మళ్లీ రు.60 వేల కోట్లతో పెట్టే అవకాశం ఉందని నిర్దేశించి చెప్పిన వ్యక్తి. ఆ తరువాత వచ్చిన మిశ్రమ ప్రభుత్వం రు.50 కోట్లు గ్రామీణాభివృద్ధికి కేటాయించడం ముఖ్యంగా చెప్పుకోవచ్చు. వుమన్ ఎంపవర్‌మెంట్ గురించి కూడా చాలా చక్కగా చెప్పారు. అనేక సందర్భాలలో అనేక ఉపన్యాశాలు ఇచ్చినప్పటికీ నన్ను విశేషంగా ఆకట్టుకున్నవి, ప్రభావితం చేసినవి మూడు ఉపన్యాసాలు ఉన్నాయి. ఒకటి – ప్రధాన మంత్రిగా అమెరికన్ హౌసింగ్ అండ్ సెనేట్‌లో ఉభయ సభలలో మాట్లాడిన ఆయన తీరు, సారాంశం, ఈ దేశం 50 సంవత్సరాలలో ప్రజాస్వామిక చరిత్ర, ఆ దేశం 200 ల సంవత్సరాల చరిత్రతో పోలిస్తే ఈ దేశం ఎంత ముందడుగు వేస్తున్నదో, ప్రజాస్వామికంగా మీకంటే మా దేశంలోనే ఎక్కువగా ప్రజాస్వామ్యం ఉందని చెప్పి నిరూపించిన ఆ ఉపన్యాస సారాంశం నన్ను చాలా ఆకర్షింప చేసింది. రెండవది – సంస్కరణల పట్ల 1992 లో తిరుపతిలో ఆల్ ఇండియా కాంగ్రెస్ ఎ.ఐ.ఐ.సి ప్లీనరీ సెషన్‌లో బహిరంగ సభలో ఒక సాధారణ పౌరుడికి అర్థం అయ్యేలాగా ఆయన సంస్కరణల గురించి మాట్లాడిన తీరు ఇప్పటికీ నా మనసులో మెదులుతుంటుంది. As the Leader of Opposition on 'No Confidence Motion' his speech is really a matter that can be remembered. అంటే ఆయన చాలా పెద్దమనిషి అయినప్పటికీ కూడా నా వ్యక్తిత్వానికి ఈ మూడు ఉపన్యాసాలు నా జీవితంలో శాశ్వతంగా నిలిచిపోతున్నాయి. ఆయన చివరి దశలో కూడా వారిని కలుసుకునే అవకాశం కలిగింది. వారు నన్ను పిలిపించడం జరిగింది. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఉండీ రాష్ట్రంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తరువాత ఒకసారి పిలిపించి ఏమయ్యా నదుల అనుసంధానం గురించి ఒక సెమినార్ స్వామి రామానంద తీర్థ ఇన్‌స్టిట్యూట్‌లో మీరు పెట్టండి. దానికి సురేష్ ప్రభు ఇంకా ఇతర నిపుణులు వస్తారు. దీనిని గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటే మంచిది ప్రజలలో నదులు అనుసంధానం చేయడం గురించి తెలిపి వారిని చైతన్యం చేయడం మంచిది అని చెప్పిన తరువాత నదుల అనుసంధానం కార్యక్రమం గురించి ఒక సెమినార్ పెట్టడం జరిగింది. ఆ తరువాత మళ్లీ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు వెళ్లి ఆ వివరాలను వారికి వివరించడం జరిగింది. వారు అప్పుడు ఒక మాట మాత్రం అడిగారు. మన వరద కాలువ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నటుగా ఉందా అని అడిగినప్పుడు కాదు సర్ గత సంవత్సరం ప్రారంభం చేశారు. ఈ సంవత్సరం చాలా పెద్ద ఎత్తున దాని పనులు ప్రారంభించడం జరిగిందీ అని చెప్పడం జరిగింది. అంటే ఆయన హాస్పిటల్‌లో ఉండి కూడా రాష్ట్రానికి, దేశానికి అవసరం అయ్యే విషయాలలో నా లాంటి వాడిని పిలిపించి చర్చించి పనులు పురమాయించి ప్రోత్సహించడం చేసిన సందర్భాలను గుర్తు చేస్తున్నాను. ముఖ్యమంత్రిగా ఉండి ఆనాటి ఎన్నికలలో బడుగు వర్గాలకు మొట్టమొదటి సారి ప్రోత్సాహం ఇచ్చి పెద్దపీట వేసిన విషయం మర్చిపోలేని అంశం. అయితే కాంగ్రెస్ పార్టీ విధానాలకు, కార్యక్రమాలకు రూపకల్పన చేసిన వారిలో ఆద్యుడు. He is one of the very few intellectuals among the politicians of the time. వారి మరణం పట్ల నా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.10.20

శ్రీ డి. శ్రీధర్‌బాబు(మంథని): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. కీర్తిశేషులు శ్రీ పి. వి. నరసింహారావుగారు నాలుగుమార్లు ప్రాతినిధ్యం వహించిన మంథని నియోజకవర్గం నుండి నాకు గాని, అదేవిధంగా మా నాన్నగారు శ్రీపాదరావుగారికి గాని, అదేవిధంగా సి. నారాయణరెడ్డి గారికి గాని ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్గినందుకు నాకు చాలా గర్వంగా వుంది. గొప్ప మేధావి, సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు, ఈనాటి యువరాజకీయ వేత్తలకు ఆదర్శ రాజకీయవేత్తగా మంచి బాటను చూపించిన గొప్ప రాజకీయ దురంధరులు కీర్తిశేషులు పి.వి. నరసింహారావుగారు. మంథని నియోజకవర్గంనుండి ఈ శాసనసభకు మొట్టమొదటిసారిగా 1957 సంవత్సరంలో వారు ఎన్నిక కావడం జరిగింది. వారి సమకాలికులు పెద్దలు రాజేశ్వరరావు గారు కూడా సభలో వున్నారు. ఆ తరువాత నాలుగు సార్లు మంథని నియోజకవర్గం నుండి వారు ఎన్నికైనారు. ఈ నియోజకవర్గం మారుమూల అటవీ ప్రాంతం . అదేవిధంగా గిరిజనులు, దళిత సోదరులు ఎక్కువగా వుండే ప్రాంతం . వారి అభివృద్ధి గురించి నిరంతరం ఇటు శాసనసభ ద్వారా , అటు మంత్రిగా మంత్రిత్వ శాఖల ద్వారా పోరాడి వారి కొరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మంథని అభివృద్ధి చెందడానికి వారు ముఖ్యకారకులు అయినారు. ఆనాడు వనరులు చాలా తక్కువ . మారుమూల అటవీ ప్రాంతం అయినందున మౌలిక సదుపాయాలను గురించి వారు ఎల్లప్పుడు ఆలోచన చేసి విద్యుచ్ఛక్తి విషయంలో కానివ్వండి, అటవీ ప్రాంతంలోని గ్రామాలకు ఫార్మేషన్ ఆఫ్ రోడ్స్ విషయంలో కానివ్వండి, అక్కడ ఉపాధి విషయాల విషయంలో కానివ్వండి వారు పూర్తి స్థాయిలో ప్రభుత్వపరంగా అన్నితీరులా అభివృద్ది కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. మా ప్రాంతం పూర్తిగా మెట్ట ప్రాంతం . గోదావరి పరీవాహక ప్రాంతంలో మానేరు నది ఒడ్డున వున్న ప్రాంతం . ఆనాడు మల్హారరావు మండలంలో బొగ్గుల వాగు మీడియం యిరిగేషన్ ప్రాజెక్టును వారు మొదలుపెట్టడం జరిగింది. ఈనాడు 20 వేల ఎకరాల భూమికి ఆ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా మంథనిలోని మూడు మండలాలలోగల చిట్టచివరి మెట్టభూములకు నీరు అందించడం కోసం, వాటిని టెయిలెండ్ భూములుగా గుర్తించి నీరు అందించడం కోసం ఆనాడు వున్న అధికారులతో, మంత్రులతో చర్చించి శ్రీరాంసాగర్ కాలువను ఎంతవరకు వీలయితే అంతవరకు వారు తీసుకురావడం జరిగింది. దానివల్ల 30 వేల ఎకరాల భూమికి నీరందించే వీలు కలిగింది.

ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కొన్ని విషయాలను సభదృష్టికి తీసుకురావడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. శ్రీరాంసాగర్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్‌కు శ్రీ పి.వి. నరసింహారావుగారు ప్రధానమంత్రిగా వుండగా శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టి , నాల్గైదు జిల్లాలకు వర్తించే విధంగా ఫ్లడ్‌ఫ్లో కార్యక్రమం చేపడితే తప్ప తెలంగాణా ప్రాంతం అభివృద్ధి చెందదనే అభిప్రాయంతో పెద్ద కార్యక్రమం తీసుకోవడం జరిగింది. మా పక్కనే వునన గోదావరి ఖని ప్రాంతంలో సింగరేణి గనులు వున్నాయి. సింగరేణి గనులను విస్తరణ చేయడానికి వారు ప్రధానమంత్రిగా వున్నప్పుడు అనేక నిధులు కేటాయింపు చేసి, ఆనాడు బిఐయఫ్ఆర్‌కు రిఫర్ చేస్తున్న తరుణంలో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అప్పటి కేంద్రమంత్రుల సహాయంతో విస్తరణ కార్యక్రమం చేపట్టి బిఐయఫ్అర్‌కు రిఫర్ కాకుండా వుండడం కోసం వారు చేపట్టిన కార్యక్రమం ముదావహం . మా దగ్గరవున్న ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆనాడు మూతపడిన సందర్భంలో వారు ప్రధానమంత్రిగా ఆర్థిక వనరులను సమకూర్చి ఆ సంస్థ మూతపడకుండా చర్యలు తీసుకోవడం అనేది వారు చేసిన పలు కార్యక్రమాల్లో ఒకటిగా మనవి చేస్తున్నాను. పెద్దలు చాలా విషయాలు చెప్పారు. రాజీవ్ రహదారిని ఈనాడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఆనాడు మంథనికి పోవాలంటే 8, 9 గంటలు పట్టేది, నేడు 3, మూడున్నర గంటల్లో పోగలుగుతున్నాము. సభాముఖంగా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. వారు ఏదృక్పథంతోనైతే మొదలుపెట్టారో దానికి అనుగుణంగా టు వే కాకుండా ఫోర్ వే చేసి వారి జ్ఞాపకార్థం రాజీవ్ రహదారిని వెడల్పు చేయవలసిందిగా కోరుతున్నాము. అదేవిధంగా వరంగల్ నుండి రాయపట్నంవరకు వున్న రహదారి విషయంలో పి.వి. నరసింహారావు గారు ప్రధానమంత్రిగా వుండగా ప్రత్యేక చొరవతో వరంగల్ నుండి రాయపట్నం వరకు హైవేతో కలపడం జరిగింది. వారు గొప్ప మేధావి, స్టేట్స్‌మెన్, కొత్త జనరేషన్‌కు గ్రేట్ పొలిటికల్ విజనరీ, రిఫార్మిస్ట్ . వారు ముఖ్యమంత్రిగా వుండగా తీసుకువచ్చిన భూసంస్కరణల చట్టం వల్ల బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు చేకూరింది. ఈనాడు గ్రామాలలోని యస్‌సిలు, యస్‌టిలు, బిసిలు, నిరుపేదలు ఒకటి, రెండు ఎకరాలు భూమి దున్నుకుంటున్నారంటే కారణం కీర్తిశేషులు పి.వి.

నరసింహారావు గారి చలువే. నేడు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ విషయంలో వారు మంత్రిగా వుండగా ఆశ్రమపాఠశాలలు స్థాపించడం జరిగింది. వారు హెచ్ఆర్డి మినిస్టర్గా వుండగా నవోదయ విద్యాసంస్థలను స్థాపించడం ద్వారా మేలైన విద్యావకాశాలను బడుగు, బలహీన వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు కల్పించడం జరిగింది. ఎక్స్టర్నల్ ఎఫైర్స్ మినిస్టర్గా, డిఫెన్స్ మినిస్టర్గా, ప్రధానమంత్రిగా వారు ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. స్థానిక సంస్థలు బలోపేతం కావడానికి 73, 74 రాజ్యాంగ సవరణలను తెచ్చిన మహనీయులు పెద్దలు పి.వి. నరసింహారావు గారు. ఈనాడు మా మంథని నియోజకవర్గానికే కాదు ఆంధ్రరాష్ట్రానికి, కరీంనగర్ జిల్లాకు, యావత్ భారత దేశానికి వారు లేని లోటు కనబడుతోంది. వారిని మనం ఎల్లప్పుడు గుర్తు చేసుకోవలసి వుంది. వారి కుటుంబానికి, మా కుటుంబానికి మధ్య వున్న సత్సంబంధాలను సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఈనాడు కీర్తిశేషులు పి. వి. నరసింహారావు గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.
ఉ.10.30

శ్రీ కె. రాములు(మెట్పల్లి) : స్పీకర్ సార్, గౌ.పి.వి. నరసింహారావుగారి మృతికి సంతాపం తెలియచేస్తూ గౌరవ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ, రెండు మూడు విషయాలను సభ ముందు ఉంచదలచుకున్నాను.

ముఖ్యంగా ఏమిటంటే, కరీంనగర్ జిల్లా నుండి వేరే జిల్లాకు వెళ్లి పోటీ చేసినా, రూరల్ బ్యాక్గ్రౌండ్తో ప్రధానమంత్రి అయి, దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి, దేశ ఆర్థికాభివృద్ధికి పాటుపడ్డారు. ఆయన ప్రధానమంత్రి కాగానే రిటైర్ అయిన ఒక బ్యాంకర్, మేధావి, ఈనాటి ప్రధానమంత్రి అయిన డా.మన్మోహన్సింగ్ను తన క్యాబినెట్లోకి ఆర్థిక మంత్రిగా తీసుకుని దేశాభివృద్ధికి చక్కని బాటలు వేశారు. రెండు, మూడు రోజుల కిందట మన్మోహన్సింగ్గారు బెంగళూరులో ఒక మాట అన్నారు--లిబరలైజేషన్ తరువాత, రిచ్కు పూర్కు మధ్య గ్యాప్ బాగా పెరిగిపోయిందని, దానిని తగ్గించవలసిన అవసరం ఉందని అన్నారు. అందుకే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖర్రెడ్డిగారు కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నందుకు వారిని కూడా అభినందిస్తున్నాను. పి.వి. నరసింహారావుగారు తీసుకుని వచ్చిన సంస్కరణల్లో భాగంగానే ఈ ప్రభుత్వం కూడా పేద వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నందుకు నేను అభినందిస్తున్నాను.

పి.వి. నరసింహారావుగారి మీద అనేక కేసులను అక్రమంగా బనాయించినప్పటికీ, ఎటువంటి సాక్ష్యాధారాలు లేనప్పటికీ, ఆయన మీద కేసులు పెట్టడం జరిగింది. ఉన్నత న్యాయస్థానాలు వాటిని కొట్టివేయడం జరిగింది. ఆ సందర్భంగా లీగల్ సిస్టమ్ గురించి పునరాలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అట్లాగే పి.వి. నరసింహారావుగారు ఈ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా భూసంస్కరణలను అమల్లోకి తీసుకుని వచ్చారు. వారు ప్రవేశపెట్టిన ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం, ఈనాడు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా జనవరి 26వ తేదీ నుండి పేదలకు భూముల పంపకాన్ని మొదలుపెట్టింది. దీనికి గాను కోనేరు రంగారావుగారి అధ్యక్షతన ముఖ్యమంత్రిగారు ఒక కమిటీని వేశారు. మన రాష్ట్రంలోని పేదలకు పూర్తిగా న్యాయం జరగాలంటే ఈ కమిటీ సక్రమంగా పనిచేసే విధంగా ప్రభుత్వం నిర్దేశించాలని కోరుతున్నాను.

ఇప్పుడే మిత్రులు శ్రీధర్‌గారు చెప్పారు. పి.వి. గతంలో మంథని నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు. కాబట్టి, మంథని నియోజకవర్గానికి ఆయన పేరు పెడితే బాగుంటుందని నా సూచన.

ఇంతకు ముందే అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులు సభ నుండి వాకౌట్ చేసి వెళ్లారు. బాబ్రీ మసీదును కూల్చిన ప్రదేశంలోనే తిరిగి అక్కడ మసీదును తప్పనసరిగా కట్టాలని పి.వి.గారు కూడా అనుకునేవారు. కాబట్టి ఆ విధంగా అదే స్థలంలో బాబ్రీ మసీదును పున:నిర్మించేందుకు ఏర్పాట్లు జరగాలని నా భావన.

ఆ తరువాత కరీంనగర్–నిజామాబాద్ వయా మెట్‌పల్లి రైల్వే లైన్‌కు ఆయన శంఖుస్థాపన చేశారు. దీని గురించి నేను అసెంబ్లీలో అడుగు పెట్టగానే అన్ని పార్టీల శాసనసభ్యులతో సంతకాలు తీసుకుని ప్రధానమంత్రికి ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. కాని ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. కాబట్టి ఈ సంవత్సరపు బడ్జెట్‌లో అయినా ఆ రైల్వే లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకుని రావాలని మీ ద్వారా కోరుతున్నాను.

పి.వి. నరసింహారావుగారు ముందుగా తహశీల్దారు అయ్యారు. ఆ తరువాత ఒకసారి వారు, స్వామి రామానంద తీర్థ దగ్గరకు వెళ్లి కలిసినపుడు, తహశీల్దారుగా ఉండొద్దు, నువ్వు బూర్గుల రామకృష్ణారావు దగ్గర జూనియర్‌గా చేరి, మంచి అడ్వకేట్ అవ్వవలసిందిగా సూచించారు. దాంతో ఆయన బూర్గుల దగ్గర జూనియర్‌గా చేరి, ప్రాక్టీస్ చేయడం మొదలుపెట్టారు. ఆ తరువాత ఆయన అంచలంచెలుగా ఎదిగి, ఈ దేశానికి ప్రధానమంత్రి అయి, దేశానికి, ఈ రాష్ట్రానికి ఎన్నో సేవలు చేసారు. అదే విధంగా భూసంస్కరణలు ప్రవేశపెట్టి, పేద, గొప్ప వారి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించడానికి ప్రయత్నించారు. వారు చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రభుత్వం కూడా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ, శ్రీ పి.వి.నరసింహారావుగారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

శ్రీ ఎస్. సంతోష్‌రెడ్డి : అధ్యక్షా, గౌ.ముఖ్యమంత్రిగారు, పి.వి. నరసింహారావు మృతి పట్ల ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

అధ్యక్షా, కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం. ఈ రెండింటి మధ్య జరిగే రెప్పపాటు వ్యవధే జీవితం. పుట్టిన ప్రతి ప్రాణి గిట్టకతప్పదు. పేదవాడైనా, పెద్ద వాడైనా, చిన్నవాడైనా, కటిక దరిద్రంతో అలమటించే వాడైనా, వంద సంవత్సరాలైన తరువాత దేహం చాలించక తప్పదు. కాని కొంత మంది చరిత్రహీనులుగా చనిపోతారు, మరికొంత మంది చరిత్ర సృష్టించి చనిపోతారు. మరి పి.వి. నరసింహారావుగారు చరిత్రపుటల్లో చెరగని ముద్ర వేసుకుని మన భారతదేశ చరిత్రలో ఒక మేధావిగా, రాజనీతిజ్ఞుడుగా, బహుభాషా కోవిదుడుగా, సంఘ సంస్కర్తగా చరిత్రపుటల్లో చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి ఈరోజు మన మధ్య లేకుండాపోయారు. వారి లేని లోటు లోటుగానే మిగిలిపోతుందని మనవి చేస్తున్నాను.

వారు ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన రోజుల్లో వారు మాట్లాడిన మాటలు ఇంకా నా చెవుల్లో గింగురమంటూనే ఉన్నాయి. గాంధీభవన్‌లో కార్యకర్తలను ఉద్దేశించి ఒక మాట చెప్పారు. భారతదేశంలో తొండర్‌మల్ శాసనాలున్నాయి, ఆ శాసనాల మేరకు ఎవరైనా పరిపాలన కొనసాగించవచ్చు. పరిపాలన అంటే శిస్తు వసూలు చేయడం, కర్రపెత్తనం చలాయించడం కాదు, పరిపాలన అంటే మారుతున్న సమాజానికి అద్దం పట్టే విధంగా, ప్రజల అవసరాలను తెలుసుకుని, సంస్కరణల ద్వారా ఎప్పటికప్పుడు పరిపాలిస్తే అదే నిజమైన పరిపాలన అనిపించుకుంటుదని చెప్పారు. చెప్పడమే

కాదు, వారు చేసి చూపించారు కూడా. భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటగా, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన ఆంధ్ర రాష్ట్రంలో భూసంస్కరణలు తీసుకొని వచ్చిన ఘనత వారికే దక్కింది. భూసంస్కరణలు అమలుచేసి, ఒక స్వామ్యవాదిగా, ఒక అభ్యుదయవాదిగా చరిత్రలో మిగిలిపోయారు. ఆ తరువాత ప్రధానమంత్రిగా, తెలుగు ప్రజల ముద్దుబిడ్డగా, మొట్టమొదటగా దక్షిణ భారతదేశం నుండి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత, భారతదేశం ఆనాడు ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్న పరిస్థితుల్లో, బంగారాన్ని సహితం కుదవ పెట్టవలసి వచ్చిన సందర్భంగా, ఆర్థిక పరిపుష్టత సాధించడానికి ఆనాడు నూతన ఆర్థిక విధానాలు, నూతన పారిశ్రామిక విధానాలు ప్రవేశపెట్టి, భారతదేశం తిరిగి ఆర్థికంగా పుంజుకోగలిగేటట్లు చేసిన విషయం మనందరకీ తెలిసిందే. అలాంటి మహనీయుడు అభ్యుదయవాదిగా, సామ్యవాదిగా ముద్ర వేసుకుని చరిత్రలో మిగిలిపోయారు. ఆయన మనందరికీ ఆదర్శప్రాయుడు అనే మాట మనవి చేస్తున్నాను. ఇంకొక మాట కూడా చెప్పారు. మనలో చాలా మంది నేను అది చేసాను, ఇది చేసాను, ఈ ప్రాజెక్టును నేనే కట్టించాను, ఈ గుడి కట్టించాను, ఈ గోపురం కట్టించాను అని చెపుతుంటారు. కాని ఆయన ఏమి చెప్పేవారంటే, **"నేను కట్టించాను, నేను చేయించాంటాను అని మీరు అంటున్నారు, నేను ఎవరినయ్యా, చేయడానికి, పి.వి. నరసింహారావు వ్యక్తిగతంగా ఏమి చేయగల్గుతాడు, ప్రధానమంత్రిగా నేను ఏదీ చేసినా, అది రాజ్యాంగబద్ధంగానే చేస్తాను, రాజ్యాంగమే నా ద్వారా ఈ పనులు చేయిస్తున్నది, ప్రధానమంత్రిగా నేను ప్రాధాన్యతలను మాత్రమే ఫిక్స్ చేయగల్గుతాను"** అని అన్నారు. ఆయన జీవితం తెరచిన ఒక తెల్లటి పుస్తకం వంటిదని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. కొంత మంది అంటుంటారు, ఆయన ఇక్కడ పుట్టి ఏమి చేశారు అని. నేను ఈ సందర్భంగా చెప్పేదేమిటంటే, వంగరలో పుట్టిన ఆయన, ప్రధానమంత్రిగా కేవలం వంగరకే ఏదో చేయాలనే సంకుచిత భావాలు వారికి ఉండేవి కాదు.

ఉ.10.40

అంకితమైన భావాలున్న వ్యక్తిగా చరిత్రలో మిగిలిపోతాడు. ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి ప్రధానమంత్రి అయినపుడు ఆయన ఆ ప్రాంతానికే కాదు యావద్దేశానికీ ప్రధానమంత్రి. ఆ విధంగా సమగ్రంగా కార్యక్రమాలు చేసినపుడు అది వారికి కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించి పెడతాయని మనవి చేస్తూ, ముఖ్యంగా నేను నిజామాబాదు ప్రాంతానికి చెందిన వ్యక్తిని కాబట్టి ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చూస్తే, పోచంపాడు వరద కాల్వ. ఇది మూడు జిల్లాలకు వరప్రదాయిని. ఆనాడు మన ప్రియతమ ప్రధాని ఇందిరాగాంధి మెట్ట ప్రాంతాలను సందర్శించి ఈ ప్రాంతాలకు జలాలను ఏ విధంగా సమకూర్చ గలుగుతామని అడిగినపుడు పి.వి. నరసింహారావు గారు చెప్పారు, వరద కాలవ ఒక్కటే శరణ్యమని. ఇది వారి మేధస్సు నుంచి వచ్చిన ఆలోచన.

అదే విధంగా నేను రోడ్లు భవనాల శాఖ మంత్రిగా జనార్దన రెడ్డి గారి క్యాబినెట్‌లో ఉన్నపుడు పెద్దపల్లి రైల్వే మార్గం గురించి, ఒక్కసారి కాదు నాలుగు సార్లు మీటింగు పెట్టి అధికారులకు చెబితే వారు సాధ్యం కాదంటే, చివరకు పి.వి. నరసింహారావు గారి వ్యక్తి గత ఇంటర్వెన్షన్ వల్ల పెద్దపల్లి రైల్వే మార్గం ఏర్పాటైంది. వారు విశాల హృదయంతో ఉన్నప్పటికీ తన ప్రాంతానికి కూడా ఎంతో సేవ చేశాడని చెప్పడానికి ఇది ఒక తార్కాణం.

వేరే విషయాలలోకి పోకుండా చర్విత చరణంగా చెప్పకుండా ఒక మాట చెప్పాలి. నిజానికి ఆయన సమైక్యవాది. నాకు ఇంకా గుర్తుంది. 1969 ఉద్యమంలో మేము తెలంగాణా ఉద్యమంలో ఉన్నాం. ఒక రోజు నేను ఆయన మీద కోడిగుడ్లు విసిరానని మనవి చేస్తున్నాను. ఆ రోజు ఆ విధంగా కోడిగుడ్లు విసిరేనని గుర్తుకు తెచ్చుకుంటే నేను ఎంత పాపం చేశానని ఈరోజు బాధ పడుతున్నాను. ఎంతకంటే ఆయన ఎంతటి మహనీయుడు! ఎంత గొప్ప వ్యక్తి! ఏదో తెలిసీతెలియని వయసులో విద్యార్థి నాయకుడిగా ఉండి అలా వ్యవహరించినందుకు బాధ కలుగుతుంది నాకు. ఆయన సంఘ సంస్కరణల మీద విశ్వాసం ఉన్న వ్యక్తి.

సామ్య వాది. పెత్తందారుల విధానం గురించి ఎంతో ఆలోచించాడు. 3 సంవత్సరాల తెలంగాణా ప్రస్థానంలో ఒక్క సారి కూడా దానిని ఖండించి మాట్లాడినట్లు గుర్తు లేదు. నేననుకుంటాను, బహుశా రాజశేఖరె రెడ్డి గారు ముఖ్యమంత్రి అవుతారని ఆయన అనుకోలేదేమో. అనుకుని వుంటే అనుకూలంగా మాట్లాడి వుండేవారేమో. రాజశేఖర రెడ్డి గారు 15 సంవత్సల క్రితమే ముఖ్యమంత్రి అయి వుంటే ఈ విధంగా అసమానతలు ఏర్పడేవి కావు. ఈ పోరబాటు చేసే అవకాశం వచ్చేది కాదు. చాలా ఆలస్యం అయిపోయింది కాబట్టే ప్రస్తుతం తెలంగాణా కొరకు మేము ఉద్యమించాము. పి.వి. నరసింహారావు గారు మాకు వ్యతిరేకం కానే కాదని మరొకసారి మనవి చేసుకుంటూ, వారికి నిజమైన నివాళులు అర్పించుకోవాలంటే, వారి అభ్యుదయ భావాలను పుణికి పుచ్చుకుని వారి బాటలో నడుచుకోవాలని మనవి చేస్తూ , మరొకసారి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ పులి వీరన్న(మహబూబ్‌నగర్) : అధ్యక్షా, పెద్దలు ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన పి.వి. నరసింహారావు గారి సంతాప తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తూ మనవి చేసేది, పి.వి. నరసింహారావు గారు చాలా గొప్ప వ్యక్తి. వారు గొప్ప రాజకీయ వాది. మానవతావాది. లౌకిక వాది. సంఘ సంస్కర్త. అభ్యుదయవాదికి ఎన్ని గుణాలుండాలో అన్ని గుణాలూ ఉన్న వ్యక్తి. అట్టడుగున ఉన్న ప్రజానీకానికి ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించాలని ధ్యేయంగా పెట్టుకున్న వ్యక్తి. ఎంత గొప్ప లౌకిక వాది అంటే, అహర్నిశలూ అన్ని మతాల సామరస్యం కాపాడటానికి, అందరూ సుఖ శాంతులతో ఉండాలన్న ఆలోచన పెట్టుకుని అట్టడుగున ఉన్నవారికి ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పిస్తే, అసమానతలు సమసిపోతాయనే భావన కలిగిన వ్యక్తి. అందుకే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా దానిని అమలు చేసే పద్ధతులలో పి.వి. నరసింహారావు గారు నడవటం జరిగింది. ఉదాహరణకు 1972లో ఆయన ముఖ్యమంత్రి గా ఉన్నపుడు అతనికి అవకాశం దొరికినపుడల్లా భూసంస్కరణలతో బాటు అంతకన్న ముందే కాంగ్రెసు పార్టీలో టికెట్లు ఇచ్చినపుడు ఆయన నాయకత్వంలో అత్యంత బలహీన వర్గాలకు భాగస్వామ్యం కల్పిస్తూ టికెట్లు ఇవ్వడం జరిగింది.

అతని యొక్క లౌకిక తత్వానికి మచ్చుగా ఒక మాట. తిరుపతి వంటి హిందూ పుణ్య స్థలంలో అక్కడ ఒక క్రిస్టియన్ వ్యక్తికి కాంగ్రెసు పార్టీ టికెట్ ఇవ్వడంతో బాటు గెలిపించడానికి గొప్ప ప్రయత్నం చేసిన వ్యక్తి. సర్వమత సమానత్వం కాపాడటానికి అంత గొప్ప ఆలోచన చేసిన వ్యక్తి. అందువల్ల ఆయనను మరువడానికి వీలు లేదు. అతని యొక్క కార్యక్రమాలు ఏమిటంటే, బీద వర్గాల వారి గురించి ఆలోచించేవాడు. అతడు ప్రధానమంత్రి అయినాక ఈ బీద వర్గాల కొరకు గ్రామ స్థాయిలో అన్ని రకాలుగా ఆర్థిక పరిపుష్టి చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వపరంగా గ్రామాలలో ఉండే సమస్యలను తీర్చడానికి గ్రామీణాభివృద్ధి కింద ఆయన రూ.6 వేల కోట్లున్న బడ్జెటును దాదాపు రూ.30 వేల కోట్ల వరకూ, ఆ తర్వాత రూ.60 వేల కోట్ల వరకూ పెంచడం జరిగింది. ఆయన ఆలోచనకు ఇది అద్దం పట్టినట్లు కనిపిస్తుంది. అటువంటి వ్యక్తిని కోల్పోవడం భారతదేశానికి దురదృష్టకరమైన విషయం.

ఆయన ప్రత్యేకంగా మన రాష్ట్రానికి చెందిన వాడు. తెలుగువాడు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవడం మనం ఒక డ్యూటీగా పెట్టుకోవాలని, అంతటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరమని చెబుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు అన్ని రకాల ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జె. రత్నాకర రావు(బుగ్గారం) : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, అధ్యక్షా, పి.వి. నరసింహా రావు గారు మా జిల్లాలో పుట్టి పెరిగిన వారు. వారితో మాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నేను వయసులో చిన్నవాడిని అయినప్పటికీ వారితో మంచి సన్నిహిత సంబంధాలున్న వ్యక్తులలో నేను ఒకడిని. ప్రత్యేకంగా, మా కరీంనగరు జిల్లాకు ఇద్దరు నాయకులు. వారు చొక్కారావు గారు, పి.వి. నరసింహారావు గారు. ఇద్దరి మధ్యన మాకుండే ఇబ్బందుల వల్ల నేను రాజకీయంగా పి.వి. నరసింహారావు గారి వెంటనే ఉండే వాడిని. అప్పుడున్న సమస్యలలో ముఖ్యంగా కరీంనగరులో పి.జి. సెంటరు గాని, రైల్వే లైను గాని, వరద కాల్వ గాని వారి హయాంలో జరిగినవని మరచిపోలేము. వారింత త్వరగా చనిపోతారని నేను

ఊహించలేదు. నేను ఎక్కువగా ఆశించాను. బహుశా వారు బ్రతికి ఉంటే రాష్ట్రపతి అవుతారని ఆశించిన వ్యక్తులలో నేను ఒకడిని. వారు ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానమంత్రిగా ఉన్నా నాకు వారు మంచి పరిచయం ఉన్న వ్యక్తే. కరీంనగరు జిల్లా పరిషత్తు ఎన్నికల తర్వాత మేము కలిసిపోయాం . ఆయన ప్రధానమంత్రిగా ఉన్నా ఆ చనువు ఉంది. నాకు జ్ఞాపకం ఉంది. వారు ప్రధానమంత్రిగా ఉన్నపుడు వారి స్వగ్రామం వంగర వచ్చినపుడు కింద చాపలేసి సహపంక్తి భోజనం పెట్టారు. మమ్మల్నందరినీ దగ్గరగా కూర్చోబెట్టుకుని అప్యాయంగా మాట్లాడేరు. హెలికాప్టర్ ఎక్కేటప్పుడు నేను చిన్న చిట్టీ ఇస్తే, 'రత్నాకరరావూ, నన్నేమనుకుంటున్నామయ్యా? ఈ చిట్టీ ఏంటయ్యా, రిప్రజెంటేషను లేదా?' అన్నారు. బీడీ కార్మికులకు, పేద బలహీన వర్గాల వారి ఇళ్ల విషయమని, చాలా రోజుల నుంచి పెండింగు ఉందని, అంటే వారు జ్ఞాపకం పెట్టుకుని, తర్వాత 2200 ఇళ్లను నా నియోజక వర్గంలో శాంక్షను చేశారు. వారెప్పుడూ మరచిపోలేని వ్యక్తి. నాకు చాలా దగ్గర సంబంధం ఉన్న వ్యక్తి. వారిని కోల్పోవడం వల్ల అందరికన్నా కరీంనగరు జిల్లాకు ఎక్కువ నష్టం కలిగిందని మనవి చేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి(వాయల్పాడు) : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుతూ పి.వి. నరసింహారావు గారి గురించి చెప్పాలంటే, ఈ రోజు వారు మన మధ్య లేకపోయినా మా కుటుంబానికి వారు అత్యంత సన్నిహితులు వారు. మా తండ్రి గారు అమరనాథరెడ్డి గారితో చాలా సార్లు తిరుపతి వచ్చినపుడు, ఇక్కడ కలిసేవాడిని. అదే కాకుండా ఢిల్లీలో మా తండ్రి గారి ఆరోగ్యం క్షీణించినపుడు వారు హ్యూమన్ రిసోర్సెస్ మంత్రిగా ఉంటూ, ఈ హాస్పిటల్ నా పర్వ్యూలోకి వస్తుందని, తీసుకుపోయి దానిలో అడ్మిట్ చేయడం జరిగింది.

ఉ 10 .50

దురదృష్టవశాత్తు అక్కడే చనిపోయారు . బాడీని తీసుకుని వస్తుంటే వెంట ఎయిర్‌పోర్టుకు రావడమే కాకుండా విమానంలో పెట్టేవరకు వుండి , స్పెషల్ ఫ్లైట్ తీసుకుని, ఫ్యునరల్‌కు మా గ్రామానికి రావడం జరిగింది . అదే విధంగా వారు ప్రధానమంత్రి కావడానికి నాలుగయిదు మాసాల ముందు ఆరోగ్యం బాగాలేకపోతే , 15రోజులు ఢిల్లీలో ప్రతిరోజూ కలుస్తూ ఉండేవాడిని . ప్రధానమంత్రి కాకముందు ఆపరేషన్ చేసుకుని తిరుమల వచ్చి 4 రోజులు ఉండడం జరిగింది . ఆయనతో మాట్లాడిన ప్రతి నిముషం ఒక ఎడ్యుకేషన్ . ప్రాక్టికల్‌గా 100 పుస్తకాలు చదివితే వచ్చే నాలెడ్జి అర్థగంట ఆయనతో మాట్లాడితే వచ్చే అంత నాలెడ్జి వారికి ఉంది . వారితో అంత దగ్గరగా సంబంధాలుకలిగి వుండడం, వారు నాకు అంత దగ్గరగా తెలిసి ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను . ఆయన చెప్పిన మాటలుగానీ, చేసినవి జీవితాంతం మర్చిపోము . ఆయన మరణం పట్ల వారి కుటుంబానికి సంతాపం తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను .

శ్రీ కె రాంభూపాల్ రెడ్డి(పాణ్యం): అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ,స్వర్గీయ శ్రీ పివి పివి నరసింహా రావుగారి గురించి ఎక్కువగా చెప్పాల్సిన అవసరం లేదు . మాట్లాడిన పెద్దలంతా పివి నరసింహా రావుగారి గురించి చెప్పడం జరిగింది . పివి నరసింహారావుగారితో దగ్గరి సంబంధాలు ఉండే వ్యక్తిగా ఇక్కడ కొన్ని విషయాలు చెప్పదలచుకున్నాను . వారు నంద్యాల పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేయడం జరిగింది . పోటీ చేసి గెలిచిన తరువాత మొత్తం ప్రజలకు కృతజ్ఞతలు చెప్పడానికి నంద్యాల వచ్చారు . అప్పుడు బనగాన పల్లెలో కూడా మీటింగ్ ఏర్పాటుచేయడం జరిగింది . కాని ఎస్‌పిజి వాళ్లు బనగానపల్లెలో హెలికాప్టర్ దిగడానికి వీలులేదని బనగానపల్లెలో మీటింగ్ క్యాన్సిల్ చేయడం జరిగింది . కాని నేను పివి నరసింహా రావుగారితో బనగానపల్లెలో ఖచ్చితంగా మీటింగ్ పెట్టాలని రాజేశ్వర రావుగారిని అడిగితే, వారు పివి నరసింహా రావుగారితో మాట్లాడి రాంభూపాల్ నియోజకవర్గంలో మీటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పడం, నంద్యాల నుండి హెలికాప్టర్లో రావడానికి వీలులేకపోవడంతో కార్లో బనగానపల్లె వచ్చి అక్కడ మీటింగ్ జరపడం జరిగింది . పివి నరసింహా రావుగారి దగ్గరకు ఎప్పుడు వెళ్లినా, నియోజక అభివృద్ధికి ఏమి చేయాలనేది మమ్మల్లను అడిగి తెలుసుకొని చేయడం జరిగేది . ఢిల్లీ వెళ్లినపుడు, ఇంటర్వ్యూ అడిగితే, ఆయన దగ్గర ఒఎస్‌డిగా ఉండే కృష్ణమూర్తిగారు అందరికీ కలిపి

ఇంటర్వ్యూ ఇచ్చారు . పివి నరసింహా రావుగారు మాట్లాడుతూ, రాంభూపాల్ రెడ్డికి అందరితో కలిపి ఎందుకు ఇంటర్వ్యూ ఇచ్చారని అంటూ, నంద్యాల నుండి పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఎవరు వచ్చినా సెపరేట్‌గా ఇంటర్వ్యూ ఇవ్వాలని చెప్పడం జరిగింది . వారు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గాన్ని కూడా ఎంతో అభివృద్ధి చేయడం జరిగింది . ఈ రోజు నేషనల్ హైవే 18 వారి పుణ్యం వలన రావడం జరిగింది . బ్రాడ్‌గేజ్ రైల్వేలైను ఆయన ప్రధానమంత్రిగా వున్నపుడు ఈ ఏరియా అన్ని ప్రాంతాలతో సంధానం జరిగే విధంగా ఏర్పాటుచేయాలని కోరితే ఆ ప్రాంతంలో వున్న మైనింగ్ మెటీరియల్ అన్ని ప్రాంతాలకు రవాణా చేసే విధంగా బ్రాడ్‌గేజ్ ఏర్పాటుచేయడం జరిగింది . అక్కడ షుగర్ ఫ్యాక్టరీ మూతపడితే, ఆ ప్రాంత రైతులకు ప్రయోజనంగా వారు ప్రధానమంత్రిగా వున్నంత కాలం ఆ ఫ్యాక్టరీని నడపడం జరిగింది . ఆ ప్రాంతంలో త్రాగడానికి నీరు లేని పరిస్థితిలో నంద్యాల వాటర్ స్కీం ఏర్పాటుచేసి కర్నూలు జిల్లాలో ఉండే అన్ని గ్రామాలకు నంద్యాల వాటర్ స్కీమును ఇంప్లిమెంట్ చేస్తూ, రు . 100 కోట్లు ఇచ్చిన ఘనత శ్రీ పి వి నరసింహా రావుగారిది . స్త్రీలకు డ్వాక్రా పథకం ఏర్పాటుచేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఎన్నో పథకాలు అందులో పెట్టారు .

మీద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను . కేవలం శ్రీ పివి నరసింహా రావుగారి మీద కోర్టులో కేసు వచ్చిందనే ఉద్దేశ్యంతో 8వ తరగతిలో పివి నరసింహారావుగారి మీద ఉన్న పాఠ్యాంశం ఇంతకు ముందున్న మాజీ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారు తీసివేయడం జరిగింది .రాష్ట్రం గర్వించదగిన వ్యక్తి, నాయకుడు, తెలుగువాడు, దేశ ప్రధానిగా వున్న వ్యక్తి జీవిత విశేషాలు పాఠ్యాంశాలలో తిరిగి చేర్చాలని మన ముఖ్యమంత్రిగారిని కోరుకుంటూ, అటువంటి వ్యక్తి, గొప్ప రాజనీతిజ్ఞుడు, రాజకీయాలలో ఏ విధంగా రాణించారు అనేది పిల్లలు తెలుసుకునే విధంగా చేయాలని కోరుతున్నాను . రాజకీయాలలో ఒకటి మాత్రం బాధాకరం . ఎవరయితే రాజకీయాలలో ఆయన ద్వారా లబ్ధి పొందారో ఆయన పదవి పోయిన తరువాత అందరూ ఆయనను విమర్శించినవారే కావడం జరిగింది . ఎంత మంచి ప్రజాసేవ చేసినా , చివరకు ఏ రోజు కూడా పేపర్లో ఆయనను విమర్శించుతూ వచ్చే మాటలకు ఆయన ఏనాడూ ప్రతి విమర్శ చేయలేదు . ఎవరు ఏమి చెప్పినా, మౌనంగా మౌనంగా వింటూ ఆయన ఏమి చేయాలనుకుంటే అదే చేసేవారు . మౌనంతోనే ఆయన ప్రధానమంత్రి పదవి సమర్థంగా నిర్వహించారు . వారు ఎక్కువ మాట్లాడకుండా, చేతల ద్వారానే రాజకీయాలలో రాణించడం జరిగింది కాబట్టి అటువంటి వ్యక్తి గురించి మాట్లాడే అవకాశం వచ్చినందుకు గర్వపడుతున్నాను . అటువంటి నాయకుడు శ్రీ పి వి నరసింహా రావుగారి ఆత్మకు శాంతి చేకూరాలని , వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చిన తమకు హృదయాపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను .

•శ్రీ గాదె వెంకట రెడ్డి(బాపట్ల): అధ్యక్షా, మాజీ ప్రధానమంత్రి శ్రీ పి వి నరసింహా రావుగారి మరణంపై ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, ముఖ్యంగా వారికి నాకు ఉన్న పరిచయాన్ని జ్ఞాపకం చేసుకుంటే, 1967 లో నేను శాసనసభ్యునిగా ఉన్నాను . బహుశా అందరికంటే చిన్నవాడిని కూడా . అప్పుడు బివి సుబ్బారెడ్డిగారు స్పీకర్‌గా వుంటే, నేను ప్యానల్ ఆఫ్ ఛైర్మన్‌గా వున్నాను . అప్పుడు ఠాకూర్ హరిప్రసాద్ గారిపై లాటరీలకు సంబంధించి ఆ విధానంలో ఏదో తప్పు జరిగిందని ఎలిగేషన్స్ లేవనెత్తారు . ఆన్‌ది స్పాట్ Keeping in view the allegations made by all the Members of the House I direct the concerned Minister to appoint enquiry commission against him. That I did it. చేసినందువలన ప్రభుత్వానికి ఇరకాటం కావచ్చు . బయటకు వచ్చిన తరువాత

ఉ.11.00

Mr. Reddy I appreciate your spirit. I never expected that you would issue directions. You keep up this respect. అని నన్ను బాగా మెచ్చుకున్న, సమర్థించిన వ్యక్తి ఆయన. బ్రహ్మానందరెడ్డిగారు రాజీనామా చేసారు.

• An Astirisk before the name indicates conirmation by the Member.

తరువాత ఎవరు ముఖ్యమంత్రి కావాలనే సమస్య వచ్చింది. లక్కిరెడ్డిపల్లి రాజగోపాల్ గారని, మాజీ శాసన సభ్యుడు (ఉర్దూహాల్ దగ్గర) పి.వి. గారి ఇంట్లో వుండేవారు. నేనూ, రాజగోపాల్ గారు, నరసింహారావు గారితో, ఎందుకు వచ్చిందో నా నోటి నుంచి నాకే తెలియదు కాని, '' అయ్యా, నరసింహారావు గారూ, ముఖ్యమంత్రిగా మీరు ఎందుకు ప్రయత్నించకూడదని '' అన్నాను. '' నేను ఎట్లా అవుతాను, నాకెవరు ఇస్తారు '' అనే ప్రశ్నను వేశారు ఆయన. నాకు ఎందుకు కలిగిందో ఆ అభిప్రాయం, నాకే తెలియదు. మీరు ఇంటెగ్రేషనిస్ట్ నెం. 1. That is number one qualification for you. You are in Brahmananda Reddy Cabinet, who is an integrationist. అది రెండవ క్వాలిఫికేషన్. ఇక మూడోది You are loyal to the core to Madam Smt. Indira Gandhi. అందులో సంస్కరణ వాది, సౌమ్యవాది, సోషలిజమ్ మీద నమ్మకం వున్న వ్యక్తి, మీకు అవకాశం ఎందుకు వుండదు మీరు ప్రయత్నిస్తే తప్పకుండా మీకు వస్తుందని మేము చెప్పాము.

వెంటనే ఆయన బ్రహ్మానందరెడ్డి గారి దగ్గరకు వెళ్లి నాకు సహాయం చేసి పెట్టమని కోరడం జరిగింది. అసలు ఎవరూ కూడా పి.వి.నరసింహారావు గారు ముఖ్యమంత్రి అవుతారని అనుకోలేదు, ఎవరికీ ఆ అభిప్రాయం కూడా లేదు. చాలా పేర్లు వినపడుతూ వుండేవి. అయినప్పటికీ ఆనాడు నేను ' యంగ్ లిజిస్లేటర్స్ ఫోరమ్ ' చైర్మన్‌గా వున్నాను. అప్పుడు మీటింగ్ కాల్‌ఫర్ చేసాను. అప్పుడు జైపాల్‌రెడ్డిగారు కూడా He has become one of the Members of the Legislative Assembly. He was the youngest at that time. ఆనాడు సంజీవయ్యగారు సి.ఎం. అవుతారు, జలగం వెంగళరావు గారు డిప్యూటి సి.ఎం. అవుతారు అనే ప్రచారం జరిగింది.

మేము ఎందుకు అన్నామో మాకే తెలియదు కాని Telangana man should be the Chief Minister of the State. అని యంగ్ లెజిస్లేటర్స్ ఫోరమ్ తరపున ఒక రిజల్యూషన్ పాస్ చేసాము. దానిని జైపాల్ రెడ్డిగారే మూవ్ చేసారు. అదృష్టవశాత్తు కాని, దురదృష్టవశాత్తు కాని, ఆంధ్రులకు గర్వకారణమైన వ్యక్తి, ముద్దుబిడ్డ అయిన వ్యక్తి, ఆగస్టు 19, 1971 నాడు హిందూ పేపర్లో వచ్చింది P.V is the likely choice to the Chief Minister of the State. మా తీర్మానంలో వచ్చినందువల్ల ఆయన సి.ఎం . అయ్యాడని కాదు కాని, The incident that took place on that day I am narrating. ఆ విధంగా వారితో మాకు అనుబంధం ఏర్పడింది.

వారు నన్ను చాలా ఆప్యాయంగా పిలిచేవారు. దురదృష్టం ఏమిటంటే, 24 మంది సిటింగ్ ఎం.ఎల్.ఎ.లతో పి.సి.సి. యునానిమస్‌గా రికమండ్ చేస్తూ రిజల్యూషన్ పాస్ చేసింది. నా దురదృష్టం ఏమిటంటే, ఆనాడున్న రాజకీయ పరిస్థితుల వల్ల, 1972లో మాకున్న హయ్యస్ట్ ఫోరమ్ నాకు టికెట్ లేకుండా చేసింది. ఎందుకంటే I am the strong supporter of P.V. Narasimha Rao అన్నారు. He has taken so much interest in me. బి.వి.సుబ్బారెడ్డి గారు స్పీకర్‌గా వున్నపుడు, ఆయన లెటర్‌హెడ్ తెప్పించి పి.వి. గారు స్వయంగా వ్రాసారు. అప్పుడు ప్రధానమంత్రి గారు ఎయిర్‌పోర్ట్‌లో కూర్చుని వున్నారు. వెంకటరెడ్డికి అన్యాయం జరిగిందని లెటర్ వ్రాసి ఇందిరా గాంధీ గారికి ఇచ్చారు. ఆ రాత్రికి రాత్రే Gade Venkata Reddy selected for Ongole Constituency and not for Parchur అని చెప్పడం జరిగింది.

ఎందుకు చెబుతున్నానంటే, అది జీవితంలో మరచిపోలేని సంఘటన. ఆ విధంగా ఆయన నాకు సహాయం చేసారు. తరువాత ఓడిపోయాను. మళ్లీ బై ఎలక్షన్ వచ్చింది. రాజకీయాలలో ఎవరో ఒక గాడ్ ఫాదర్ వుండాలి, నాకెవరూ లేరు. మొగమాటం లేకుండా మాట్లాడతాను కాబట్టి ఎప్పటికైనా ప్రమాదమైన మనిషిననే అభిప్రాయం ఆనాడు కూడా చాలా మందిలో వుండేది. అందుకని ఎవరికి టికెట్ ఇవ్వాలనే సంధిగ్దం వచ్చినపుడు, ఆయన ప్రధాన మంత్రిగా వుండి, వెంకటరెడ్డికి ఇవ్వాలని అన్నారు. ఆయన నాతో అన్నారు, '' నీకు సపోర్ట్ చేసేవాడు లేడు, అందుకని నీ తరపున నేను మాట్లాడాను, ఈ విధంగా

జరిగిందని '' చెప్పారు. ఆ ఎన్నికలలో నేను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచాను. అది కూడా జీవితంలో మరచిపోలేని సంఘటన. Venkata Reddy now you have become MLA. I am very, very happy in my life. That is what he said.

మొన్న కూడా లాస్ట్ టైమ్ అసెంబ్లీకి వచ్చినపుడు కూడా మాట్లాడినారు. మన స్పీకర్ గారున్నారు కూడా. ఆ రోజున జరిగిన సంభాషణను నేను చెప్పదలచుకోలేదు. అది మా ఇద్దరికీ తెలిసిన విషయం కాబట్టి నేను చెప్పదలచుకోలేదు. ఆ తరువాత ఢిల్లీలో కూడా వారిని వారి ఆఖరి రోజులలో కలిసాను. దేశం ఏ విధంగా వుండాలి, ఏ విధంగా బాగు పడాలి అనే పద్ధతిలో మాట్లాడిన వ్యక్తి కాని, సంకుచిత మైన మాటలు చెప్పి, నువ్వు వారిని సపోర్ట్ చెయ్యి, వీరిని సపోర్ట్ చెయ్యి, వారు మంచి వారు, వీరు ఇటువంటి వారు అని చెప్పిన వ్యక్తి కాదు ఆయన.

కాంగ్రెస్ పార్టీకి హస్తం సింబల్ రావడానికి కారకులు పి.వి.నరసింహారావు గారు అనే విషయాన్ని కూడా మనం జ్ఞాపకం చేసుకోవాలి. He was the man who proposed the symbol of 'Hand' for the Indian National Congress Party. చరిత్రను ఎప్పుడూ మరచిపోకూడదు. తరువాత ఇంకొక విషయం ఏమిటంటే, సమాజంలో బలహీనవర్గాల వారు, దళితులు, గిరిజనులు ఎక్కువ సంఖ్యలో వున్నారు, అగ్రవర్ణాల వారు చాలా తక్కువగా వున్నారు, వారి ప్రేమ, అభిమానం సంపాదించుకుని రాజ్యం ఏలాలి అనుకునే మనస్తత్వం ఆయనది. సామాజిక న్యాయం జరగాలనుకునే మనస్తత్వం కలిగిన వ్యక్తి ఆయన. దానికి నిదర్శనం, 1972లో జరిగిన ఎన్నికలలో 36 మంది మహిళలు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. అంతేకాదు, నూటికి 60 మంది బలహీన, పేద, దళిత, గిరిజన వర్గాల నుంచి శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఆనాడు అప్పటికే ఇందిరాగాంధీ గాలి వచ్చేసింది, అది వేరే విషయం. సిద్ధాంత పరంగా ఆయనకు వున్న అభిప్రాయాన్ని గురించి నేను చెబుతున్నాను. ఏ పార్టీ అయినా, ఒక రాజకీయ పార్టీ అయినపుడు సామాజిక న్యాయం వుండాలి. జనాభాలో ఎక్కువ సంఖ్యలో వుండే బలహీన వర్గాల వారికి న్యాయం జరగాలని కోరుకున్న వ్యక్తి ఆయన.

ఇంకొకటి, మన రాష్ట్రానికి సంబంధించిన విషయం, ఆల్‌మట్టి డ్యామ్ విషయం. ఒకసారి చంద్రబాబు నాయుడు గారికి కూడా జరిగిన విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాను. కర్ణాటక రాష్ట్రం ఆల్‌మట్టి డ్యామ్ కట్టేటపుడు, మొట్టమొదట అప్పర్ కృష్ణకు సంబంధించి 10 లక్షల ఎకరాలు సాగులోకి తెచ్చేందుకు ప్లానింగ్ కమిషన్‌ను పర్మిషన్ అడగడం జరిగింది. వారి ఉద్దేశ్యం ఏమిటంటే, అప్పర్ కృష్ణ డ్యామ్ పేరుతో, 20 లక్షల ఎకరాలను కర్ణాటక రాష్ట్రం సాగులోకి తేవడానికి సంకల్పించడం జరిగింది. Proposals have been sent to Government of India in April, 1966. అప్పుడు ఆయన దృష్టికి వచ్చింది. He got rejected. ఆ తరువాత దేవెగౌడ గారు వచ్చారు, ఆయన జూలై 3, 4 న క్రస్ట్ గేట్లకు పర్మిషన్ ఇచ్చారు. దేవెగౌడ ప్రధాన మంత్రి కాకుండా వుండి వుంటే, పి.వి.గారు కంటిన్యూ అయి వుంటే, క్రస్ట్ గేట్లకు పర్మిషన్ వచ్చి వుండేదే కాదు.

తరువాత కోర్టుకు వెళ్లాము, ఫైట్ చేసాము. ఎవరు తప్పు చేసారు, ఎవరు ఒప్పు చేసారు అనేది క్వశ్చన్ కాదు. ఆల్‌మట్టి డ్యామ్ ద్వారా 20 లక్షల ఎకరాలను కర్నాటక రాష్ట్రం సాగు చేసే అవకాశం లేకుండా చేసిన విషయాన్ని అందరికీ మరొకసారి గుర్తు చేస్తున్నాను. ఏది ఏమైనా చరిత్రలో మరచిపోలేని వ్యక్తి పి.వి.నరసింహారావు గారు. ఆయన ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలు తీసుకొచ్చారు, అనేక పద్ధతులను ప్రవేశపెట్టారు. లాస్ట్‌లో ఒక మాట చెప్పారు. Liberalization is not for exploitation of the poor. లిబరలైజేషన్ వల్ల దేశ సంపద పెరగాలి, బలహీన, పేద వవర్గాల వారికి ఉపయోగపడాలి అనే సిద్ధాంతం ఆయనది. సంస్కరణల పేరుతో ప్రైవెటైజేషన్‌ను ప్రవేశపెట్టి, పెద్ద వారిని మరింత పెద్ద వారిని చేయడం, పేద వారిని మరింత పేద వారిని చేయడం అనే పద్ధతి ఆయనది కాదని, ఆ విధంగా సంస్కరణలు చేసిన వ్యక్తి ఆయన కాదని మరొక్కసారి నేను మనవి చేస్తున్నాను.

ఆయన మరణం వల్ల ఆంధ్ర రాష్ట్రం, భారత దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని మనవి చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలుగజేయమని భగవంతుని ప్రార్ధిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER: While associating myself with the sentiments expressed by the Hon'ble Members I would like to add a few lines.

Sri P.V. Narasimha Rao garu, who led the nation in its most difficult times, was born on 28th June, 1921 at Laknepalli Village in Warangal District. He played an active role in the freedom struggle under the leadership of Swami Ramanda Thirtha. The burning spirit of freedom and the love for Vandemataram song made him to move to Pune and Nagpur to continue his studies. He completed B.Sc., at Ferguson College, Pune and LL.B., at Nagpur.

He was elected for the first time to Andhra Pradesh Legislative Assembly in 1957 from Manthani Constituency of Karimnagar District. During his two decades of political career in State politics (1957-77) he served as a Minister for Law, Information, Endowments, Health and Medicine, Education and as a Chief Minister for the State from 1971 to 73.

In 1977 he entered into Parliament as a Member of Lok Sabha from Hanmkonda Constituency. Since then he was elected to Lok Sabha for six times from Hanamkonda, Ramtek (Maharastra), Nandyala and Berhampur (Orissa).

He served under the leadership of Smt. Indira Gandhi and Sri Rajiv Gandhi as a Union Minister of External Affairs, Home Affairs, Defence, Health and Family Welfare, Planning and Human Resources Development.

ఉ.11.10

Sri P.V.Narasimha Rao became Prime Minister of India in the year 1991 when the country was facing severe economic crisis and political instability. The terrorism in Punjab was at its heights.

The born reformist Sri P.V.Narasimha Rao showed his real mettle to the nation as a Prime Minister by paving the way to the economic reforms. His astute political thinking and democratic functioning has wiped out the terrorism from Punjab. India, which was in a stage of pledging gold for foreign exchange in 1991, gradually rose to the level of accruing enormous reserves. He was praised by every one as the "Father of Indian Economic Reforms."

Even during his tenure in State politics he introduced several reforms in the field of education by establishing Residential Schools for the children of downtrodden classes. His love for the dalits is unparalleled. As Chief Minister of Andhra Pradesh he implemented land reforms for the first time in he history of the State. "Open Jails", a new a concept to reform the prisoners, is another contribution of Sri P.V.Narasimha Rao to the State.

Proficiency and literary skills in eleven languages is another great worthy feature of his personality.

As a journalist, writer and novelist he made the Telugu speaking people feel proud of their language.

With his death, the Telugu land had lost one of its greatest sons who served the people and the nation for more than fifty years.

Sri P.V.Narasimha Rao died on 23.12.2004.

The question is:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri P.V.Narasimha Rao, the former Prime Minister of India and former Chief Minister of Andhra Pradsh, a rare statesman, reformist and a multi-faceted personality and conveys its deep sense of sympathy to the members of bereaved family."

(Pause)

The motion was adopted and the Condolence Motion was passed.

MR.SPEAKER: As a mark of respect to the departed soul, let us observe silence for two minutes.

(The House then observed silence nem con for two minutes)

## 2. 2004, డిసెంబరు 26వ తేదీన త్సునామి ఉపద్రవం సందర్భంగా ప్రజలకు వాటిల్లిన కష్టనష్టాల గురించి.

డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డిః " 2004 డిసెంబరు 26వ తేదీన సునామి ఉపద్రవం కారణంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులలో జరిగిన ప్రాణనష్టం పట్ల, ఆస్తినష్టం పట్ల ప్రజలకు వాటిల్లిన కష్టంపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది" తమరు అనుమతిస్తే, ఇందులో, మిగిలిన దేశాల్లో జరిగిన ప్రాణ నష్టానికి, ఆస్తి నష్టానికి మనం సంతాపాన్ని వ్యక్తపరచే విధంగా చేద్దాము.డిసెంబరు 26వ తారీఖున ఉదయం 9.30, 10 గంటల సమయంలో మొట్టమొదటగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, టైడల్ వేవ్ ఏదో కోస్టల్ డివిజన్‌లో వస్తోందని నాతో అన్నప్పుడు, నాకు నమ్మబుద్ధి కాలేదు. వర్షం, తుఫాను, మరొకటి లేదు. టైడల్ వేవ్‌అని అంటున్నారు, సరిగ్గా కనుక్కోండని చెప్పాను. ఆయన టైడల్ వేవ్ వివరాలు నాకు రావడం లేదని అన్నారు. తరువాత గంటలోపు ఎక్కడెక్కడ ఏ విధంగా వచ్చిందీ, కొంత మేరకు ప్రాణ నష్టం జరిగిట్లు ప్రాథమిక రిపోర్ట్స్ వచ్చాయని 10.30 ని.కి పూర్తిగా కన్‌ఫార్మ్ చేసుకొని చెప్పారు. అప్పటికే వెనువెంటనే ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా ప్రభుత్వం తరఫున ఆ ప్రాంతాల్లో అంటే నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించిన కలెక్టర్లందరితో మాట్లాడి అప్రమత్తంగా ఉండండని వెంటనే స్థానికంగా ఉన్న ప్రజలను తరలించే ఏర్పాటు చేసుకోండని, క్యాంప్స్ ఆర్గనైజ్ చేసుకోండనీ, వెను వెంటనే ప్రతీదీ చేసుకోండని చెప్పడం జరిగింది. క్యాంప్స్ ఆర్గనైజ్ చేసి భోజనం, మిగతావన్నీ సమకూర్చండని ప్రభుత్వాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేసాము. వారు చేయగలిగిన ప్రతీ కార్యక్రమం చేశారు. I am really thankful to the officers, who have responded very spontaneously. అసలు కొంత మంది కలెక్టర్లు ఆ సమయంలో తీర ప్రాంతాల్లో దగ్గరుండి చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్.. she was near a coastal village wherein Tsunami did affect. వెనువెంటనే కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. మధ్యాహ్నం రెండు, రెండున్నరకల్లా నేను అక్కడికి వెళ్లేసరికి ఎఫెక్టెడ్ విలేజెస్ చూసి చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించి, పలకరించడం జరిగింది. అప్పటికే అక్కడ చాలా రిలీఫ్ క్యాంప్స్ ఉన్నాయి. వారందరికి భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. పులుసు, పెరుగన్నం ఎలా ఉందనేది రుచి చూసిన తరువాత బాగా ఉందని, అక్కడి అధికారులు బాగా కష్టపడ్డారని వారిని అభినందించడం జరిగింది. మళ్లీ విషయాలు పూర్తిగా తెలుసుకొని అక్కడ టైడల్ వేవ్స్ రావుఅని తెలుసుకున్న తరువాత వారిని వారి వారి ఊళ్లకు పంపివేయడం జరిగింది. ఉట్టిపాటుగా అక్కడెక్కడో భూకంపం వస్తే, భూకంపానికి సంబంధించి ఏ.పి. సెంటర్, మలేషియా సెంటర్‌వారు ఇంత పెద్ద ఎత్తున సునామి విపత్తు వస్తుందని అనుకోలేదు. నేను వినలేదు. మన దేశానికి మొట్టమొదటిసారిగా వచ్చిన ఉప్పెన. దీనికి

సంబంధించి, మన దేశంలో ముఖ్యంగా, మన రాష్ట్రంలో ప్రాణ నష్టం చూసినట్లయితే, 105 మంది చనిపోయారు. ఆస్తి నష్టం జరిగింది. ఏది ఏమైనా క్యాంప్స్‌లో దాదాపు 33,000 మంది ఉన్నారు. వారికి సంబంధించిన కుటుంబాలకు అంటే ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ సంఘటన పునరావృత్తం కాదని, మరుసటి రోజునే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మెట్రొలాజికల్ డిపార్ట్‌మెంట్‌వారిని వెనుకకు పంపడం జరిగింది. పడవలు, వలలు చాలా మంది నష్టపోయారు. దాదాపు రు.32 కోట్ల వరకూ పడవలు, వలలు నష్టపోయారు. పడవలు, వలలు రీప్లేస్‌మెంట్ చేసే కార్యక్రమం వెంటనే మొదలు పెట్టడం జరిగింది. అంతకుముందు మామూలుగా ఫిషర్‌మెన్‌కి రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో రు.20,000కి ఇల్లు కట్టి ఇవ్వాలని అనుకున్నాము. అది ఒక్కోటి రు.40,000 చొప్పున చేసి అవసరమయితే ఈ ఫిషర్‌మెన్స్‌కి కోస్టల్ లైన్ ఎంత దూరంగా ఉంటే, అంత దూరంగా రీలొకేట్ చేసి మళ్లీ మళ్లీ ఇబ్బంది లేకుండా చేసే విధంగా పనులు చేసే కార్యక్రమాలు మొదలుపెట్టాము.

ఉ.11.20

ప్రధానమంత్రి గారు వెను వెంటనే స్పందించారు. 26.12.2004న ఉదయం సునామీ సంభవించింది. అంతకు ముందు రోజున పి.వి. నరశింహారావు గారి అంత్యక్రియలను చూసుకొని, ఉదయం 9.30ని.లకు నేను, రోశయ్య గారు, షబ్బీర్ అలీ గారు ఇతర క్యాబినెట్ సహచరులం సెక్రటేరియట్‌లో ఉన్నాము. ఉదయం 10.30ని.లకు సునామీకి సంబంధించిన సమాచారం మాకు వచ్చింది. 11 గంటల ప్రాంతంలో శ్రీమతి సోనియా గాంధీ గారు, అటు పిమ్మట ప్రధానమంత్రి గారు, యునియన్ హోం శాఖ మంత్రి గార్లు నాతో మాట్లాడారు. సునామీ బాధితులను అదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, అన్ని రకాల చర్యలు చేపట్టాలని వారు నాతో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నైతిక స్థైర్యాన్ని మేము ఎన్నటికి మర్చేపోలేమని తెలియజేస్తున్నాను. మన రాష్ట్రంలో ఎక్కువ నష్టం సంభవించనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని చెప్పారు. ప్రధాన మంత్రి బాధితులను గమనించి వారికి వంద కోట్ల రూపాయల సహాయం చేస్తామని చెప్పారు. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాలకు వెంటనే వెళ్లి బాధితులను పరామర్శించి వాచ్చాము. 'సునామి' వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి ఒక లక్షరూపాయల చొప్పున ప్రభుత్వం సహాయాన్ని ప్రకటించగా, దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం మరో లక్ష రూపాయలను ఇచ్చింది. మత్స్యకారులకు ఇళ్ల కట్టించి ఇవ్వడమే కాకుండా మోడరన్ 'బోట్లు' నెట్లు లను ఇవ్వడానికి గాను రూ.32 కోట్లు ఖర్చు అవుతుందని అనుకొంటున్నాము. దీనికి గాను మత్స్యకారులపై భారం పడకుండా ఉండాలని 50శాతం కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన సొమ్మును ఉచితంగా ఇవ్వడానికి, 25 శాతం బ్యాంకుల నుండి ఋణ సదుపాయం కల్పిస్తూ, మరో 25 శాతం, సునామి ఉపద్రవం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు వచ్చిన డొనేషన్స్ నుండి ఇవ్వడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. మత్స్యకారులకు 40వేల పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వడమే కాకుండా, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సదుపాయం వంటి కార్యక్రమాలను శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలని చూస్తున్నాము.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి రోజుల తరబడి ఉండడం వల్ల వారు ఎట్లా ఉన్నారో తెలియని పరిస్థితులు ఉంటాయి. అటువంటి వారికి మోడ్రన్ బోట్లు సప్లై చేస్తూ, వైర్‌లెస్ ఇక్విప్‌మెంట్ ఇచ్చి కమ్యునికేషన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అనుకొంటున్నాము. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లినప్పుడు ఏమైనా ఇబ్బందులు ఉంటే వారు కమ్యునికేట్ చేయడానికి, తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించబోతున్నాయని తెలిసిన వెంటనే వారిని అప్రమత్తం చేయడానికి గాను శాశ్వతంగా కమ్యునికేషన్ వ్యవస్థ ఉండే విధంగా చర్యలు తీసుకొంటున్నాము.

రాష్ట్రంలో సునామి ఉపద్రవం వల్ల 105 మంది తమ విలువైన ప్రాణాలు కోల్పోయారు. ఆ రోజు పవిత్రమైన రోజు అన్న తలంపుతో హిందూ, ముస్లీమ్‌లు, అనేక మంది పవిత్ర సముద్ర స్నానాలు చేయు నిమిత్తం కృష్ణా జిల్లాలో మంగినపూడి బీచ్‌కి వెళ్లి, సునామీ తాకిడికి గురై ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వాళ్లలో ఆడవారు, పిల్లలు, ఎక్కువ మంది ఉన్నారు. ఇళ్లు, సొమ్ము

కోల్పోయిన వారిని ఏదో విధంగా అదుకోవచ్చు, కానీ ప్రాణాలు కోల్పోయిన వారి విషయం ఆలోచిస్తుంటే చాలా బాధగా ఉంది. వీరి పిల్లలు పూర్తిగా అనాథలుగా మిగిలిపోయారు. వీరిని మంచి పాఠశాలల్లో చదివించడానికి, ఎవరైనా ముందుకు వచ్చి దత్తత తీసుకొంటే ఇవ్వడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సునామి ఉపద్రవం వల్ల మన దేశంలోనే కాకుండా, శ్రీలంక, మలేషియా, ఇండోనేషియా దేశాల్లో అపారమైన ఆస్థినష్టంతోబాటు అనేక మంది చనిపోయారు. వీరి మృతి పట్ల వారి వారి కుటుంబాలకు కూడా ప్రఘాడమైన సానుభూతిని సభ తెలియజేయాలని మిమ్మల్ని అందర్ని కోరుతూ, ఏకగ్రీవంగా ఈ తీర్మానాన్ని ఆమోదించాలని తెలియజేస్తున్నాను.

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు :–అధ్యక్షా, డిసెంబరు,26వ తేదీన వచ్చిన 'సునామి' ఉపద్రవం వల్ల ప్రపంచం మొత్తంలో 65 వేల మంది చనిపోవడం జరిగింది. కోట్లాది మంది అనేక కష్టాలకు గురైనారు. ఇంత పెద్దఎత్తున ప్రాణ నష్టం ఎన్నడూ జరగలేదు. 'సునామి' ఇండోనేషియాలోని సుమత్ర దీవిలో ప్రారంభమైంది. అక్కడ 25వేల మంది చనిపోయారు. శ్రీలంకలో 25 వేలమంది, మన దేశంలో 5వేల మంది థాయిల్యాండ్‌లో 5వేల మంది, మల్దీవుల్లో 5వేల మంది, మలేషియాలో 65 మంది, మన రాష్ట్రంలో 108మంది చనిపోవడం జరిగింది. మలేషియాలో ఉదయం 6.29 గంటలకు సునామీ సంభవించింది. ఉదయం 9 గంటలకు సముద్రం ఉప్పెనలా ఉప్పొంగడం, అది చెన్నై తీరానికి రావడం, ఇంటెన్సిటీ తగ్గినా, వేవ్స్ ఉధృతంగా వచ్చి పెద్ద ప్రమాదాన్ని సృష్టించింది. ఈ పరిణామాన్ని ఎవరూ ఊహించలేదు. ఊహకందకుండానే అంతా జరిగిపోయింది. యావత్ ప్రపంచం ఈ విషయమై స్పందించింది. తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులు పడవలు, వలలు సర్వస్వం కోల్పోయారు. నేడు జీవనోపాధిని పోగొట్టుకొని దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. మన రాష్ట్ర ప్రజలు తమిళనాడు వెళ్లడం వల్ల అక్కడ కొంత మంది చనిపోవడం జరిగింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తెలుగు వారు అండమాన్‌లో జీవనోపాధికని వెళ్లి, అక్కడ ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారు జీవనోపాధి లేక బాగా దెబ్బతిన్న పరిస్థితిలో ఉన్నారు. రాష్ట్రంలో 9 జిల్లాల్లో సునామీ భీభత్సాన్ని సృష్టించింది. వేరే ప్రాంతాల తో మన రాష్ట్రాన్ని పోలిస్తే ప్రాణనష్టం తక్కువ గా ఉన్నప్పటికీ, మత్స్యకారులు పెద్దఎత్తున ఉపాధి కోల్పోయి దెబ్బతిన్నారు. అండమాన్ లో మూడు లక్షల మంది తెలుగువారు ఉన్నారు. అందు చాలా మంది సునామి బారిన పడి చనిపోవడం జరిగింది. కొంత మంది తమిళనాడు, పాండిచ్చేరి, మాల్దీవులకు వెళ్లి నష్టపోయారని తెలియజేస్తున్నాను.

ఇటువంటి ఉపద్రవాలు సంభవిస్తున్న తరుణంలో వాటిని ముందుగానే గుర్తించేందుకు, ప్రజలను అప్రమత్తం చేయుటకు అవసరమైన కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో సునామీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అందరూ చెపుతున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు విశాఖపట్టణం అనువుగా ఉంటుందని, ప్రభుత్వం ఈ దిశలో ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

సునామీ సంభవించినప్పుడు, 13 సంవత్సరాల 'మేఘన' నడి సముద్రంలో 14 గంటల పాటు ఎంత అవస్థ పడిందో మనందరికి తెలుసు. ఆమె తండ్రి నికోబార్ ఐల్యాండ్స్‌లో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నారు. ఆ రోజు ఆ సంఘటన జరిగే ముందు ఆమె వారి కుటుంబ సభ్యులతో ఉండి ఉదయమే వేకువజామున సూర్యోదయాన్ని వీక్షించడానికి బయటకు రాగా సముద్రంలో వస్తున్న ఉప్పెనను గమనించి, దాని గురించి తన తండ్రికి వివరించింది. ఆయన ఆ అమ్మాయి చెప్పే విషయాలను జోక్‌గా తీసుకోవడం జరిగింది.

ఉ. 11.30

దాని తర్వాత 5 నిమిషాలలో నీళ్లు రావడం , అందరూ బిల్డింగ్ పైకి వెళ్లడం, తర్వాత ఒక ఉప్పెన రావడం . అందులో అందరూ కొట్టుకుపోవడం . తర్వాత ఎక్కడికక్కడ అందరూ చెల్లాచెదరవడం జరిగింది. ఆ విధంగా జరగడంలో ఆ అమ్మాయి ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 12, 13 గంటలు నీళ్లలోనే ఉండి అక్కడి నుంచి ఈదుకురావడం .

అక్కడ నుంచి రాత్రంతా ఎక్కడికి పోతున్నదో తెలియకుండా నడచి సాహసంతో బయటకు వచ్చి, బయటపడటం జరిగింది. ఇలాంటి సంఘటనలు చూస్తే చాలా బాధ కలుగుతుంది. ఆ అమ్మాయే కాదు, అనేక మంది అలాంటి బాధితులు ఉండి ఉంటారు. ఆ రోజు పగలు, రాత్రి ఈ భీభత్సంలో ఎందరు ఎంత, ఎటువంటి మానసిక క్షోభను అనుభవించారో తెలియదు. అలాంటి క్షోభకు ఎందరో గురై ఉంటారు. అందుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే అని తెలియజేసుకుంటున్నాను. అందుచేత ఆ అమ్మాయి ఇక్కడకు వచ్చిన తర్వాత ఎన్.టి.ఆర్. ట్రస్ట్ ద్వారా ఆ అమ్మాయిని భవిష్యత్తులో చదివిస్తామని మేము చెప్పడం జరిగింది . ఈ విధంగా చాలా మంది ముందుకు వచ్చి అనేక విధాలుగా సునామీ బాధితులను ఆదుకుంటున్నారు. ఇది చాలా మంచి పద్ధతి. అదే విధంగా నేను రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది, అండమాన్‌లో తెలుగు వారు చాలా మంది ఉన్నారు. అక్కడ చాలా నష్టం వచ్చింది. వారు చాలా మంది ఇక్కడకు వచ్చారు. అలాంటి వారు ఇక్కడకు వచ్చినప్పుడు వారిని సర్టిఫికేట్స్ అడుగుతున్నారు. దాని ద్వారా, అవి ఉన్నవారికే బెనిఫిట్స్ ఇస్తున్నారు. అయితే ఇక్కడి వారికి ఇస్తున్న విధంగానే అక్కడి వారి గురించి కూడా ఆలోచించవలసిందిగా కోరుతున్నాను. కొన్ని ఇళ్లు, బోట్స్ గురించి కూడా వారు చెప్పారు. ఇదివరకు ఎవరైతే బోట్స్, వలలు కలిగి ఉన్నారో వారంతా ఇప్పుడు వాటిని పూర్తిగా కోల్పోయారు. వారికి వాటిని ఇవ్వాలి. దానిని ఎన్యుమరేట్ చేసి కొంత ఆర్థిక సహాయం కూడా వారికి ఇవ్వాలి. కొంత సబ్సిడీ ఇచ్చే విషయాలను గురించి కూడా ప్రభుత్వం ఆలోచించాలి. కొన్ని కుటుంబాలలో అందరూ చనిపోయారు. కొన్ని కుటుంబాలలో ఒకరిద్దరు మిగిలారు. ఆ విధంగా ఎవరయితే చనిపోవడం జరిగిందో వారి ఆత్మలకు శాంతి కలిగేలా భగవంతుని ప్రార్థిస్తూ, ఆ చనిపోయిన వారి కుటుంబాల వారికి మరియు ఆ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ ఎమ్.ఏ. గఫూర్(కర్నూలు) : అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన తీర్మానాన్ని సి.పి.ఎమ్. పార్టీ బలపరుస్తున్నది. శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ప్రగతిని సాధించినప్పటికీ , అలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు మనం దానిని ఎదుర్కోవడంలో చాలా వెనుకబడి ఉన్నాం. కాబట్టి మనం ఈ విధమైన ఉపద్రవాలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పసిఫిక్ సముద్రంలో ఇప్పటికీ ఇటువంటి సునామీ ఉపద్రవాలు అనేకం వస్తున్నాయి. కాబట్టి అనేక దేశాలు కలిసి ఇటువంటి వాటిని ఎదుర్కునేందుకు గాను ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. గతంలో ఇలాంటివి ఎప్పుడూ మన దేశంలో సంభవించ లేదు. ఇదివరలో ఇటువంటివి వచ్చిన దేశాలు కొన్ని ఈ ప్రమాదాన్ని ఎదుర్కునేందుకు, నివారించేందుకు గాను ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాయి. మనం అటువంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంలో మన దేశం లేదు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వాలు, సునామీని నివారించేందుకు ముందుగా దానిని కనుగొనేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోకపోవడం వల్ల ఈ రోజు వేలాది మంది ప్రజానీకం మృత్యువాత పడ్డారు. సంవత్సరం ఆఖరులో సాధారణంగా యూరోప్ నుంచి , ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది పర్యాటకులు ఈ ఆసియా దేశాలలో ప్రత్యేకించి థాయిల్యాండ్, మలేషియా దేశాలలో సముద్ర ప్రాంతాలకు వస్తూ ఉంటారు. 2004 సంవత్సరం డిసెంబరు మాసంలో 26 వ తేదీన వచ్చిన సునామీ బారిన పడిన వారిలో ఇతర ప్రాంతాలైన అండమాన్ , శ్రీలంక ఇంకా ఇతర దేశాలలో చాలా మంది చనిపోయారు. ఆ వార్త వినగానే చాలా బాధ అనిపిస్తుంది. నేను కోరేదేమంటే సునామీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని , రాబోయే కాలంలో దాని వల్ల వచ్చే ప్రమాదంలో ఎక్కువ మందికి నష్టం జరగని విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. కేవలం ఆంధ్ర రాష్ట్రం వరకే కాదు . భారత దేశం ద్వీపకల్పం . అన్ని వైపులా మనకు సముద్ర తీరం ఉంది. మనం మధ్యలో ఉన్నాము. మన ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఈ ప్రాంతంలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వాలూ కలిసి సునామీ వ్యవస్థను ఒక దానిని ఏర్పాటు చేసుకుని, సముద్రంలో వచ్చే ఉపద్రవాలను ముందుగా మనకు తెలియజేసే విధంగా , మనకు తెలిసే విధంగా ఉన్న పరిజ్ఞానాన్ని కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఆ విధంగా చేయడం ఒక్కటే మనం సునామీ బారిన పడిన వారికి చేయగలిగిన , ఇవ్వగలిగిన నివాళి. చనిపోయిన వారికి సానుభూతిని తెలియజేయడం వరకే కాకుండా రాబోయే కాలంలో మళ్లీ ఇటువంటి ప్రమాదానికి ఎవరూ గురికాకుండా, మృత్యువాత పడకుండా చూడవలసిన అవసరం ఉందని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అలాగే తమిళ నాడు రాష్ట్రంలో నాగపట్నం ప్రాంతంలో చాలా మందికి నష్టం జరిగింది. ఎందుకంటే అక్కడ మతం పై గల నమ్మకాలతో ఆ సముద్ర తీర ప్రాంతానికి యాత్రికులు చాలా మంది చేరారు. కన్యాకుమారి కూడా ఒక పర్యాటక ప్రాంతం . కేవలం ఆ రాష్ట్రం వారే కాదు ఇక్కడికి వచ్చిన వారు ఉన్నారు. అలా చాలా మంది అక్కడకు వచ్చిన వారు ఈ సునామీ బారిన పడి చనిపోయారు. ఇతర ప్రాంతాలలోకూడా ఈ సునామీ బారిన పడి మృత్యువాత పడిన వారికి అందరికీ సానుభూతిని తెలియజేస్తున్నాను. సునామీబారిన పడి చనిపోయిన వ్యక్తుల కుటుంబాల వారికి తగు విధమైన సహాయక చర్యలు వెంటనే తీసుకోవడంలో మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. మనం ఒక్క మన రాష్ట్రంలోని అటువంటి వారికే కాకుండా ఇతర రాష్ట్రాలలోని, ఇతర ప్రాంతాలలో కూడా దీనివల్ల నష్టపోయిన వారికి కూడా , మన రాష్ట్ర ప్రజానీకం కూడా సహాయం చేయడంలో ముందుండాలి. నిజానికి ఈ విషయంలో ప్రత్యేకించి ప్రజలు స్పందించిన తీరు చాలా అపూర్వం . ముఖ్యంగా చిన్నారి పిల్లలనుంచి, పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ సునామీ బారిన పడిన వారికి తమ వంతు కర్తవ్యంగా అనేక విధాలుగా ధన, వస్తు సహాయం చేశారు. ఇటువంటి స్పందనను ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని సునామీలను ఆదుకోవడానికి కృషిచేయాలని కోరుతున్నాను. ముఖ్యంగా ఇందాక సముద్రతీరంలో ఉండే మత్స్యకారుల గురించి ముఖ్యమంత్రి గారు చెప్పారు. తుఫాను వచ్చినప్పుడు , ఇటువంటి సముద్ర కల్లోలాలు వచ్చినప్పుడు వారి జీవితం కల్లోలం అవుతుంది. కాబట్టి మత్స్యకారులకు సముద్రం నుంచి కాస్త దూరంగా భూమిని ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కేవలం ఇళ్లను భూమి మీదనే కాకుండా అంటే ఒక అంతస్తు గృహాన్నే కాకుండా , బహుళ అంతస్తుల భవనాలను నిర్మించాలి. ఎత్తు ప్రాంతాలలో నిర్మించి ఇవ్వాలి. ఆ విధంగా చేయడం ద్వారా ఆ ప్రాంతంలో ఈ కెరటాలు ఎంత ఎత్తు వచ్చినా వారిని రక్షించడానికి , అలాగే వారు వేటకు పోయినా, ఆ ప్రాంతంలోని వారు, వారి కుటుంబ సభ్యులు అందరూ కూడా వారిని వారు కనీసం రక్షించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఆ విధంగా ఇళ్లను బహుళ అంతస్తులు ఉండే విధంగా నిర్మించాలి. లేదా ఏదైనా ఎత్తయిన ప్రాంతంలో కట్టాలని , అలా చేయడం ద్వారా వారి కుటుంబాలను రక్షించవచ్చని. ఆ మత్స్యకారుల పిల్లలను రక్షించుకోవడానికి అవకాశం ఉంటుంది. అలాగే అంత ఎత్తున కెరటాలు రాకుండా ఉండటానికి అవకాశం ఉండే విధంగా గృహాలను నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉంది. 40 వేల గృహాలు ఇస్తామని అంటున్నారు. ఈ 40 వేల గృహాలను కేవలం సునామీ బారిన పడిన ప్రాంతంలోనే కాకుండా మొత్తం మన రాష్ట్రంలోని సముద్ర తీర ప్రాంతంలో ఉన్నటువంటి జనులందరి కోసం, ఇటువంటి గృహ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అలాగే రాబోయే ఉపద్రవాలనుండి వారందరినీ కాపాడే విధంగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాను. సునామీ బాధితులకు, సునామీ భూకంపం ద్వారా చనిపోయిన వారికి మనం సంతాపం తెలియజేయగలుగుతాం, నివాళులు అర్పించగలుగుతాం . సునామీ బారినపడి చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతున్నాను. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ షేక్ నాసర్ వలీ(విజయవాడ వెస్ట్) : అధ్యక్షా, 2004 సంవత్సరం , డిసెంబర్ 26 న జరిగిన సునామీ ఉపద్రవం పై ముఖ్యమంత్రి గారు తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సునామీ వల్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 105 మంది చనిపోయారు. చాలా మంది వికలాంగులయ్యారు. అలాగే తమిళనాడులో , కేరళలో, పాండుచ్చేరీ , అండమాన్, నికోబార్ దీవులు ఇంకా ఇతర దేశాలైన శ్రీలంకలలో కూడా అనేక వేలమంది మరణించడం జరిగింది. ఈ సునామీ అన్నది గతంలో ఎప్పుడూ వచ్చిన ప్రమాదమూ , మనకు తెలిసిన ప్రమాదం కాదు. ఇదివరకు మనం ఎవరం ఈ సునామీ ప్రమాదాన్ని చవి చూడలేదు. కాబట్టి ఇప్పుడు మనం దీనిని నివారించడానికి , దాని బారిన పడిన వారిని ఆదుకోవడానికి తగు విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

ముఖ్యంగా తమిళనాడులో నాగపట్నం , ఇతర దేవాలయాలలోకి కూడా నీరు ప్రవేశించడం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. అత్యంత నష్టం జరిగింది. మన దేశంలోనే కాకుండా , ఇండోనేషియా, శ్రీలంక దేశాలలో కూడా సునామీ వల్ల అనేక వేల మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఉంది. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి కలుగకుండా, ప్రమాదం రాకుండా

ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవడానికి, అలాగే ప్రమాదం వస్తే ఆ పరిస్థితులు ఎక్కువగా కాకుండా, తగ్గించడానికి గాను అనేక చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. సముద్ర తీరంలో, సముద్రాన్ని నమ్ముకుని జీవించే అనేకులు మత్స్యకారులు, వారి కుటుంబాలు ఉంటాయి. సునామీ మూలంగా నేడు వారెంతో నష్టపోయారు. ఇటువంటి ప్రత్యేక పరిస్థితి వచ్చినప్పుడు దానిని నివారించే విధంగా, ప్రమాదాన్ని గుర్తించే విధంగా సాంకేతిక పద్ధతుల ద్వారా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. బహుళ అంతస్తుల భవనాలను వారికై మనం నిర్మించి ఇవ్వాలి. అటువంటి ప్రమాదాలకు తట్టుకునే విధంగా వారికి మనం గృహాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఈ సందర్భంగా చనిపోయిన వారికి మా పార్టీ తరపున సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.11.40

جناب سید احمد پاشاہ قادری۔ دنیامیں سائنس وٹکنالوجی کی تیز رفتارترقی کے باوجود آج ہم آفات وسماوی کے سامنے بے بس نظر آتے ہیں- سیلاب ہو کہ طوفان زلزلے ہوں کہ قحط وخشک سالی سارے منصوبوں اورپروگراموں پر عمل آوری کے باوجود بھی کبھی کبھی ایسا محسوس ہوتا ہے کہ قدرت کو کچھ اورہی منظور ہوتا ہے سونامی بھی ایک ایسی مصیبت اور آفت سماوی ثابت ہوئی ہے کہ دیکھتے ہی دیکھتے دنیا کے کئی ممالک سونامی کے نتیجہ میں پریشان ہوگئے ہیں- انڈونیشیاء‘ ملیشیاء‘ تھائی لینڈ اورسری لنکا کے ساتھ ہی ساتھ ہمارے ملک کے کئی حصے بھی سونامی کا شکار ہوئے اور جن میں مردوخواتین اور بچے شامل ہیں۔ آناً فاناً میں ہزاروں انسان موت کے منہ میں چلے گئے جن میں مردوخواتین اور بچے شامل ہیں۔ لاکھوں لوگ آناً فاناً میں بے گھر ہوگئے۔ آبادیوں کے نام و نشان مٹ گئے ۔ یہ ایک المناک سانحہ ہے جس پر ساری انسانیت غمزدہ ہے۔ مجلس اتحادالمسلمین بھی سونامی کے شکار ہوئے خاندانوں سے اظہار تعزیت اور ہمدردی کرتی ہے اور ہر نئی آنے والی مصیبت کا سامنا کرنے کیلئے ایک حکمت عملی بنانے میں حکومت کی مدد کرتی ہے۔ اب ہمارا بھی کام ہیکہ آئندہ آنے والی سونامی کی تباہی و بربادی کے علاوہ دیگر آفات سماوی سے بچنے کیلئے سائنس وٹکنالوجی کے نئے طریقوں سے استفادہ کرنے کے بارے میں غور کریں ۔

---

శ్రీ బి.వేదవ్యాస్ (మల్లేశ్వరం): అధ్యక్షా, 200 సంవత్సరాల నుంచి తుఫానులు, ఉప్పెనలు అంటే వింటున్నాము. త్సునామి అనేది అసలు తెలియనటువంటింది. తుఫాను కూడా 2,3 రోజుల ముందు నుంచే హెచ్చిరికలు చేస్తూ రిలీఫ్ మెజర్సు తీసుకుంటాము. సునామి అరగంట లోపల ఆ అలలు రావడం, పూర్ణిమ నాడు సముద్రంలో స్నానం చేయడానికి వచ్చిన వాళ్లను అలల రూపంలో సముద్రం లోపలికి తీసుకొని వెళ్లి మళ్లీ మృతదేహాలను తీసుకొచ్చి బయట పడేయటం జరిగింది. నా నియోజకవర్గంలో మంగినపూడి బీచ్‌లో 36 మంది చనిపోవడం జరిగింది. చనిపోయిన వాళ్లలో పిల్లలు, మహిళలు, పరిగెత్తలేక చనిపోయినటువంటి వారు ఉన్నారు. ఈ ఉపద్రవం మీద ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదిక మీద చర్యలు తీసుకోవడం జరిగింది. ఆ రోజు వెంటనే ముఖ్యమంత్రిగారు వచ్చారు. ఆ మరుసటి రోజు మా జిల్లా ఇన్‌చార్జి మంత్రి జె.సి. దివాకరరెడ్డిగారు, మా జిల్లా మంత్రి పి. వెంకటేశ్వరరావు, మేము కూడా 40 కిలో మీటర్ల సముద్రం ఒడ్డును చూడడం జరిగింది. కాని ఆ క్షణంలో చనిపోయిన వ్యక్తులు, అది కాకుండా ఆ తరువాత ఈ సముద్ర అలల తాకిడికి చాలా మంది జీవితాలు అస్తవ్యస్తం అయిపోయాయి. ప్రత్యేకంగా మత్స్య కార్మికులు, మత్స్య కార్మికులతోబాటు సముద్రం ఒడ్డున జీవనం సాగించే ఇతర కులాలు కూడా చాలా మంది ఉన్నారు. వాళ్లు కూడా చాలా పెద్దఎత్తున నష్టపోయారు, జీవనోపాధి కోల్పోయారు. అట్లాగే ఈ సముద్రం అలలకి ఉప్పుటేరు లాంటి కొన్ని ప్రాంతాలలో కాలువులకు 4,5 అడుగుల ఎత్తున నీరురావడంవలన కొన్ని గ్రామాలు కూడా దెబ్బతిన్నాయి. సముద్రం ఒడ్డున వేరుశనగ, మిర్చి పంటలు వేసుకున్న రైతులు ఈ సముద్రం నీటికి పంటలు నష్టపోవడం జరిగింది. ఈ ప్రాంతాలలో ప్రత్యేకంగా సహాయ చర్యలు చేపట్టిన మున్ముందు, ,శాశ్వతంగా టెలికమ్యునికేషన్ వ్యవస్థ ఈ తీర ప్రాంతాలలో చాలా తక్కువగా వున్నది. చాలా గ్రామాల్లో ఇప్పటికి కమ్యునికేషన్, రోడ్లు, త్రాగునీటి సౌకర్యం లేనటువంటి పరిస్థితి వున్నది. ముఖ్యమంత్రిగారు సముద్రం ఒడ్డున ఉన్న వాళ్లకి 40 వేల పక్కా గృహాలు అనౌన్సు చేశారు. మత్స్య కార్మికులతోబాటు ఇతర కూలీలు సముద్ర జీవనం సాగించే వాళ్లకి కూడా సహాయం చేయాలని, అలాగే సముద్రం దగ్గర,4,5 కిలోమీటర్ల దూరంలో

ఉన్న వారికి కూడా సహాయం చేయాలని చెప్పి కోరుకుంటున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానం బలపరుస్తూ వాళ్ల కుటుంబాలకు సంతాపం తెలియచేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కె.అచ్చన్నాయుడు (హరిశ్చంద్రాపురం): అధ్యక్షా, 2004, డిసెంబరు 26వ తేదీన సంభవించిన త్సునామి ప్రపంచంలో మన దేశంలో, రాష్ట్రంలో విపరీతమైన ప్రాణ, ఆస్థి నష్టం జరిగింది. మన రాష్ట్రానికి సంబంధించి ప్రాణ నష్టం ఎక్కువ జరగనప్పటికి మన రాష్ట్రం నుంచి ఇతరప్రాంతాలకు వలసపోయి చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితి ఏర్పడింది. అందులో అండమాన్ నికోబార్ దీవుల్లో 5 లక్షల మంది జనాభా వుంటే మన తెలుగు వాళ్లు ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదవారి జిల్లాలకు చెందిన వాళ్లు ఉన్నారు. 60 వేల మంది బార్బర్సు 25 సంవత్సరాల నుంచి అండమాన్ నికోబార్ దీవులకు వలస పోయి జీవనం సాగిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ ఉప ద్రవం వల్ల 450 మంది తెలుగువారు అక్కడ ప్రాణాలు పోగొట్టుకున్నారు, 250 మంది ఇప్పటికి కూడా వారి జాడ తెలియనటువంటి పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాము, కేంద్ర ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాము. మన రాష్ట్రానికి చెందిన తెలుగు వాళ్లు అండమాన్ నికోబార్ దీవుల్లో చనిపోయారు వాళ్లకి కూడా వర్తిం చేయమని ఈ మీ ద్వారా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. ఎందుకంటే డెత్ సర్టిఫికెట్ అడుగుతున్నారు. చనిపోయిన వ్యక్తి దొరికితేనే డెత్ సర్టిఫికెటు ఇచ్చే పరిస్థితి ఏర్పడంది. ఇప్పటికే ఇది జరిగి 2,3 మాసాలు అయినది. చాలామంది జాడా తెలియనటువంటి పరిస్థితి వున్నది. కాబట్టి ఇవి అన్ని దృష్టిలోపెట్టుకొని అక్కడ ఉన్న తెలుగు వారికి కూడా ఈ కాంపెన్‌జేషన్ వర్తింపచేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. శ్రీకాకుళం జిల్లా తీర ప్రాంతం 120 కిలోమీటర్లు ఉన్నది. అండమాన్ నికోబార్‌దీవుల్లో ఇప్పటికి కూడాప్రకంపనలు వస్తున్నాయి. ప్రభుత్వం ఐడింటిటి కార్డ్సును రద్దు చేసింది. మళ్లీ వాళ్లు అక్కడికి వెళ్లడానికి ఐడింటిటి కార్డ్సు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని చెప్పి ఈ సందర్బంగా ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. అందరం కూడా దీని మీద బాగా స్పందించి మనం చక్కగా కార్యక్రమాలు చేసుకున్నప్పటికి కూడా టెక్నాలజీలోనే దేశంలోనే మనం ముందంజలో ఉన్నాము. భవిష్యత్తులో మనం టెక్నాలజీ ఏర్పాటు చేసుకొని ప్రమాదాల నుంచి తప్పించడానికి ముందుగానే విపత్తులను తెలుసుకొనే విధంగా అధునాతనమైన టెక్నాలజీ మనం ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తులో ప్రమాదాల నుంచి బయట పడడానికి అవకాశం వుంటుంది. ఈ త్సునామివల్ల ప్రాణ నష్టం ఆస్థి నష్టం జరిగింది. వారి అందరికి తెలుగుదేశం పార్టీ తరుపున ప్రగాఢమైన సానుభూతి, సంతాపాన్ని తెలియచేస్తూ వారికుటుంబాలకు భగవంతుడు శక్తియుక్తులను ఇవ్వాలనిచెప్పి కోరుకుంటు సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి.ముకుందరెడ్డి (పెద్దపల్లి):అధ్యక్షా, డిసెంబరు 26 వతేదీన సంభవించిన త్సునామి ఉపద్రవం గురించి ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన బలపరుస్తూ , డిసెంబరు 26వ తేదిన ఉదయం 6.25 నిముషములకు భూకంప తీవ్రత రెక్టెల్ స్కేల్‌పై 8.9గా నమోదు అవుతూ అలలు గంటకు 800 కిలో మీటర్ల వేగంతోటి, నీరు 50 నుంచి 100 అడుగుల ఎత్తులో ఎగిసిపడుతూ మనకు తెలియనటువంటి ఒక కొత్త ఉపద్రవం . చాలా దేశాల్లో సంభవించినది, భారతదేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో కూడా కొన్ని ప్రాంతాల్లోసంభవించిన విషయం మనందరికి తెలుసు.
ఉ.11.50

మన భారతదేశంతోపాటు ఇండోనేషియా, మలేషియా, థాయ్‌ల్యాండ్, మ్యాన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు మొదలగు దేశాలలో కూడా ఈ విపత్తు సంభవించినది. ఈ సునామీవల్ల ఒక లక్షా యాభైవేలమంది చనిపోవటమే కాకుండా లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. చాలామంది వారి వృత్తి, వ్యాపారాలతోపాటు జీవనోపాథిని కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒరిస్సా, కేరళ, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులలో సంభవించిన ఈ సునామీవల్ల చాలామంది బాధలు అనుభవించారు. ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 301

గ్రామాలు ఈ సునామివల్ల ఎఫెక్ట్ అయి 105 మంది చనిపోయారు. తెలంగాణా రాష్ట్ర సమితి పక్షాన వారందరికీ మాయొక్క తీవ్ర సానుభూతిని తెలియచేస్తున్నాను. నిరాశ్రయులైన వేలాది, లక్షలాది కుటుంబాలకు మా సానుభూతిని ప్రకటిస్తున్నాను. మత్స్యకారుల కుటుంబాలు వారియొక్క జీవనోపాధిని కోల్పోయి, ఆస్తి నష్టం జరిగి నిరాశ్రయులైన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన సమయంలో సహాయక కార్యక్రమాలు చేపట్టి వారిని ఆదుకోవటానికై ముందుకువచ్చినందుకు, ఎక్స్‌గ్రేషియా చెల్లించటం, దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మత్తులు చేయించటం, క్రొత్త గృహాలను మంజూరుచేయటం చేసినందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను అభినందిస్తున్నాను. సునామీ అనేది మనకు క్రొత్తగా అనుభవంలోకి వచ్చినది. భవిష్యత్తులో ఇటువంటి విపత్తులనుండి, ఉపద్రవాలనుండి మనను మనం కాపాడుకునేందుకై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని మీద్వారా ప్రభుత్వానికి మనవిచేస్తూ శెలవుతీసుకుంటున్నాను.

శ్రీ ఎమ్. బుద్ధప్రసాద్ (అవనిగడ్డ): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను. డిసెంబర్ 26వ తేదీన మన దేశ చరిత్రలోనే కాదు యావత్ ప్రపంచ చరిత్రలో ఒక దుర్దినం. ప్రత్యేకించి మన రాష్ట్రంలో నెల కొని ఉన్న కోస్తా తీరప్రాంతం తరచు అల్పపీడనాలకు, పెను తుఫానులకు గురౌతుంటుంది. సునామీ తూర్పు తీరాన్ని తాకటం ఇదే ప్రథమం. 26వ తేది ఉదయం మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుగారి అంత్యక్రియలు చూసుకుని 26వ తేది ఉదయం అవనిగడ్డ వెళ్లటం జరిగింది. కొంతమంది మత్స్యకారులు వారి సమస్యలు తెలుపుకోవటానికి నావద్దకువస్తే కూర్చుని వారితో మాట్లాడుతున్న సందర్భంలో ఒక విలేఖరి వచ్చి సముద్రం ఉప్పొంగుతోందని అంటున్నారు, నిజమేనా అని మమ్మల్ని అడిగారు. దానికి వారు అప్పుడే తాము సముద్రంవద్దనుండి వస్తున్నామని, అటువంటిదేమీ లేదని తెలిపారు. కాసేపటికి స్వర్లగుంట గ్రామంనుండి ఇంకొక మత్స్యకారుడువచ్చి తమ గ్రామం అంతా అల్లకల్లోలంగా ఉన్నదని అంటున్నారని అన్నాడు. ఇది నమ్మశక్యం కాలేదు. ఎందుకంటే ఏ విపత్తు వచ్చినప్పటికీ దానికి ముందు ప్రకృతిలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. ఆరోజు ఎండ బాగా ఉన్నది. ఎటువంటి మార్పులు లేవు. ఈరకంగా సముద్రం ఉప్పొంగటం ఏమిటా అని ఆశ్చర్యం, నమ్మలేని పరిస్థితి కలిగింది. అయితే ఒకటి, రెండు వార్తలు వచ్చిన తరువాత వెంటనే బయలుదేరి పాలకాయితిప్ప గ్రామంవద్దకు వెళ్లటం జరిగింది. అక్కడ కృష్ణానది సాగరసంగమం చెందుతుంది. ఇటీవల కృష్ణా పుష్కరాల సందర్భంలో సముద్రంవద్దకు వెళ్లటానికి వీలుగా అక్కడ ఒక రోడ్డు నిర్మించటం జరిగింది. నేను పావు తక్కువ పదిగంటలకల్లా అక్కడకు వెళ్లాను. సముద్రం ఉప్పొంగిరావటం నేను స్వయంగా అక్కడ ఉండి చూడటం జరిగింది. వెంటనే పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను అప్రమత్తంచేసి గ్రామప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరించి సముద్రతీర గ్రామాలన్నీ తిరగటం జరిగింది.

అదృష్టవశాత్తు మా నియోజకవర్గంలో ప్రాణనష్టం జరగలేదు. స్వర్లగుంట గ్రామానికి చెందిన మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లగా వారి పడవలు మునిగిపోయాయి. ఆ పడవలలో ఉన్న మంచినీటి డబ్బాలను పొట్టకు అడ్డంపెట్టుకుని బ్రతికిబయటపడితే వారిని వెంటనే హాస్పటల్‌లో జాయిన్‌చేయటం జరిగింది. మేము ఆయా గ్రామాలు తిరుగుతూ పూటగుండం గ్రామంవద్దకు వెళ్లేసరికి ముఖ్యమంత్రిగారు బందరు వస్తున్నట్లు రేడియోలో చెప్పారని అక్కడి గ్రామస్తులు చెప్పారు. అక్కడికి దగ్గరగా ఉన్న మేము అక్కడకు వెళ్లకముందే ముఖ్యమంత్రిగారు బయలుదేరారు. ఈ వార్త తెలిసిన వెంటనే ముఖ్యమంత్రిగారు రెండు, మూడు జిల్లాలు పర్యటించి ఆ రోజు సాయంత్రానికి బందరు రావటం జరిగింది. మేము అన్ని గ్రామాలు తిరిగి బందరు వచ్చేసరికి ముఖ్యమంత్రిగారు వచ్చి వెళ్లటం జరిగింది. అంటే ఈ విపత్తుగురించి తెలిసిన వెంటనే ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రిగారు స్పందించి స్వయంగా ఆయనే కార్యరంగంలోకి దూకటం అభినందనీయం అని మీ అందరకు తెలియచేస్తున్నాను.

ఈనాడు ప్రభుత్వం తరపున సహాయక చర్యలు చేపట్టారు. అదేవిధంగా వివిధ స్వచ్ఛంద సేవాసంస్థలు కూడా వారికి తోచిన రీతిలో ప్రజలను ఆదుకోవటానికి ప్రయత్నించటం జరిగింది. ఈ సునామివల్ల ప్రత్యేకించి మత్స్యకారుల జీవితాలు

కకావికలయ్యాయి. వారిని ఆదుకోవటానికి ఈనాడు ఎంతో పెద్దయెత్తున చర్యలు చేపట్టవలసిన అవసరం ఉన్నది. పడవలు, వలలు కోల్పోయి వారు జీవనోపాధి కోల్పోవటమేకాకుండా పూర్వంలాగా ఇప్పుడు ధైర్యంగా సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితులు వారు ఉన్నారు. ధైర్యంచేసి సముద్రంలోకి వేటకు వెళ్లినప్పటికీ చేపలు దొరకటంలేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం పడవలు, వలలు ఇవ్వటమేకాకుండా 25 కిలోల బియ్యం కూడా ఇచ్చి ఆదుకోవటం జరిగింది. తరచు తుఫానులు వస్తున్న విషయం మనందరకు తెలుసు. 1977వ సంవత్సరం నవంబరు 19వ తేదీన దివిసీమలో పెద్ద ఉప్పెన రావటం, 10,000 మంది వరకు చనిపోవటం జరిగింది. అది మన రాష్ట్ర చరిత్రలో చాలా దుర్దినం. ఆ తరువాత కూడా అనేక తుఫానులు వచ్చాయి. అయితే మనం సహాయక చర్యలమీద దృష్టి సారిస్తున్నాము తప్ప శాశ్వత నివారణా మార్గాలమీద దృష్టి సారించటంలేదు. ఇప్పటికైనా ఆలోచనచేసి శాశ్వత నివారణా చర్యలపై దృష్టి సారించాలి. ఇలాంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను రక్షించటానికి ఏమేమి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందో ఆలోచనచేయవలసిన అవసరం ఉన్నది. సమగ్రమైన అధ్యయనంతో తీరప్రాంతాల్లో శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలి. 1977 ఉప్పెన తరువాత మొట్టమొదటిసారిగా సైక్లోన్ షెల్టర్స్ నిర్మాణం చేపట్టటం జరిగింది. ఇప్పటికి 26, 27 సంవత్సరాలు అవుతున్నది. ఈనాడు ఆ షెల్టర్స్ చాలావరకు శిథిలావస్థలో ఉన్నాయి. వాటిల్లో తలదాచుకునే పరిస్థితులు లేవు. శాశ్వతంగా షెల్టర్స్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఆ షెల్టర్స్ బహుళార్థసాధకంగా ఉండాలి. మామూలు సమయాల్లో వాటిని పాఠ శాల భవనాలుగా వాడుకునేట్లు, ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు రక్షణకు ఉపయోగించుకునేలా, బహుళార్థసాధకంగా ఈ షెల్టర్స్ నిర్మాణం చేపడితే ఊరిని కాపాడుకోవటానికి అవకాశం ఉంటుంది. గతంలో నిర్మించిన షెల్టర్స్ ఆలనాపాలనా చూడకపోవటంవలన అవి శిథిలమైపోయాయి. ఆవిధంగా కాకుండా తీరప్రాంత గ్రామాల్లో పాఠశాల వసతి కల్పించటానికి, విపత్తుల సమయంలో తలదాచుకొనటానికి వీలుకల్పించేవిధంగా షెల్టర్స్ నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని మనవిచేస్తున్నాను.

అవనిగడ్డ నియోజకవర్గంలో, మా తీరప్రాంతంలో 1958వ సంవత్సరంలో అప్పటి ఉప ముఖ్యమంత్రిగారు డా. నీలం సంజీవరెడ్డిగారు చొరవ తీసుకుని సముద్రపుకట్ట నిర్మాణం చేయటం జరిగింది. ఆనాడు కేంద్రప్రభుత్వం సముద్రపు కట్ట ఏమిటని ఒప్పుకోలేదు. అప్పుడు సంజీవరెడ్డిగారే స్వయంగావచ్చి చూసి సముద్రపుకట్ట అవసరం చాలా ఉన్నదని, ఈ ప్రాంత పరిరక్షణ కోసం అది అవసరమని వారు రికమెండ్ చేయటం జరిగింది. ఆ తరువాత దానిని నిర్మించారు. 1977 ఉప్పెన సమయంలో ఈ కట్ట కొంతవరకు సముద్రపు ఉధృతిని ఆపటానికి ప్రయత్నించినది. తరువాత కాలంలో అది శిథిలమైపోయింది. తరువాత పునర్నిర్మించటం జరిగింది. ఈరోజు ఆ కట్ట పరిస్థితి చాలా దారుణంగా ఉన్నది. గత అసెంబ్లీలో కూడా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వంవారు కేంద్రప్రభుత్వానికి రూ.5 కోట్ల అంచనాతో ఒక ఎస్టిమేట్ పంపించటం జరిగింది. కాని అది మంజూరుకాలేదు. ఈనాడు ఆ సముద్రపు కట్టలను పునర్నిర్మించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈనాడు వచ్చే నిధులతో సముద్రపు కట్టలను పునర్నిర్మించి భవిష్యత్తులో ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు రక్షణ కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రత్యేకించి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను. రహదారుల నేవి ఈనాడు చాలా ముఖ్యమైనవి. ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటె రహదారులు సక్రమంగా ఉండాలి. తీరప్రాంత రహదారులన్నీ చాలా అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాయి. తీరప్రాంత గ్రామాలన్నింటినీ కలిపేవిధంగా ఒక కోస్టల్ రోడ్డు నిర్మాణం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తున్నాను.

మ.12.00

అంతే కాకుండా తరచూ విపత్తులకు గురి అవుతూ వస్తువులు, పశువులు కోల్పోతున్న తీర ప్రాంత ప్రజల పరిరక్షణ కోసం సమగ్రమైన బీమా పథకాన్ని వర్తింపచేయవలసిన అవసరముందని విజ్ఞప్తి చేస్తున్నాను. అదేవిధంగా సముద్రపు నీరు

చొచ్చుకురాకుండా అవసరమైన రోడ్లనువేయటం, సరుగుడు చెట్లను పెంచటం మొదలైన వాటి కోసం ఒక పథకాన్ని రూపొందించి సముద్ర తీర ప్రాంత ప్రజలకు ఒక రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి విపత్తులను ఎదుర్కోనటానికిఒక జాతీయ అథారిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్న విధంగా మన రాష్ట్రంలో కూడా ప్రకృతి వైపరీత్యాలను నివారణ చేయడానికి ఒక అథారిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. విపత్తుకు గురైన ప్రజలను ఆదుకోవటానికి చర్యలు తీసుకున్న ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ విపత్తులో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

*శ్రీ మహమ్మద్ ఫరీదుద్దీన్ : గత సంవత్సరం డిసెంబర్ 26న కనీవినీ ఎరుగని రీతిలో ఈ సునామీ ఎఫెక్ట్ సంభవించడం జరిగింది. సాధారణంగా చేపలు పట్టేవారు ఐల వలలు ఉపయోగించి 60 నుండి వంద మంది వరకు పాల్గొని లాగుతూ చేపలు పడుతుంటారు. ఆ రోజు ఆది వారం కావడంతో స్కూళ్లకు వెళ్లే పిల్లలు, మహిళలు కూడా ఈ వలలు లాగుతూ చేపలు పట్టడంలో పాల్గొన్నారు. ఆ రోజు వచ్చిన తాకిడికి తట్టుకోలేక మత్స్యకారులు, వారి కుటుంబాలుమొత్తం 52 మంది వరకు కూడా ప్రాణాలు కోల్పోవడం జరిగింది.ప్రభుత్వం తక్షణమే వారికి రిలీఫ్ చర్యలు చేపట్టి ఎక్స్ గ్రేషియా కూడా ఇవ్వడంజరిగింది. అదే కాకుండా ప్రతి కుటుంబానికి వంద రూపాయలు మరియు 50 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది. ఇదే కాకుండా తీర ప్రాంత గ్రామాల వారికిరు. 40 వేల యూనిట్ కాస్ట్‌తో 40 వేల ఇళ్లను కూడా మంజూరు చేయడం జరిగింది. గతంలో మెకనైజ్డు బోట్లను వినియోగించి చేపలు పట్టే వారికి నెలకు వెయ్యి లీటర్ల డీజిల్‌ను సబ్సిడీ రేట్లకు ఇచ్చే విధానానికి బదులు ఇప్పుడు లీటర్‌కు రు.5.58 పైసల చొప్పున ఒక్కో బోటుకు నెలకు మూడు వేల లీటర్ల చొప్పున ఇవ్వడానికి ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా మళ్లీ వాళ్లకు ఉపాధి కల్పించడానికి అనేక చర్యలు చేపడుతున్నది.ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులందరికీసానుభూతి తెలియజేసుకుంటూ నాకు ఈ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి హెచ్ అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, గత డిసెంబర్26న జరిగిన ఈ సునామీ సంఘటన మొత్తం ప్రపంచవ్యాప్తంగాదుఃఖసముద్రంలో ముంచెత్తింది. మన రాష్ట్రంలో సుమారు 105 మంది తమ ప్రాణాలను, ఆస్తులను కోల్పోయిన విషయం మనందరికీ తెలుసు.మన రాష్ట్రంలో ఈ ఫిషింగ్ కమ్యూనిటీ వారికి చాలా నష్టం జరిగి వారు తమ బోట్లను, వలలను కోల్పోవడం జరిగింది. వారు కోల్పోయిన వలలు, బోట్లను వాళ్లకు అందించి తిరిగి తమ జీవనోపాధిని పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల నుండి అనేక మత్స్యకార కుటుంబాలు అండమాన్ ప్రాంతాలకు వలసలు పోయారు. రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల వారికి చేపట్టిన సహాయక చర్యలను అండమాన్‌లో జీవనం పొందుతున్న వాళ్లకు కూడా అందించవలసిన అవసరముంది. సునామీ పేరు గల ఇలాంటి సంఘటనలు గతంలో మనం చూడలేదు. మనకు తుఫానులు, వరదలు వచ్చే విషయాన్ని ముందుగానే పసిగట్టే యంత్రాంగం వుంది. కాబట్టి ప్రపంచంలోని లేటెస్ట్ టెక్నాలజీని వుపయోగించుకొని ఇలాంటి విపత్తులను కూడా ముందుగా గుర్తించే ఏర్పాట్లు చేయవలసిన అవసరముంది.నీనికి ఒక ప్లాన్ తయారు చేసి వెంటనే దాన్ని ఆచరణలో పెట్టాలను కోరుతున్నాను.

అదేవిధంగా రాష్ట్రంలో ఈ సునామీ తాకిడికి గురియైన వారిని ఆదుకోవడానికి స్పందించి చాలా మంది ముందుకొస్తున్నారు. ముఖ్యంగా సినిమా రంగం నుండి సింగర్స్, నటులు ఆర్థిక సహాయం చేసి వారిని ఆదుకోవడానికి చర్యలు తీసుకోవడం జరిగింది. మా పార్టీ తరఫున కూడా ఎమ్ ఎల్ ఏ లు ఒక నెల శాలరీని ఇవ్వడం జరిగింది. ఆ విధంగా సునామీ బాధితులను ఆదుకోవడానికి సహకరించిన వారందరికి కూడా ఈ సభా ముఖంగా కృతజ్ఞతలు తెలియజేయవలసిన

* An Astirisk before the name indicates conirmation by the Member.

అవసరముందని కూడా మనవి చేస్తున్నాను. ఈ సునామీ విపత్తులో చనిపోయిన వారందరి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎమ్. వెంకట రమణా రావు (కూచినపూడి): అధ్యక్షా, గత సంవత్సరం డిసెంబర్ 26వ తేదీన సంభవించిన సునామీ ప్రమాదంలోమరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. సునామీ అన్న ముద్దుపేరుతో వచ్చి ప్రపంచంలోకనీవినీ ఎరుగని ఘోర విపత్తును సృష్టించి వేలాది మంది మత్స్యకార కుటుంబాల జీవన పరిస్థితులను అగమ్యగోచరంగా మార్చింది ఈ సునామీ విపత్తు. సహజంగా వాయుగుండాలు, తుఫానులు మొదలైన వాటిన ముందుగానే గుర్తించి అధికార యంత్రాంగం వెంటనేస్పందించి ప్రజలనుహెచ్చరించి అప్రమత్తులను చేయడం ద్వారా కొంతవరకు ప్రమాదాన్ని నివారించడం మనం చూస్తున్న విషయం. అయితే అలాంటి హెచ్చరికలు లేకుండా ఎక్కడో ఇండోనేషియాలో ఈ సునామీవిపత్తు సంభవించి సముద్రంలో భూకంపవాయువులను సృష్టించి కోస్తా ప్రాంతంలోని సముద్ర తీర ప్రాంతాలను అతలాకుతలం చేసిన సందర్భంలో మా గుంటూరు జిల్లాలో కూడా ఇది సంభవించడం జరిగింది. మా జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో సుమారు తొమ్మిదిన్నర గంటల సమయంలో ఇది సంభవించినప్పుడు నేను ఇంజనీరింగ్ అధికారులతో అక్కడున్న ఒక డ్రెయిన్ దగ్గర వున్న ఒక కల్వర్ట్‌కు సంబంధించిన పనులను పరిశీలిస్తున్న సమయంలో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌లో సముద్రపు నీరు ఉప్పొంగుతూ భూమివైపు వస్తున్న సందర్భంలో పడవలు, బోట్లు వాలుకు గురియైన దృశ్యాన్ని చూస్తున్న ప్రజలు భయభ్రాంతులకు లోనై పరుగులు తీస్తున్న స ందర్భం ఒక్కసారిగా భయాందోళనలకు గురి చేసింది. సహజంగా మత్స్యకార కుటుంబానికి చెందిన నేను గతంలో సముద్రంలో ఉప్పెనలు లాంటి సంఘటనలు చాలా సందర్భాలలో చూసి వున్నప్పటికీ ఇలాంటి సంఘటన ఇదివరకు చూడలేదు కాబట్టి కొద్దిగా భయాందోళనలకు లోనైనప్పటికీ ధైర్యం చేసి సముద్ర తీర ప్రాంతంలోకి వెళ్లడం జరిగింది.

మ.12.10

నిజాం పట్టణం ఫిష్షింగ్ హార్బర్‌లో 600 మంది పని చేస్తున్న వారూ, అక్కడి ప్రజలందరూ భయాందోళనలకు గురై రోడ్లకు అడ్డంగా పరిగెడుతున్నారు. ప్రజలు ఆ విధంగా ఇబ్బందులు పడుతున్న సందర్భంలో మానసిక స్థైర్యాన్ని తెచ్చుకొని ఆ ప్రాంతాలలో ఉన్న వారిని మెట్ట ప్రాంతాలకు తరలించడం జరిగింది. ఈ సంఘటన జరిగిన వెంటనే జిల్లాలో కలెక్టరుగారు, హోమ్ మినిస్టరు గారు, కన్నా లక్ష్మీ నారాయణగారు తక్షణమే స్పందించి మధ్యాహ్నం 1.00 గంటకు ఆ సముద్ర ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయడం జరిగింది. ఆ రోజు మాప్రాంతానికి సంబంధించి మూడు వేల మంది సముద్రంలోకి వెళ్లి, మెకనైజ్డ్ బోట్సు ద్వారా హార్బర్ సెంటర్సు నుండి పరికరాల ద్వారా ఆపరేట్ చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుని అందుబాటులో ఉన్న ప్రజలను ఆ బోట్సులో కట్టి తీసుకుని రమ్మని సమాచారం అందించడంతో వారు కూడా జాగ్రత్తగా ఉ.9.30 నుండి మ.1.00 గంటల లోపు తీసుకురావడం జరిగింది. అప్పటికే దాదాపు సుమారు ఏడెనిమిది మంది చనిపోయారని సమాచారం రావడం జరిగింది. అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. ముఖ్యమంత్రిగారు సాయంత్రం నాలుగు గంటలకు వచ్చి మా ప్రాంతంలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రజలను పరామర్శించడం జరిగింది. బ్రతుకు దెరువు కోసం, పొట్ట కూటి కోసం ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ వారు ఆ వృత్తి మీద ఆధారపడక తప్పడం లేదు. సముద్రంలో వేటకు వెళ్లిన వాళ్లు క్షేమంగా వస్తారో, రారో తెలియదు. సంవత్సరానికి ఒకటి , రెండు సార్లు సైక్లోన్ వచ్చినపుడు తీర ప్రాంతంలో ఉన్న మత్స్య కారులు నష్ట పోవడం జరుగుతుంది. గతంలో 1977వ సంవత్సరంలో భయంకరమైన ఉప్పెన చూశాము. అప్పుడప్పుడు అనేక తుఫానులు సంభవించినప్పటికి , మొన్న సంభవించిన సునామీ ప్రభావం వల్ల ఆ ప్రాంత ప్రజలందరూ ఇప్పటికీ తేరుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వ రంగం తాత్కాలికంగా అప్పటికప్పుడు సహాయ కార్యక్రమాలను చేయడం జరిగింది. గతంలో తుఫానులు చూశాము. సునామీ పేరుతో ప్రళయం ఈ మధ్యనే చూశాము. ఎప్పుడు ఏ విధమైన ఉపద్రవం వస్తుందో తెలియదు. కాబట్టి శాశ్వతమైన పరిష్కార మార్గాలు చేయాలని ముఖ్యమంత్రిగారికి తెలియ చేస్తున్నాను.

మా ప్రాంతానికి సంబంధించి సునామీ వల్ల ఏడుగురు చని పోవడం జరిగింది. వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్న పిల్లలు కూడా చనిపోవడం జరిగింది. సహజంగా మెరైన్ యాక్ట్ ప్రకారం ప్రమాదం జరిగినపుడు డెడ్ బాడీ దొరికినప్పుడు మాత్రమే నష్ట పరిహారం చెల్లిస్తారు. డెడ్ బాడీ దొరకని పక్షంలో ఏడు సంవత్సరాల వరకు వెయిట్ చేయవలసిన పరిస్థితులున్నాయి. కుటుంబ సభ్యులు కోల్పోయిన బాధలో ఉండడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులున్నాయి. చనిపోయిన వ్యక్తి చనిపోయాడని నిర్ధారణ చేసుకున్న తరువాత నష్ట పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాను. వాటికి సంబంధించి కొన్ని శాశ్వతమైన ప్రతిపాదనలు చేయవలసిన అవసరం ఉంది. సునామీ సంభవించినప్పుడు ముఖ్యమంత్రిగారు తీర ప్రాంతంలో ఉన్న మత్స్య కారులందరికీ రు.40 వేల ఖరీదుతో 40 వేల ఇళ్ళు మంజూరు చేయడం జరిగింది. ముఖ్యమంత్రిగారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియ చేస్తున్నాను. 1977లో సైక్లోను తరువాత తీరప్రాంతాలలో సైక్లోన్ షెల్టర్సు నిర్మించడం జరిగింది. అవి ఇప్పుడు శిథిలమై పోయాయి. అప్పటి నుండి నిర్మించడం జరగలేదు. తీర ప్రాంతాలలో సైక్లోన్ షెల్టర్సు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. తీర ప్రాంతంలో ఉన్న గ్రామాలలోని రోడ్లు ఈ సంఘటన జరగడం వల్ల చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. ఏ చిన్న సంఘటన జరిగినా సురక్షితమైన ప్రాంతానికి రావాలంటే చాలా ఇబ్బందులు పడి రావాలి. కాబట్టి ఒక ప్రత్యేకమైన ప్యాకేజి తీసుకుని ఇచ్ఛాపురం నుండి తడ వరకు 1100 కి.మీ. వరకు మత్స్యకారుల గ్రామాలతో ప్రధానమైన రోడ్డుకు అనుసంధానం చేస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. సాగునీరుకు, త్రాగు నీరు అనేక గ్రామాలలో చాలా ఇబ్బంది ఉంది. సాగునీరు అందుబాటులో లేకపోవడం వల్ల, త్రాగునీరుకు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. త్రాగునీరుకు సంబంధించి ఒక పైలెట్ ప్రాజెక్టు చేయాలని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను. ఈ తీర ప్రాంతానికి సంబంధించినంత వరకు ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా సముద్రం ఉప్పెనను అరికట్టడం చాలా కష్టంతో కూడుకున్నది. కాబట్టి మడ, సర్వి చెట్ల పెంపకానికి సంబందించినంత వరకు ఒక సెపరేట్ ప్యాకేజి చేయాలని కోరుతున్నాను. బుద్ధ ప్రసాదుగారు చెప్పినట్లు దివి తాలూకా టైమ్‌లో కరకట్ట నిర్మాణం చేయడం జరిగింది. ఈ రోజు సునామీ చూసిన తరువాత అదే విధమైన నిర్మాణం కావాలని తీర ప్రాంత ప్రజలలో ఉంది. కాబట్టి ఆ ప్రాంతాలలో కరకట్ట నిర్మాణం చేయాలని కోరుతున్నాను. ఇది ఒక ముఖ్యమైన సమస్య. సునామీ సంభవించిన తరువాత ధైర్యం చేసి సముద్రంలోకి మత్స్యకారులు వేటకు వెళ్లడానికి భయపడుతున్నారు. వారికి కేజి చేపలు, రొయ్యలు కాని దొరకని పరిస్థితులున్నాయి. అక్కడ చాలా దుర్భరమైన పరిస్థితులున్నాయి. కాబట్టి సముద్ర ప్రాంతంలో వాళ్లకు చేతి పనులు చేయడానికి వీలుగా కార్యక్రమాలు ప్రవేశ పెట్టి ఆదుకోకపోతే వారు చాలా ఇబ్బంది పడతారు. విశాల హృదయంతో గౌరవ ముఖ్యమంత్రిగారు స్పందించి వాటిని పరిశీలన చేస్తారని సభా ముఖంగా తెలియ చేస్తున్నాను. సునామీ వల్ల 105 మంది చనిపోయారు. ఆ కుటుంబాలకు సంబంధించి వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డిః అధ్యక్షా, సునామీ సంధర్భంగా మృతి చెందినటువంటి మన రాష్ట్రానికి చెందిన ప్రజలకు, అనేక రాష్ట్రాలలో , తమిళనాడు ఇతర రాష్ట్రాలలో అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో చనిపోయిన వ్యక్తులకు సంతాప సూచకంగా ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన తీర్మానానికి బిజెపి పార్టీ తరపున మద్దతు ప్రకటిస్తున్నాను. ఈ సునామీలో చాలా పెద్దయెత్తున చిన్న పిల్లలు చనిపోవడం జరిగింది. ఈ రోజు సముద్ర తీరంలో ఉన్న మత్స్యకారులకు సంబంధించి తుఫాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల కారణంగా బాదితులు కావడం జరుగుతుంది. వారికి ప్రభుత్వ పరంగా శాశ్వతమైన భీమా సౌకర్యం కల్పించేలా ఈ సందర్భంగా ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. వారు చనిపోయిన తరువాత ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లాంటి చర్యలకు ప్రయత్నం చేస్తున్నాము. కాబట్టి ఈ సందర్భంగా భీమా సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా శాశ్వత ప్రాతిపదికన ఆలోచన చేయాలని కోరుతున్నాను.

మ. 12.20

ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా అనేక రకాలుగా టెక్నాలజీ పెరిగినప్పటికీ కూడా  చాలా విచారకరమైన విషయం ఏమంటే సునామీకి సంబంధించి తెలుసుకోలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ విషయాన్ని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు  సమన్వయంతో ఆలోచించవలసిన అవసరం ఉంది. సునామీ బాధితుల కుటుంబాలకు మా భారతీయ జనతా పార్టీ తరఫున సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఈ తీర్మానానికి మద్దతు ప్రకటిస్తున్నాను.

శ్రీ జి. సాయన్న (కంటోన్మెంట్): అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను. డిసెంబర్, 26న ఉదయం వచ్చిన సునామీ వల్ల ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఇండొనేషియా, మలేషియా, శ్రీలంక, మన దేశంలో , మన రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాలలో, తమిళనాడులోని ప్రాంతాలలో వేలాది మంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా ప్రతిసారీ నాగపట్నం అనే ప్రాంతంలో వెలంకన్నమాత దర్శనానికి భక్తులు వెడుతూ ఉంటారు.  కంటోన్మెంట్ ఏరియా నుంచి దాదాపు వంద మంది భక్తులు బయలు దేరారు. ముఖ్యంగా మా నియోజక వర్గం నుంచి ఆరుగురు భక్తులు అక్కడ చనిపోతే, ఒక డెడ్‌బాడీ వచ్చింది. అరవై మంది  గంట క్రితం బస్సులో బయలు దేరడం వల్ల బయట పడ్డారు. లేకపోతే వారు కూడా చనిపోయే వారు. సునామీ వల్ల ఇంత భయంకరమైన నష్టం జరిగినా తరువాత మరచిపోవడం జరుగుతుంది. జపాన్ వంటి దేశాలలో ఈ సునామీ గురించి అందరికీ తెలుసు. ఎట్లా వస్తుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దాని పైన భారత దేశం తరఫున అక్కడ అధ్యయనం చేసే అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా బాధితులు చనిపోయినప్పుడు ఒకటి, రెండు డెడ్ బాడీస్ లభిస్తే, వారి కుటుంబాలకే కొంత ఆర్థిక సహాయం చేశారు. రాష్ట్ర మంత్రి నాయని నర్సింహా రెడ్డిగారు మా ప్రాంతానికి వచ్చి, వారికి కొంత సహాయం చేశారు. మిగతా వారికి రాలేదు. కళ్ల ముందే లియో అనే దంపతులు నలుగురు సభ్యులతో చనిపోయారు. డెడ్ బాడీస్ దొరకలేదు. అటువంటి వారికి సహాయం దొరకలేదు. నిర్ధారణ చేసుకుని, కలెక్టర్ గారు కూడా విచారించారు. స్కూల్‌లో ఐడింటిఫై చేసుకోడానికి విచారించాలని చెప్పారు. లేరు అని తెలిసిన తరువాత కూడా ఎటువంటి ఆర్థిక సహాయం లభించలేదు. సునామీ వల్ల ఎదురయ్యే పరిస్థితుల పట్ల అధ్యయనం చేసి, ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుని, సముద్ర తీర ప్రాంతాలకు తగిన హెచ్చరికలు చేసి, రాబోయే కాలంలో ఈ విధంగా వేలాది మంది చనిపోకుండా, కాపాడవలసిన బాధ్యత ఉంది. చనిపోయిన వారి కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

MR. SPEAKER  : I associate myself with the sentiments expressed by the Hon'ble Members and I also offer my condolences.  As a mark of respect to the departed soul, let us observe two minutes silence.

(సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించడం జరిగింది.)

### 3.   ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ్యుడు శ్రీ పరిటాల రవీంద్ర గారి మృతి  గురించి.

డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి: అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ్యులు శ్రీ పరిటాల రవీంద్ర గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సానుభూతిని వ్యక్తం చేస్తూ, శోకార్తులయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది.

అధ్యక్షా, పరిటాల రవీంద్ర గారు గడచిన మూడు శాసన సభలలో సభ్యులుగా ఉండి మనందరికీ బాగా చిరపరిచితులుగా ఉన్నారు. ఆయన చిన్నప్పటి నుంచీ కూడా లెఫ్టిస్ట్ ఉద్యమాలతో బాగా సంబంధాలు కలిగి ఉండి, తన నియోజక వర్గంలో తనకంటూ ఒక ప్రధానమైన వ్యక్తిగా ఎదిగి, రాజకీయంగా బలపడడమే కాకుండా, మూడు సార్లు శాసన సభ్యులుగా ఉండడమే కాకుండా సాంఘిక సేవలలో కూడా బాగా పని చేసే వారు. బీద వారికి పెళ్లిళ్లు చేసే కార్యక్రమంలో చాలా కృషి చేశారు. పెళ్లిళ్లు చేసుకోలేని

ఇబ్బందులలో ఉన్న వారికి పెళ్లిళ్లు చేయించిన మంచి వ్యక్తి అని అంటారు. పోయిన నెల 24వ తేదీన ఆయన హత్య కావించబడడం మనందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మృతి పట్ల ఈ సభ ఏకగ్రీవంగా ప్రగాఢమైన సానుభూతిని వ్యక్తం చెయ్యవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడుః అధ్యక్షా, మొన్నటి వరకు మన ముందు గల పరిటాల రవి గారు ఈ రోజున లేరు. ఆయన మరణం పట్ల నా యొక్క దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నాను. అతి చిన్న వయసులోనే వారు చనిపోవడం జరిగింది. 1957 జూన్, 28న జన్మించారు. 2005లో ఉన్నాము. 47 సంవత్సరాల వయసులోనే చనిపోయారు. ప్రాథమిక విద్య వరకూ నర్సన్నకోటలో చదివారు. పేరూరులో హైస్కూల్ విద్య వరకూ చదివారు. ఆయనకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. 1992లో ఎన్.టి. రామారావుగారు ఉండగా తెలుగు దేశం పార్టీలో చేరారు. ఆయన కానీ ఆయన కుటుంబ సభ్యులు కానీ భూస్వాములకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారు. 1994లో పెనుకొండ శాసన సభ్యుడిగా ఎన్నికయినారు. రామారావుగారి మంత్రి వర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. 1999-04లో రెండు సార్లు శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. వారి జిల్లాలో బడుగు, బలహీన వర్గాల తరఫున పోరాడి, వారికి ఎనలేని సేవలు చేసి, అందరి అభిమానాన్ని పొందారు. 1997లో ఒకసారి ప్రత్యర్థులు ఆయనను చంపాలని అనుకున్నారు. జూబ్లీహిల్స్ కారు బాంబు కేసులో అదృష్టవశాత్తు ఆయన బయట పడ్డారు. రు. 20 కోట్లతో కనగానపల్లి, రామగిరి మండలాలలో మంచి నీటి పథకాలను చేపట్టారు. వంద జనాభా గల అన్ని గ్రామాలకు మంచి నీరు సరఫరా చేయించారు. రు. 40 కోట్లతో గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు వేయించారు. పెనుకొండలో డిగ్రీ కాలేజీ పెట్టించారు. పెనుకొండలో ఆర్.టి.సి డిపోను నెలకొల్పారు. పెనుకొండలో రక్షిత మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. రామగిరి మండలం, పేరూరులో బి.సి రెసిడెన్షియల్ స్కూల్ పెట్టించారు. రామగిరి, రొద్దం లలో జూనియర్ కాలేజీలు పెట్టారు. తన నియోజక వర్గంలో పాఠశాలల స్థాపనకు కృషి చేశారు. జన్మభూమి కార్యక్రమంలో చెరువుల మరమ్మత్తులు చేసినప్పుడు, అనంతపూర్‌లో మేజర్‌గా లీడ్ తీసుకుని అన్ని చెరువులలో పూడికలు తీయించే కార్యక్రమంలో ముందుకు పోయారు. 17 పెద్ద చెరువులలో ఈ కార్యక్రమాన్ని పెద్ద యెత్తున్న చేశారు. ఒక వైపున శాసన సభ్యుడిగా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొంటూనే, విపరీతమైన కరవు జిల్లా అయిన అనంతపూర్‌లో పెళ్లిళ్లు చేసుకోలేని పరిస్థితి ఉంటే, ఈ కార్యక్రమాన్ని పెద్ద యెత్తున నిర్వహించారు. నర్సన్న కోట మండలంలో తిరుమల దేవర ఆలయాన్ని 2001లో రెనోవేట్ చేశారు. ఆ సమయంలో ఏదయినా మంచి కార్యక్రమం చేస్తే బాగుంటుందని అక్కడి పూజారులు చెబితే సామూహిక వివాహాలు రెండు సార్లు చేయించారు. 2003 మే నెల 26వతేదీన306 మంది జంటలకు వివాహాలు చేయించారు. 2004 ఫిబ్రవరిలో 506 జంటలకు వివాహ కార్యక్రమం జరిపించారు. ఒక మన రాష్ట్రంలోనే కాకుండా వేరే రాష్ట్రాల నుంచీ పెద్ద యెత్తున వచ్చేవారు. కర్నాటక బార్డర్ నుంచి కూడా వచ్చి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరవు సమయంలో పెళ్లిళ్లు చేసుకోలేకపోతే, వారికి తోడ్పడే విధంగా ముందుకు పోయారు. ఆయన అనంతపూర్ జిల్లాలో ముఖ్యంగా పెనుకొండ నియోజక వర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాల వారి తరఫున వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. అటువంటి వ్యక్తి ఈ రోజున మన మధ్య లేకపోవడం బాధాకరం. తీరని లోటు. వారి మరణం పట్ల నా విచారాన్ని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను.

మ.12.30

శ్రీ తమ్మినేని వీరభద్రం (ఖమ్మం): అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు, గత మూడు శాసనసభలలో సభ్యునిగా కొనసాగినటువంటి

శ్రీ పరిటాల రవి గారు దారుణంగా హత్య చేయబడడం చాలా విచారకరం. ఆయన మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారి కుటుంబసభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇలాంటి హత్యలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత మన అందరి పైన ఉంది, ఈ రాజకీయాలలో క్రియాశీలక పాత్ర వహిస్తున్న అందరి పైన ఉందని నేను గాడంగా విశ్వసిస్తున్నాను. చనిపోయిన వారికి సంతాపం తెలియజేసే సందర్భంలో సాధరణంగా ఒక మాట వాడుతాము. వారి

మంచి ఆలోచనలను అమలు చేస్తామని, వారి ఆశయాలను సాధిస్తామని అంటాము. నేను ఆ మాట అయితే అనడం లేదు కాని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత మన అందరి పైన ఉంది. పరిటాల రవి గారి హత్య రెండు భాగాలుగా చూడాలని నా అభిప్రాయం. ఆయన వ్యక్తిత్వం, ఆయన వ్యక్తిగత జీవితం ఆ చర్చలోకి పోవడం ఉచితం కాదు. చనిపోయిన వాళ్లందరూ ఏ చెడ్డ అంశాలు లేని వారని నేను అనడం లేదు. ఈనాడు సంతాపం ప్రకటించిన వాళ్లు, గతంలో ప్రకటించిన వాళ్లు, ముందు ప్రకటించబోయే వాళ్లు, అన్నీ మంచి విషయాలు కలిగిన వాళ్లు, ఏ చెడ్డ విషయాలు లేని వాళ్లని నేను అనడం లేదు. మనకు ఒక మంచి సాంప్రదాయం ఉంది. మన దేశంలో, మన రాష్ట్రంలో ఒక సారి చనిపోయిన వాళ్ల చెడ్డ అంతా మరచిపోయి, మంచిని సాధిస్తాము, మంచి ఆశయాన్ని సాధిస్తామని చెబుతూ ఉంటాము. ఆ విషయాలలోకి పోవక్కరలేదు కాని ఈ హత్య, రాష్ట్రంలో కొన్ని ప్రశ్నలను ముందుకు తీసుకువస్తుంది. ఎక్కువ వివరాలలోకి పోవడం సందర్భం కాదు. ఇక్కడ ఫ్యాక్షన్ రాజకీయాలు, ప్రధానంగా ఫ్యాక్షన్లవల్ల ఈ హత్యలు జరుగుతాయనే విషయం ప్రజలు చర్చించుకుంటున్నారు. ఫ్యాక్షన్లు, ఫ్యాక్షన్ల కొనసాగింపు, ఫ్యాక్షన్లలో ఉండే అంతరాయం ప్రజలకు తెలుసు. కాని ఇటీవల ఫ్యాక్షన్ రాజకీయాలు ఎక్కువగా ఉన్నాయి. ఇది గొప్ప పరిణామం, అవాంచనీయ పరిణామం, మన రాష్ట్రానికి శని లాగా దాపురించినటువంటి పరిణామం. ఫ్యాక్షన్లు రాష్ట్ర రాజకీయాలను ఒక చెడు సాంప్రదాయాంగా నడిపిస్తున్న ఇది అతి దురదృష్టకరమైన పరిణామం, అతి ప్రమాదకరమైన అంశంగా మన ముందుకు వచ్చింది. అది ఇవ్వాళ ప్రారంభమైనదని నేను అనడం లేదు. పత్రికలలో రాస్తున్న విషయాలు ఒకటి ప్రజలలో చాలా తీవ్రంగా చర్చ సాగుతున్న విషయం ఒకటి. ఇటీవల కాలంలో వారి ప్రభుత్వం ఉంది. వారి కూడలిని రక్షించుకోడానికి, పరాయి కూడళ్లను అణచివేయడానికి ప్రభుత్వాన్ని ఉపయోగించుకున్నటువంటి పరిస్థితులలో వాటి పైన దృష్టి సారించినప్పుడే ఆ లోటుపాట్లను పరిశీలించినప్పుడు ఈ రాష్ట్ర రాజకీయాలకు విలువ ఉంటుంది. ఈ రాష్ట్ర ప్రజానికానికి రక్షణ ఉంటుంది. మనమంతా రాజకీయ తేడా లేకుండా పునుకోవాలని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నాను. ఈ సందర్భంలో అతి కిరాతకంగా హత్య చేయబడిన శ్రీ పరిటాల రవి గారికి జోహార్లు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చాడా వెంకటరెడ్డి: అధ్యక్షా, 12వ శాసనసభలో మనతో శ్రీ పరిటాల రవి గారు సభ్యునిగా ఉంటూ, అనివార్యంగా హత్యకు గురి కావడం దురదృష్టకరమైన, బాధాకరమైన విషయమని సి.పి.ఐ పార్టీ భావిస్తోంది. వారు వారి నియోజక వర్గంలో వారి ప్రాంతంలోనూ వారు చేసినటువంటి సామూహిక వివాహాలు, ప్రజాసేవ కాని అవన్నీ కూడా అభినందించదగ్గ పరిణామంగా భావిస్తూ ఈ రకమైన పరిస్థితి దాపురించినందుకు మా పార్టీ వైపు నుండి విచారణ వ్యక్తం చేస్తూ పరిటాల రవి గారి మృతికి వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

جناب ممتاز احمد خاں ۔ پرٹیلا رویندرا صاحب ہمارے ایک اچھے ساتھی تھے میں اور ہماری پارٹی مجلس اتحاد المسلمین اس قسم کے قتل کی مذمت کرتی ہے ۔ گروہ واری جھگڑے پچھلے چند سالوں سے ہماری ریاست میں ہو رہے ہیں۔ ان جھگڑوں میں تقریباً 1000 لوگ ہلاک ہوئے۔ حکومت کو چاہیئے کے ان گروہ واری جھگڑوں کو سختی سے کچلنا چاہیئے ۔ میں اور ہماری پارٹی پرٹیلا رویندرا کے افراد خاندان اور ان کی پارٹی کے ساتھ اظہار ہمدردی کرتی ہے ۔

శ్రీ టి. దేవేందర్ గౌడ్ (మేడ్చెల్): అధ్యక్షా, ఈ రోజు సహచర శాసనసభ్యుడు మనందరికీ సన్నిహితుడుగా ఉన్నటువంటి మిత్రుడైన శ్రీ పరిటాల రవి గారు కిరాతకంగా చంపేయబడి, మన మధ్యలో లేకుండా ఉన్నారని తెలియజేస్తున్నాను. ఒక సారి పరిటాల రవి గారి గురించి, ముఖ్యంగా అనంతపూర్ రాజకీయాలలో అతి కీలకమైనటువంటి వ్యక్తిగా ఎదిగారు. 1992లో అనాడు మా నాయకుడు ఎన్.టి. రామారావు రావు పిలుపును అందుకొని తెలుగుదేశం పార్టీలో చేరి పది సంవత్సరాలు, అతి చిన్న పొలిటికల్ కెరీర్‌లోనే రాజకీయాలలో ప్రముఖమైన వ్యక్తిగా ఆ ప్రాంతంలో ఎదిగారు. వారు రాజకీయాలలోకి వచ్చేసరికి

అనంతపురం జిల్లాలో జరిగినటువంటి ఆ నాటి రాజకీయ వ్యవస్థ, ఆ రాజకీయ వ్యవస్థలో అణగారిన వర్గాలకు, అట్టడుగు వర్గాలకు నోరు లేకుండా అణచివేయబడుతున్న రోజులలో అతను రాజకీయాలలోకి వచ్చాడనే వాస్తవాన్ని గ్రహించవలసిందిగా కోరుతున్నాను. ఇద్దరు బి.సిలు అక్కడ నుండి పార్లమెంట్ సభ్యులయ్యారు. ఒక కురువ, ఒక బోయ వ్యక్తులు అప్పుడు ఎలక్షన్స్ వచ్చినప్పుడు, ఖచ్చితంగా వారు గెలుస్తారని, ఏ మాత్రం భయపడకుండా, గట్టి నిర్ణయం తీసుకునేందుకు ఆయన ఎప్పుడూ ముందుకు వచ్చేవారు.

మ.12.40

ఆ విధంగా పార్టీలో కూడా చాలా గట్టిగా బలహీన వర్గాలకు ఎందుకు ఇవ్వకూడదనే విధంగా వాదించేవారు. స్పష్టంగా రాజకీయ ముఖ చిత్రం పైన ఈనాడు బలహీనవర్గాలు రావడానికి ప్రధాన భూమికను పరిటాల రవి వహించారనేది వాస్తవము. అలాంటి వ్యక్తి లేకపోవడం మనకందరకూ బాధగా వుంది. ఒక మంచి మిత్రుడిని కోల్పోయామని మేము ఈ సందర్భములో తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తూ, మీరు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. కేశవ్ (ఉరవకొండ) ః అధ్యక్షా, సహచర శాసనసభ్యుడు, మిత్రుడు అటు జిల్లాలోను, ఇటు రాష్ట్ర స్థాయిలోను తెలుగుదేశం పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకున్నటువంటి పరిటాల రవీంద్ర గారు దారుణంగా చంపబడినటువంటి ఈ హత్యా నేపధ్యంలో ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని ఆమోదిస్తూ వారి గురించిన వివరాలలోకి, చర్చలలోకి పోకుండా వ్యక్తిగతంగా ఆయనకు వున్నటువంటి విలక్షణమైన వ్యక్తిత్వాన్ని మనమందరమూ చూశాము. గత మూడు సభలలో మీరు కూడా శాసనసభ్యులుగా వున్నారు. ఆయన ఏ పని చేసినా కూడా తనకంటూ ఒక ప్రత్యేకత, ఒక ప్రత్యేకమైనటువంటి ధోరణితోనే ముందుకు పోయేవారు. ఆయన ఆది నుండి అంతము వరకు అంటే ఊహ తెలిసిన నాటి నుండి ఊపిరి వదిలే వరకు కూడా ఒక పోరాట మార్గాన్ని ఆయన ఎంచుకున్నారు. ఆయన పరిటాల రవి కాదు, పోరాటాల రవి అని ఆయన అనుచరులు ముద్దుగా పిలుస్తూ వుంటారు. అయితే ఆయన జీవితాన్ని చూసినపడు ఒకటి అనిపిస్తుంది. ఈ మోడ్రన్ సమాజంలో ఖీజ్బి ఝౌట్ట ఝుజీటఋఛ్చీటట్టౌఛీ ఝ్షు అని అనిపిస్తుంది. ఆయనకు వున్నటువంటి ఒక కోణం మాత్రమే విస్తృతంగా ప్రచారం కావించబడింది. అది సంచలనాల కారణంగా అయితేనేమి, పత్రికలలో నెలకొన్న పోటీ కారణంగా అయితేనేమి ఒక కోణం మాత్రమే చాలా విస్తృతంగా ప్రచారమైనది. అయితే తాను నమ్మిన సిద్ధాంతము కోసం, తాను ఎన్నుకొన్న మార్గంలో ముందుకు వెళ్లేటప్పుడు ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎంతటి వారు ఎదురుగా నిలచినా కూడా నమ్మిన సిద్ధాంతము కోసం ఆ పేదవారిని అభివృద్ధి చేయడం కోసం ఎదిరించి ముందుకు పోయినటువంటి మనిషి ఆయన. పరిటాల రవి గురించి మాట్లాడడం అనేది స్థానిక పరిస్థితుల గురించి కూడా మాట్లాడవలసిన సందర్భము ఎక్కువగా వున్నా వారు చేసినటువంటి సేవలను మనం చూసినట్లయితే నేను ఎప్పుడూ చదువుకోలేదు, నా నియోజక వర్గములో చదువుకోని వ్యక్తులు వుండకూడదు అని పాఠశాలల అభివృద్ధి పైన వారు ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరించారు. దాదాపు నాకు తెలిసి ఆ నియోజక వర్గములో ప్రతి చోటా కూడా పాఠశాలలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ, శ్రద్ధ వారు తీసుకొనేవారు. అదే విధంగా మహిళల పట్ల ఆయనకు ప్రత్యేకమైన గౌరవం వుండేది. మహిళల అభివృద్ధి పట్ల, మహిళల పైన వారు చూపిస్తున్న గౌరవభావాలు ఆ ప్రాంతములో ఇప్పటికీ కూడా అందరూ ప్రత్యేకంగా చెప్పుకుంటారు. ఆనాడు వున్న భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా బడుగులకు, బలహీన వర్గాలకు అండగా నిలచి ప్రజా జీవితంలోకి రావడం జరిగింది. ఆనాడు వున్న పరిస్థితులు ఆయన జీవన విధానం వైపు ప్రభావం అయ్యాయి. హత్యల ద్వారా తండ్రిని కోల్పోవడం, అదే మార్గములో ఎన్‌కౌంటర్‌లో సోదరుడిని కోల్పోవడం కొంత ప్రభావితం చేసి ఈ సమాజంలో ఆ బడుగు వర్గాల వారి కోసం నా జీవితంను అంకితం చేయాలని అంటూ రాజకీయాలలోకి వచ్చిన తరువాత కూడా సమాజంలో వున్న అట్టడుగు వర్గాలకు చెందిన అంశాలను చాలా లోతుగా అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ కూడా చర్చల ద్వారా లేవనెత్తి తద్వారా వారందరికీ కూడా లబ్దిని చేకూర్చాలనే విధానంలో ముందుకు పోయిన వ్యక్తి. బలహీన వర్గాలకు ఇళ్లు

నిర్మించడంలో, పేదలకు పెళ్లిళ్లు చేయడంలో, వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడంలో అనంత పురంలో వున్న ప్రత్యేక పరిస్థితులలో వ్యవసాయం మీద ఆయనకు వున్న మక్కువను కూడా ఈ సందర్భముగా గుర్తు చేసుకోవాలి. స్వయంగా పొలంలో గడపడానికి, సేద్యం చేస్తూ కాలం గడపడానికి ఇష్టపడిన వ్యక్తి. ఈ మధ్యనే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాతనే ఆయనకు ఒక ట్రాన్స్‌మిషన్ పీరియడ్‌లో వ్యవసాయంలో ఆయన చేసిన కృషిని అభినందిస్తూ జిల్లా యంత్రాగం ఒక గుర్తింపును, అవార్డ్‌ను ఆయనకు ఇవ్వడం జరిగింది. అక్కడ స్థానికంగా వున్న పరిస్థితులకు అనుగుణంగా ఏ విధమైన పనిముట్లను తయారుచేయాలని అంటూ, సొంతముగా తనే కూర్చొని ట్రాక్టరుకు లేదా నాగలికి లేదా మడకకు చాలా చౌకైన రీతిలో పేద ప్రజలకు ఏ విధంగా చేయాలంటూ వారు చేసినటువంటి ఎన్నో ఎక్స్‌పరిమెంట్లను కూడా మేము అక్కడకు వెళ్లినప్పుడు చూపిస్తూ వుండేవారు. ఒక విధంగా ఆ ప్రాంతములోని పెనుకొండ కోటను ప్రాచుర్యంలోకి తేవాలి, రాయలు ఏలినటువంటి ఈ సీమ గురించి పది మందికి తెలిసేలా ప్రచారంలోకి తేవాలి. పెనుకొండ కోట ప్రాభవాన్ని వెలుగులోకి తేవడం కోసం అటు టూరిజం డిపార్టుమెంట్ ద్వారా, ఇటు ప్రభుత్వం ద్వారా ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. రాయల కాలం నాడు నిర్మితమైన తిరుమల దేవర దేవస్థానం, వెంకటేశ్వర ఆలయం పూర్తి శిథిలావస్థలో వుంటే దాదాపు మూడు, నాలుగు కోట్ల రూపాయలను వెచ్చించి, ఆ ప్రాంతములోని ప్రభుత్వ సహాయ, సహకారాలతోను ఆ దేవాలయాన్ని అభివృద్ధి పరచడం, అక్కడే పెళ్లిళ్లు చేయడం జరుగుతుంది. ఈ రోజున ఏ నిరుపేద అయినా సరే అక్కడ ఏ మాత్రం కష్టపడకుండా, కొంచెము కూడా ఖర్చు లేకుండా పెళ్లి చేసుకొనే సౌకర్యాన్ని కల్పించడం మనం ఈ సందర్భముగా గుర్తు చేసుకుంటున్నాము. మొన్న అక్కడకు వెళ్లినప్పుడు అక్కడి స్థానికులు ఏమి చెబుతున్నారంటే ఈ విద్య, ఈ దేవాలయాలు అన్నీ చూస్తూ వుంటే ఆ నియోజక వర్గములో మ్రోగే ప్రతి గుడి గంటలోనూ, ప్రతి బడి గంటలోనూ ఖచ్చితముగా రవి పేరు వినిపిస్తూ వుంటుందని ఆ ప్రాంత ప్రజలు అనుకుంటూ వుంటారు. రాష్ట్రవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక అభిమానులను తయారు చేసుకున్న వ్యక్తి. వారు లేని లోటు ఈ రోజున వ్యక్తిగతంగా, పార్టీ పరంగా మాకందరకూ తీరని లోటు అన్న విషయాన్ని మీదృష్టికి తెస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని తెలియజేస్తూ ఈ తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యస్. రామలింగారెడ్డి (దొమ్మాట): అధ్యక్షా, సహచర శాసనసభ్యుడు శ్రీ పరిటాల రవి గారి హత్యను తెలంగాణా రాష్ట్ర సమితి తరపున తీవ్రంగా ఖండిస్తూ సంతాపం తెలియజేస్తున్నాను. రాష్ట్రంలో జరిగిన ఈ హత్య మనకు కొన్ని వేల ప్రశ్నలను వెదజల్లింది. ఈ రోజున మనం పెంచి పోషించిన వక్ర పద్ధతులే మనలను దహించి వేస్తున్నాయనే నిజాన్ని ఈ హత్య ద్వారా మనమందరమూ గమనించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఏది ఏమైనప్పటికీ ఈ రోజున నిజంగా పరిటాల రవి గారు అటు బడి గంటలలోనూ ఇప్పటికీ మారు మ్రోగుతున్న వ్యక్తి. బడుగు, బలహీన వర్గాలకు ఎనలేని సేవ చేశాడు. సామూహిక వివాహాలు చేశాడని మనమంతా పొగుడుతున్న వ్యక్తికి కనీసం తొమ్మిది సంవత్సరముల తెలుగుదేశం పార్టీ హయాంలో ఆయనకు ఒక మంత్రి పదవి రాకపోవడం శాసన సభ్యుడిగా నేను చాలా బాధపడుతున్నాను. ముఖ్యంగా ఏ పార్టీ అయినా సరే, ఏ పార్టీ అధికారానికి వచ్చినా సరే అలాంటి నిజాయితీపరులైన శాసనసభ్యులను విస్మరించడం కరెక్ట్ కాదని నేను ఈ సందర్భముగా అన్ని పార్టీల ప్రతినిధులను కోరుతున్నాను. ముఖ్యంగా ఇలాంటి హత్యాకాండలను ఎక్కడికక్కడ బ్రేక్ చేసి, అలాగే హత్యానంతర నిరశన కూడా ఒక శాంతియుత పద్ధతిలో తెలిపే అలవాటును నేర్చుకోవాలని చెప్పి కోరుతూ ముగిస్తున్నాను.

మ 12.50

డా. నాగం జనార్ధన రెడ్డి (నాగర్‌కర్నూల్):- అధ్యక్షా, పరిటాల రవీంద్ర గారు ఈ రోజున మన మధ్యన లేకపోవడం ఎంతో బాధను కలిగిస్తున్నది. వారు దారుణంగా హత్యకు గురికావడం మమ్ములను దిగ్భ్రాంతులను చేసింది. 1997లో ఆ రోజు హెల్త్ మినిస్టర్‌గా ఉన్నప్పుడు ఇక్కడ కారు బాంబులో గాయపడి అపోలో హాస్పిటల్‌లో ఉన్నప్పుడు మొదటిసారి వారితో నాకు పరిచయం ఏర్పడింది. దాని తరువాత ఎప్పుడు కలిసినా నన్ను అన్నా అని ఆప్యాయంగా పలకరించేవారు. వారు హత్యకు గురైన తరువాత ఆ గ్రామంలో హాజరైన పేద జనాన్ని చూస్తే వారికి ఎంత సన్నిహితంగా ఆ పేద ప్రజలతో మెలిగాడో అర్థం అయింది. ఆ రోజు నన్ను

రమ్మని చెప్పి అడిగారు. కాని కొన్ని కారణాల వల్ల వెళ్లలేకపోయాను. వ్యవసాయం మీద కూడా వారికి ఎంతో మక్కువ ఉంది. అక్కడ తోటలు పెట్టారు. అవి చూస్తుంటే అక్కడి వారు చెప్పారు. ఎప్పుడూ ఆ తోటలను చూస్తూ అక్కడే ఉండి ఆయన, ఆయన భార్యా మధ్యాహ్నం భోజనం అక్కడే చేసేవారని చెబుతుంటే ఆయనకు వ్యవసాయం మీద కూడా ఎంత మక్కువ ఉందో మన అందరికీ అర్థం అవుతోంది. ఈనాడు ఆయన లేని లోటు మా పార్టీకే కాకుండా ఆ ప్రాంత ప్రజలకు ఎంతో తీరని లోటు. వారి యొక్క అకాల మరణానికి చింతిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలనికోరుకుంటూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. కిషన్ రెడ్డి:- అధ్యక్షా, శాసన సభ్యులు పరిటాల రవీంద్ర గారి మృతికి నేను నా తరఫున, మా పార్టీ తరఫున సంతాపం వ్యక్తం చేస్తున్నాను. తాను నమ్మిన సిద్ధాంతాలకోసం తాను అనుకున్న బాటలోప్రయాణం సాగించిన వ్యక్తి. తుది శ్వాస వరకూ కూడా పోరాటం నడిపిన వ్యక్తి. వారి కుటుంబం కూడా పూర్తిగా ప్రజలతో ముడిపడి ఉన్నది. హత్యకు సరిగా 40 నిముషాల క్రితం మా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి ఫోన్ చేసి మా రాష్ట్ర అధ్యక్షులతో జడ్.పి ఎలక్షన్స్ విషయంలో మాట్లాడారు. ఆరకంగా భారతీయ జనతా పార్టీతో సత్‌సంబంధాలు ఉన్న వ్యక్తి. నిజంగా ఈ రోజు పేద ప్రజల కోసం అనేక రకాలుగా ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి. మూడు సార్లు శాసన సభ్యులుగా గెలిచి ఈరోజు మనలను విడిచి వెళ్లడం, అదీఅతి కిరాతకంగా హత్య కాబడడం ఎంతో దారుణమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతిని వ్యక్తం చేస్తున్నాను. వారికి మా భారతీయ జనతా పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను.

శ్రీ బి.సి. గోవిందప్ప (కళ్యాణదుర్గ్):- అధ్యక్షా, ఈరోజు ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన పరిటాల రవీంద్ర గారి యొక్క సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ నేను ఎంతో బాధను వ్యక్తపరుస్తున్నాను. రవీంద్ర గారు నాకు చాలా సన్నిహితుడు. ఈ రోజు నేను మూడవ సారి శాసన సభ్యుడిని అయ్యానంటే ఆయన చలవే. నన్ను శాసన సభ్యుడిగా చేసింది ఆయనే. లేదంటే మూడవ సారి నేను శాసన సభ్యుడిగా అయ్యే అవకాశం చాలా తక్కువ అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ప్రతి ఒక్కమనిషీ పుడతాడు. చనిపోతాడు. సహజం. కానీ అందరిలో చెరగని ముద్ర వేసుకున్నాడు. ఈరోజు పెనుకొండ నియోజకవర్గాన్ని చూస్తే తెలుస్తుంది. గత ఎన్నికలలో ఆయన ఎలక్షన్ కాంపైన్‌కు వెళ్లకపోయినా కూడా శాసన సభ్యునిగా గెలిచాడు అంటే నిజంగా గర్వకారణం. అందుచేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిపోయాడు అంటే అతిశయోక్తి కాదు. కొందరు వారి మనసులలో వేరే రకంగా అనుకోవచ్చు కానీ వాస్తవం తెలుసుకోవాలని గుర్తు చేస్తున్నాను. వారి కుటుంబంలో శ్రీరాములు గారు, హరి గారు కానీ ఆ భూస్వామ్య పోరాటంలోనే వారికి సమస్యలు ఏర్పడ్డాయి కానీ వారి వ్యక్తిగత సమస్యలు కాదని చెప్పి నాకు తెలిసినంతవరకు తెలియజేస్తున్నాను. ఆ పోరాటం వల్ల బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచాడు. రవి చనిపోయిన రోజున సంతాప సభకు లక్షలాది మంది బడుగు బలహీన వర్గాల వారు వచ్చారంటే అది ఒక మచ్చుతునక అని మనవి చేస్తున్నాను. ఈ రోజు ముఖ్యంగా చాలా బాధాకరమైన విషయం. ఇంత కాలం ఒక శాసన సభ్యుడిగా ఉండి ఇప్పుడు మన ముందు లేకపోవడం నిజంగా బాధాకరమైన విషయం. ఆ రోజు జనవరి 24 వ తేదీన అతి దారుణంగా హత్య కావడం చాలా బాధాకరమైన విషయం. ఆ రోజు జరిగిన పరిస్థితి చూస్తుంటే చాలా మందికి బాధ కలిగింది. కాబట్టి దయచేసి ఇలాంటి దానికి అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్క శాసన సభ్యునికి రక్షణ కలిగించే బాధ్యత ముఖ్యంగా ప్రభుత్వం పైన ఉంది. ఆయన పరిస్థితి గురించి నా ప్రాణానికి ప్రమాదం ఉందన్న సంగతి తనకు రక్షణ కలిగించాలని ఎన్నోసార్లు చెప్పాడు. ప్రభుత్వం ఇలాటి వారికి రక్షణ కలిగించాలని కోరుకుంటున్నాను. ఇలాటివి పునరావృతం కాకుండా ఉంటే బాగుంటుందని తెలియజేస్తున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చిన స్పీకర్ గారికి నా హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి. నరేంద్ర కుమార్ (పొన్నూరు):- అధ్యక్షా, పరిటాల రవీంద్ర గారి యొక్క హత్యని తీవ్రంగా ఖండిస్తున్నాను. 1994 నుంచి నిన్నటి వరకు మన మధ్య ఉండి ఈరోజున లేరు. పెనుకొండ నియోజక వర్గంలో ఎన్నో రకాలైన అభివృద్ధి కార్యక్రమాలు

చేపట్టిన రవీంద్ర ఈనాడు మన మధ్యన లేకపోవడం చాలా దురదృష్టకరం. అంతే కాకుండా ఆ కుటుంబం యొక్క నేపథ్యం చూసినా ఉద్యమాలలో పని చేసి పేద ప్రజల పక్షాన పోరాడిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి. 1992 లో ప్రజా జీవితంలోకి వచ్చి స్వర్గీయ ఎన్.టి. రామారావు గారి యొక్క స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీలో చేరి రాజకీయాలలో చేరిన వ్యక్తి పరిటాల రవీంద్ర. ఆయన కొంత కాలం కార్మికశాఖ మంత్రిగా పని చేశారు.
మ.1.00

ఆయన గత పది సంవత్సరాలుగా పెనుగొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాలను కూడా చేపట్టడం జరిగింది. ఇంతకుముందు మాట్లాడిన గౌరవసభ్యులు చెప్పినట్లుగా సామూహిక వివాహ కార్యక్రమాలు, జీర్ణ దేవాలయాల పునరుద్ధరణ మొదలైన సామాజికపరమైన కార్యక్రమాలను కూడా వారు చేపట్టడం జరిగింది. ఆయన పేద ప్రజల కోసం పోరాటం చేసిన వ్యక్తి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన చనిపోయినప్పుడు ఆయనకు అశ్రుతర్పణం వదలడం కోసం లక్షలకొలది ప్రజానీకం తరలిరావడం మనం చూశాము. పరిటాల రవిగారు శాసనసభలో నా పక్కనే కూర్చునేవారు. వారు మొదటి సమావేశాలకు వచ్చారే గాని ఆ తరువాతి సమావేశాలకు రాలేకపోయారు. ప్రజాస్వామ్యంలో మనం ఏ దిశకు పయనిస్తున్నామనేది ఆలోచించవలసిందిగా ఈ సందర్భంగా కోరుతున్నాను. ఈ రాష్ట్రంలోని ఒక ప్రజా ప్రతినిధి శాసనసభకు రాలేని పరిస్థితిలో వున్నాడంటే , సమస్య తీవ్రతను మనం గమనంలోకి తీసుకోవ లసిన అవసరం వుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మనకు లభించే అవకాశాలను ప్రజలకోసం వినియోగించి పనిచేయడం జరుగుతోంది. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకం సమస్య వుండవచ్చు. ఆయా ప్రాంతాలలోని సమస్యల తీవ్రతను దృష్టిలో వుంచుకొని , ప్రజా ప్రతినిధులకు రక్షణ లేని పరిస్థితులు వున్నప్పుడు వారికి రక్షణ కల్పించవలసిన అవసరం ఎంతయినా వుంది. లేనట్లయితే ప్రజా ప్రతినిధులు ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వుంటుంది. ప్రజా ప్రతినిధులకు రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వం తగువిధంగా ఆలోచించి రక్షణ కల్పించాలని కోరుతున్నాను. నిన్నటి దాకా నా పక్కనే కూర్చునే వారు రవి. వారు తమకున్న అవగాహనతో ఎన్నో విషయాల మీద మాట్లాడే వారు. వారు అనేక సమస్యల విషయంలో మా అందరినీ ఎన్‌లైటెన్ చేసిన సందర్భాలు వున్నాయి. అటువంటి రవీంద్ర ఈనాడు మన మధ్య లేరు. వారికి, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. రంగనాయకులు (హిందూపూర్): అధ్యక్షా, పరిటాల రవీంద్రగారి నియోజకవర్గం పెనుకొండ. నేను పక్క కాన్‌స్టిట్యుయెన్సీకి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. వారు నాకు చాలాకాలం నుండి చిరపరిచితులు. ఒక విలక్షణమైన వ్యక్తి పరిటాల రవీంద్ర గారు. వారు తమ నియోజకవర్గమైన పెనుకొండను అనేక కోణాల్లో అభివృద్ధి చేస్తూ వచ్చారు. ఆయన జిల్లా కంతటికీ సంబంధించిన వ్యక్తి. జిల్లాలోని మంచినీటి సమస్య విషయంలో కానివ్వండి, సాగునీటి సమస్య విషయంలో కానివ్వండి , ఇతర సమస్యల విషయంలో కానివ్వండి ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువచ్చి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేసిన వ్యక్తి రవీంద్ర గారు. మా అనంతపురం జిల్లా వెనుకబడిన జిల్లా . అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ ప్రజల మన్ననలను చూరగొన్న వ్యక్తి వారు. వారు రెండు మూడు పర్యాయాలు సామూహిక వివాహ కార్యక్రమాలను చేపట్టారు. అంతే కాకుండా భూస్వామ్య వర్గాన్ని వ్యతిరేకిస్తూ పేద ప్రజల కోసం పోరాటం సల్పిన వ్యక్తి పరిటాల రవీంద్ర. ఆయన కుటుంబం ఈ పోరాటం మూలంగానే గుర్తింపు పొందింది. డిగ్రీ కాలేజెస్, రక్షిత మంచి నీటి పథకాలు , జీర్ణ దేవాలయాల పునరుద్ధరణ, పేదప్రజలకు సహాయం మొదలైన విషయాలలో అనంతపురం జిల్లాలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన వ్యక్తి పరిటాల రవీంద్ర. అటువంటి రవీంద్రగారు దారుణంగా హత్యచేయబడ్డారు. వారికి, వారి కుటుంబానికి ఆత్మశాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. ప్రజాస్వామ్యంలో మనుగడ చాలా ముఖ్యం .నేను ప్రభుత్వాన్ని అర్థిస్తున్నాను. సభ్యులు ఏ పార్టీ వారయినా వారికి రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. రవీంద్ర గారి కుటుంబానికి మనశ్శాంతి కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ , సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER: This House places on record its deep sense of sorrow at the demise of Sri Paritala Ravindra, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family.

Sri Paritala Ravindra represented Penukonda Assembly Constituency, Ananthapur District from 1994 till his death on 24th January, 2005. He was Minister for Labour & Employment during 1994-95 in Sri N.T. Rama Rao's Cabinet. He resigned to his seat in the Assembly in 1995 in protest against lack of development in Ananthapur and he was re-elected in bye-election in 1996. He tried for the welfare of backward classes and daliths in his Constituency.

He was 48 years.

As a mark of respect to the departed souls let us observe two minutes silence.

(The House then stood in silence.)

MR. SPEAKER: The House is adjourned to meet again at 8.30 A.M on Wednesday, the 16th February, 2005.

(The House then adjourned at 1.08 P.M to meet again at 8.30 A.M on 16th February, 2005.)

- - -